17-11Pg1exHNWMJQE 1 ONG_17-11Pg1exHNWMJQE.qxd 17/Nov/25 12:13 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital

నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-11-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 286 పేజీలు: 12 వెల: 6.50

## రాజ్యాంగంవల్లే హక్కులపై కోర్టుల్లో అప్పీలు

### సిజెఐగా ఇది నా చివరి కార్యక్రమం: గవాయ్

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. 75 యేళ్ల భారత రాజ్యాంగంపై ఎపి హైకోర్ట్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ హాజరయ్యారు. ఎపి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబులు సిజెఐ బిఆర్ గవాయ్‌కు స్వాగతంపలికారు. జ్యోతి ప్రజల్వనచేసి సదస్సును ప్రారంభించిన సిజెఐ గవాయ్, ప్రారంభిం >>2



ఆదివారం విజయవాడలో ఎపి హైకోర్ట్ న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న సిజెఐ జస్టిస్ గవాయ్, హైకోర్టు సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబు

# మన విధానం 'నేషన్ ఫస్ట్'

### చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే రాజ్యాంగ ఔన్నత్యమే కారణం
### గవాయ్ వంటి జస్టిస్ గైడెన్స్ అవసరం
### 75 యేళ్ల రాజ్యాంగ సదస్సులో సిఎం చంద్రబాబు
### హాజరైన సిజెఐ గవాయ్, హైకోర్టు సిజె ఠాకూర్

**విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** నేషన్ ఫస్ట్ అనే విధంగానే ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అన్నారు. సోషల్ ఈక్వాలిటీ, ఎకనామిక్ ఈక్వాలిటీ ఉండే సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం కన్పిస్తోందని... ఈ రకమైన సమానత్వాన్ని సాధించడానికి పబ్లిక్ పాలసీలు కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలో అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సికె కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయవాదుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిజెఐ జస్టిస్ గవాయ్, ఎపి హైకోర్టు సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఛాయ్ వాలాగా జీవితాన్ని ప్రారంభించిన నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నారంటే అందుకు భారత రాజ్యాంగమే కారణమనిఅన్నారు. ఇలాంటి సందర్భంలో అంబేద్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానిగా నరేంద్ర మోడీ అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారని వివరించారు.

**ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థే**

సమాజంలో ఏమైనా తప్పిదాలు జరిగితే వాటిని సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థేనని ముఖ్యమంత్రి అన్నారు. 'సోషల్ మీడియా వచ్చాక ప్రతి ఒక్కరూ ఎడిటర్లు అయిపోతున్నారు.. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారని అభిప్రాయపడ్డారు. వన్ పర్సన్ - వన్ ఓట్.. అనేది అంబేద్కర్ ఇచ్చిన వరం. కొన్ని దేశాల్లోని ఓటర్లకు సమాన హక్కులు >>2

## రూ. 50 లక్షల కోట్లపెట్టుబడులు ఐదేళ్లలో రాక

### విశాఖ సిఐఐ సదస్సు ఫలితంగా రానున్న రూ. 13 లక్షల కోట్లు పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా ఎపికి ప్రపంచ గుర్తింపు

### ఇక వివిధ రంగాల సత్వర అభివృద్ధి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా ఎపిని ప్రపంచం గుర్తించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిఐఐ పెట్టుబడులదారుల భాగస్వామ్య సదస్సు అత్యంత విజయవంత మైందన్నారు. ఎనర్జీ, పర్యాటక, అతిథ్యేయ, విద్యా, ఎఐ, క్వాంటం కంప్యూటస్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్, రవాణా రంగాల్లో పెట్టుబడుల ద్వారా లాభాలను అర్జించేందుకు అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు పలు విదేశీ సంస్థలు ఆసక్తి చూపాయన్నారు.ముఖ్యంగా డ్రోన్స్ ఇతర రంగాల్లో యువత ఆంధ్ర పట్ల మొగ్గు చూపిందన్నారు. వివిధ దేశాల నుంచి 30కి పైగా మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. భాగస్వామ్యాలు, పెట్టుబడులు, ఎంవోయూలు ఇలా 67 సెషన్లను రెండ్రోజుల్లో నిర్వహించగలిగామని సిఎం వివరించారు. 45దేశాల్లో మనసమ్మిట్ చర్చనీయాంశమైందన్నారు. విశాఖ పేరు మార్మోగుతోందంటే టీం వర్క్‌తోనే ఇది సాధ్యమైంది. దావోస్‌లో ఎంవో యూలు బయట జరుగుతాయి. ప్రపంచం ఏ దిశగా ముందుకు వెళుతోంది అన్నారు. భవిష్యత్ ఏ విధంగా ఉంటుంది, ఎదురయ్యే సవాళ్లు, అందివచ్చే అవకాశాలపై మెయిన్ వెన్యూలో చర్చిస్తారు అన్నారు. కానీ వినూత్న పద్ధతిలో విశాఖ సమ్మిట్‌కు మనం శ్రీకారంచుట్టాం. ఎవరికి ఏ సబ్జెక్ట్ పైన ఆసక్తి ఉంటే ఆ సెమినార్‌కు సమ్మిట్‌లో అంతా ప్లానింగ్ తో నిర్వహించామన్నారు.ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది, పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో కలిగించారు అని అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. విధ్వంసపాలనకు చరమగీతం పలికారు. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని >>2

# ఇక పంచాయతీలకు ఐఎస్ఓ గుర్తింపు

### రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గ్రామాల ఎంపిక

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 24 గ్రామ పంచాయితీలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు కోసం కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 52 పంచాయితీలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి తొలి దశలో 24కు గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటోంది. రెండోదశలో మిగిలిన 28 పంచాయితీల్లో ఏర్పాట్లు చేయనుంది. ప్రజలకు అందిస్తున్న పౌర సేవలు,దస్త్రాల నిర్వహణ, సుపరిపాలన, ఘనవ్యర్థాల నిర్వహణ,పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం, ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన పంచాయితీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీల్లో పలు సంస్కరణలు తీసుకొస్తోంది. పాలనలో పారదర్శకత, మెరుగైన పౌరసేవల కోసం చర్యలుతీసుకుంటోంది. తాజాగా 'స్వర్ణ పంచాయితీ' పోర్టల్‌ను ప్రారంభించింది. కేరళ స్ఫూర్తితో ఐఎస్‌వో గుర్తింపునకు ఇప్పుడు అడుగులు వేస్తోంది. ఆ రాష్ట్రంలో 941 పంచాయితీలు,152 బ్లాకులు, ఐఎస్‌వో గుర్తింపు సాధించాయి. దేశంలో ఈ ఘనత సాధించిన తొలి రాష్ర ంగా కేరళ గుర్తింపు సాధించింది. ఏపీలో 19 జిల్లాల్లో ఎంపిక చేసిన 25 పంచాయితీల్లో ఆరు నెలల క్రిందట కసరత్తు ప్రారంభమైంది. కేరళకు చెందిన స్థానిక పరిపాలనా వ్యవహారాల సంస్థ సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించు కుంటోంది. ఐఎస్‌వో ప్రమాణాల మేరకు 80% పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. నెలాఖరులోగా మిగతా 20% పూర్తి చేసి ఐఎస్‌వో గుర్తింపునకు నివేదించనున్నారు. దీనిపై సంబంధిత ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని సర్టిఫికెట్ కోసం సిఫార్సు చేయనుంది. సేవలు,నాణ్యత,భద్రత,ఉత్పత్తులు,సామర్థ్యం వంటి అంశాల్లో తగిన ప్రమాణాలు పాటించే సంస్థలకు జెనీవా ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది ప్రభుత్వేతర సంస్థ.160కి పైగా సభ్య దేశాలు ఈ సంస్థకు అనుబంధంగా ఉన్నాయి. ఇందులో భారత్ కూడా ఒకటి. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు,పరిశ్రమలు ఐఎస్‌వో గుర్తింపు పొంది నిర్ధేశిత గడువు తర్వాత మళ్లీ పునరుద్దరించుకుంటాయి. వీటిలో స్థానిక ప్రభుత్వాలూ ఉన్నాయి. దేశంలో మహారాష్ట్ర,ఒడిశా ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల్లో పంచాయితీలకు ఐఎస్‌వో గుర్తింపునకు తాజాగా ధరఖాస్తు చేశాయి.రాష్రంలో ఎంపిక చేసిన పంచాయితీల్లో పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురాను న్నారు. ప్రతి కార్యాలయంలోనూ ఫ్రంట్ ఆఫీస్‌ప్రజలు తమ సమస్యలు ఒకరి తర్వాత మరొకరు సిబ్బందికి తెలిపేలా టోకెన్ సిస్టంసమస్యలు పరిష్కరించాక ప్రజల మొబైల్ ఫోన్లకు సమాచారం అందుబాటులోకి అనేక దశాబ్ధాల క్రితం నాటి దస్త్రాలుప్రజలు అడిగిన సమాచారం నిర్ధేశిత గడువులోపు ఆచరించే ఏర్పాట్లు మరణ, జనన ధ్రువీకరణ,ఇతర సర్టిఫికెట్లు గంటల వ్యవధిలో జారీ చేసే వ్యవస్థ 500 రకాలైన సేవలు ప్రజలకు తెలిసేలా సమాచార బోర్డుల ప్రదర్శనసేవలపై ఏటా అంతర్గత ఆడిట్‌నైపుణ్యాలు పెంచుకునేలా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ కార్యాలయాలకు వచ్చేవారికోసం ఆవరణలో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, చంటిపిల్లల సంరక్షణ కేంద్రాలు ఉంటాయి. పంచాయి తీలను నూతన సంస్కరణలతో పట్టణ పాలకసంస్థలకు దీటుగా రూపొందిస్తు న్నామని డిసిఎం పవన్ వెల్లడించిన నేపథ్యంలో ఐఎస్ఓ గుర్తింపుకు కృషి జరుగుతుంది.

## మరో ఎన్‌కౌంటర్

### మహిళ సహా ముగ్గురు మావోయిస్టుల మృతి

2వ

## ప్రభుత్వ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం

### పెరిగిపోతున్న అప్పులు: మాజీ సిఎం జగన్



**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్సీ అధినేత జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ పూర్తిగా విఫలమైందని, ఆదాయం పడిపోతూ అప్పులు భారీగా పెరుగుతున్నాయని ఆరోపించారు. కాగ్ విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ ఆయన ట్వీట్ చేశారు.

"2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన గణాంకాలు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో చాలా నిరుత్సాహకరమైన వృద్ధిని వెల్లడిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఆదాయాలు వేగంగా పెరుగు >>2


రైలు నుంచి కిందపడిన బొమ్మను పరిశీలిస్తున్న ఎస్పీ సిబ్బంది

## వీడని సతీష్ మృతి మిస్టరీ

### బొమ్మతో బండారం బయటపడేనా?

### మొన్న రెండు, నిన్న మూడు బొమ్మలతో పరిశీలన

**తాడిపత్రి, నవంబరు16, ప్రభాతవార్త:** టిటిడి మాజీ ఎవిఎస్‌వో సతీష్‌కుమార్ హత్యకేసు బండారాన్ని బొమ్మతో బయటపెట్టాలనే పోలీసుల ప్రయత్నం ఏ మేరకు ఫలించనుందోననే విషయం ఆసక్తికరంగా మారింది. శుక్రవారం సతీష్ మృతి సంఘటన చోటు చేసుకున్నప్పటి నుంచి రాష్ట్రంలో ఈ కేసు దర్యాప్తుపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. శనివారం రెండు బొమ్మలు ఒక రైలు..ఆదివారం మూడు బొమ్మలు..ఒక రైలును వినియోగించిన పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా సతీష్ మృతిపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించాలని ప్రయత్నిస్తున్నారు. జిఆర్‌పి నుంచి కేసును బదిలీ చేసుకున్న తాడిపత్రి పోలీసులు ఆదివారం సంఘటనా స్థలంలో మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌ను ప్రయోగించి ఘటన జరిగిన తీరును అంచనా వేసే ప్రయత్నం చేశారు. ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి నేతృత్వంలోని పోలీసు బృందం చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్‌లో మూడు బొమ్మలను ఉంచి వివిధ రకాలుగా ప్రయోగ పూర్వక చర్యలు చేపట్టారు. సతీష్‌కుమార్ ఎత్తుకు, బరువుకు సమానంగా ఉండేలా మూడు బొమ్మలను తయారుచేసి నిలబడిన స్థితిలో తోస్తే ఎలా..కూర్చున్న స్థితిలో ప్రమాదవ >>2





ఆదివారం సూరత్‌లో బుల్లెట్ రైలు స్టేషన్ నిర్మాణం పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

# పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలపై తర్జనభర్జనలు

## ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ విధానం టోకెన్లు విడుదలపై కుదరని ఏకాభిప్రాయం!, రేపు టిటిడి బోర్డు సమావేశంలో నిర్ణయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో మోక్షమార్గం వైకుంఠద్వారం పదిరోజులు తెరచి దర్శనాలు చేయించే విధానంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. గతంలోలాగా వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ద్వారదర్శనం(డిసెంబర్ 30,31తేదీలు)పర్వదినాలతోబాటు మరో ఎనిమిదిరోజులు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల చేయడంతోబాటు ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్(ఎస్ఎస్‌డి)టోకెన్లు జారీ విధానంపై టిటిడి బోర్డు, అధికారులు ఒక నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఇప్పటికే ఈ అంశంపై బోర్డు, టిటిడి అధికారులు పలు దఫాలుగా సమాలోచనలు చేసినా సామాన్యభక్తులను దృష్టిలో ఉంచుకుని ఎలా అమలుచేస్తే సాఫీగా ప్రశాంతంగా తిరుమలకు చేరుకుని వివాదాలు లేని వైకుంఠద్వార దర్శనం చేసుకోగలరనే విషయంపై అధికారులు తలలుపట్టుకుంటున్నారు. పదిరోజులకు సంబంధించి తిరుపతిలో ప్రత్యేక కౌంటర్లు అదనంగా ఏర్పాటుచేసి పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఒకేసారి టోకెన్లు జారీచేయాలా లేక ఆయా రోజులకు సంబంధించి ఏరోజుకారోజు టోకెన్లు జారీచేయడం వల్ల సమస్య పరిష్కారం చేయగలమా అనే చర్చ సాగుతున్నాయి.పదిరోజులకు సంబంధించి టోకెన్లు పూర్తిఇక్కడివరకు జారీ చేసినా భక్తులు తిరుమలకు చేరుకోవడంపై ఆందోళనలు రేకెత్తుతున్నాయనిది ప్రధాన సమస్య.అంతేగాక గతంలోలాగా టోకెన్లు,టిక్కెట్లు లేని భక్తులను తిరుమలకు అనుమతించాలా?లేదా అనేది కూడా ఇప్పుడు గందరగోళంగా మారింది. ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకుండా అనుమతించినా భక్తుల రద్దీని నియంత్రించడం చాలా కష్టంగా మారుతుందనేది అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. డిసెంబర్‌నెల అందునా వర్షాలు కురిసినా, చలిగాలులు,మంచు ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. దీనివల్ల తిరుమలకు భక్తులను అనుమతించినా రెండులక్షలమందివరకే పరిస్థితులు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదనేది టిటిడి అధికారులు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత ఏడాది పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు దాదాపు 7.80లక్షల మంది భక్తులకు కల్పించారు. ఇందుకోసం 2024 డిసెంబర్‌నెలలోనే పదిరోజులు ముందే ఆన్‌లైన్‌లో (పది రోజులకు) 1.59లక్షల ఎస్ఇడి టిక్కెట్లు విడుదల చేయడం జరిగింది. అలాగే ఆఫ్‌లైన్‌లో (పది రోజులకు) 4లక్షల టైమ్‌స్లాట్ (ఎస్ఎస్‌డి)ఉచిత టోకెన్లు జారీ చేశారు. వీరేగాక వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో వివిఐపిలు, వివిఐపి స్వయంగా వచ్చి వైకుంఠద్వారంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ నేపధ్యంలో గత జనవరిలో చోటుచేసుకున్న ఘటనలతో టిటిడి అధికారులు ఇప్పుడు తీసుకునేనిర్ణయంపై దర్శనాలు అనుమతించే విధానం మంగళవారం (రేపు)తిరుమలలో జరగనున్న టిటిడి బోర్డు ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలోసమావేశంలో ఖరారుకానుంది.

**గత ఘటనలతోనే అధికారుల్లో భయం!:**
సాక్షాత్తు మహావిష్ణువే కలియుగంలో ఏడుకొండలవేంకటేశ్వరస్వామిగా భక్తులను కటాక్షిస్తున్నారని, ఆలయంలోపల వైకుంఠద్వార దర్శనం చేసుకుంటే పాపాలనుంచి విముక్తిలభించి మోక్షం లభిస్తుందని కోట్లాదిమంది భక్తుల విశ్వాసం. ఇదే ప్రగాఢనమ్మకంతో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివస్తారు. 2019వరకు ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు మోక్షం కల్పించేవారు. ఆ రెండురోజులు అన్ని ప్రత్యేక దర్శనాలు ,ఆర్జితసేవలు రద్దుచేసి గతంలో ఎలాంటి టోకెన్‌లేని భక్తులు కూడా తిరుమలకు చేరుకుని సాఫీగా ప్రశాంతంగా 1.80లక్షలమంది వరకు వైకుంఠద్వార దర్శనం చేసుకునేవారు. అందుకు తగ్గట్టు అప్పటి టిటిడి బోర్డు, ఉన్నతాధికారులు ప్రణాళికలు అమలుచేసి పటిష్టంగా ఏర్పాట్లుతో ముగించారు. అయితే 2020వ సంవత్సరం నుండి గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు పెద్దలు పదిరోజులు వైకుంఠద్వారాలను తెరచి భక్తులను అనుమతించేలా చూస్తున్నారు. దీనివల్ల భారీగా భక్తులు తరలివస్తుండటంతో నియంత్రించలేక విఫలమై ఈ ఏడాది జనవరి 8వతేదీ తిరుపతిలో దురదృష్టవశాత్తు ప్రత్యేక కౌంటర్ల వద్ద తొపులాట తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుని భక్తులు ప్రాణాలు కోల్పోయారు.
దీంతో ఇప్పుడు మళ్ళీ పదిరోజులు వైకుంఠ ద్వారదర్శనాలు కొనసాగిస్తున్నా భక్తులను అనుమతించే విషయంపై కీలక నిర్ణయాలు ఓ కొలిక్కిరాలేదు. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో జారీచేస్తే ఎలా అమలుచేయాలి?పూర్తిగా ఆన్‌లైన్‌లో జారీచేస్తే సామాన్యభక్తులు, తిరుపతి స్థానికులు అందుకోలేక మరింత గందరగోళం నెలకొనే పరిస్థితులు తలెత్తుతాయి. ఇకపోతే భేరీజు వేసుకుని డిసెంబర్ 30,31తేదీల్లో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల టోకెన్లు స్థానికులకు మాత్రమే కేటాయిస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2026 జనవరి 1వతేదీ సంబంధించి అన్ని దర్శనాలు రద్దుచేసినా పూర్తిగా మిగిలిన వైకుంఠ దర్శనాలు వల్ల కొంతవరకు భక్తుల రద్దీని నియంత్రించే అవకాశం ఉంటుందనేది అధికారుల ఆలోచన. మరో రేపు మంగళవారం జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో ఎలాంటి నిర్ణయం వెలువడనుందనేది భక్తుల్లో ఉత్కంఠగా మారింది.

**మోక్షమార్గం దర్శనాలకు అనూహ్యస్పందన:**
తిరుమల ఆలయంలో వైకుంఠద్వారాలను ప్రతి ఏడాది ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో తెరచి దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ రోజుల్లో వైకుంఠద్వారాలలో ఇష్టదైవాన్ని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోయి మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. తిరుమల ఆలయంలో స్వామివారికి కుడివైపున వైకుంఠద్వారం ఉంది. వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే 48గంటలు పాటు (రెండు రోజులు మాత్రమే)తెరచివుంచి భక్తులకు దర్శనం కల్పించేవారు. ఆ తరువాత భక్తుల నుండి వస్తున్న అనూహ్యస్పందనతో శ్రీరంగంలోని రంగనాధస్వామి ఆలయం తరహాలో తిరుమల ఆలయంలోనూ పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు తెరచి సామాన్యభక్తులకు మోక్షం కల్పిస్తున్నారు. సామాన్యభక్తులు, ధనవంతులు టిక్కెట్లు,టోకెన్లు లేకుండా నేరుగా ఆ పది రోజులు తిరుమలకు వస్తే ఆలయంలోనికి ప్రవేశించే అవకాశం కూడా ఉండదు.

# మన విధానం 'నేషన్ ఫస్ట్'

>> ఉండవని.. ఓటు హక్కు విషయంలో పేదధనిక, లింగ బేధాలు లేని దేశంగా భారత్ దేశం ఉందని చెప్పారు. ఓటు విషయంలో ఇలా పేదధనిక తారతమ్యాలు ఉన్నాయని.. ఈ అంతరాలను తగ్గించేలా అందరూ ఆలోచన చేయాలని సిఎం సూచించారు. అందరికీ సమాన అవకాశాలు కలిగేలా చేయగలిగితే.. ఈ తారతమ్యాలు మాయం అవుతాయని అభిప్రాయపడ్డారు. అందుకే నేను 'హెల్ప్, వెల్త్, హ్యాపీ సొసైటీ' రూపకల్పనకు ప్రణాళికలు రచిస్తున్నామని.. దీనికి అందరి నుంచి సహకారాన్ని కోరుతున్నా" అని సిఎం చెప్పారు. ప్రధాని మోదీకూడా వసుధైక కుటుంబం గురించే మాట్లాడతారని.. ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కర్నీ మన కుటుంబ సభ్యులుగానే భావించాలని.. వసుధైక కుటుంబం భావన ఉండాలని వివరించారు. అలాగే ఒకరి సార్వభౌమాధికారంలో వేరే వారు జోక్యం చేసుకోకుండా పరిధులు దాటకుండా ఉండాలని.. ఈ విధానాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోవాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పిందని సిఎం చంద్రబాబు అన్నారు.

**గవాయ్ లాంటి వ్యక్తులు గైడ్ చేస్తూనే ఉండాలి**
జస్టిస్ బీఆర్ గవాయ్ సిజెఐ స్థాయిలో ఉన్నా... చాలా సింపుల్‌గా ఉంటారని ముఖ్యమంత్రి చెప్పారు. సమానత్వానికి సిజెఐ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని... చాలా మంచి మనస్సున్న వ్యక్తి జస్టిస్ గవాయ్ అని చెప్పారు. ఈన విని నిర్వహణలో గవాయ్ మంచి తీర్పులు ఇచ్చారని... ప్రజలంతా ఆ తీర్పులు గుర్తు పెట్టుకునేలా ఉంటాయని చంద్రబాబు అన్నారు. గవాయ్ లాంటి వారు దేశాభివృద్ధి కోసం నిరంతరం గైడ్ చేస్తూనే ఉండాలని కోరారు. "అమరావతిలో ఈ సదస్సు జరుగుతోంది... సిజెఐ బీఆర్ గవాయ్ కూడా మహారాష్ట్రలోని అమరావతి నుంచే వచ్చారని సిఎం వివరించారు. తాను సిఎంగా, సిజెఐగా గవాయ్, ఏపి హైకోర్టు సిజెగా ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నామని... మేం మా విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వర్తిస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**దేశంలో పెద్దఎత్తున మానవ వనరులు**
ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానం మారిందని.. పరిస్థితులు కూడా మారుతున్నాయని సిఎం చంద్రబాబు చెప్పారు. చాలా దేశాలు యువత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని.. కానీ భారత దేశానికి అలాంటి సమస్య లేదు. మన దేశంలో పెద్ద ఎత్తున మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని.. భారత దేశాన్ని ప్రపంచంలో నెంబర్1 స్థానంలో నిలిపేలా ప్రధాని పనిచేస్తున్నారని చెప్పారు. 2047 నాటికి ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ప్రభావం చూపే స్థాయికి చేరుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఐటిని ప్రమోట్ చేయాలనే విధాన నిర్ణయం తీసుకున్నామని... హైదరాబాద్ అభివృద్ధే దానికి నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

# రాజ్యాంగంవల్లే హక్కులపై కోర్టుల్లో అప్పీలు

>> చారు. ఈ సందర్భంగా సాంఘిక ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చేసిన ప్రసంగం ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలని చెప్పారు. రాజ్యాంగాన్ని అంబేడ్కర్ ఓ స్థిర పత్రంగా చూడలేదని కాలానుగుణంగా మార్పులు అవసరమనే భావించారని తెలిపారు. కొన్ని అంశాల్లో సవరణ సులభమని కాని మరి కొన్ని అంశాల్లో చాలా కఠినమని జస్టిస్ గవాయ్ చెప్పారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మరుసటి యేడాదే రిజర్వేషన్ల అంశంపై మొదటి సవరణ చేసుకున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గతేడాది ఏడుగురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందని జస్టిస్ గవాయ్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రిమీలేయర్ విధానం ఉండాలన్నది నా అభిప్రాయమని పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండరాదని విశాఖ కేసు తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు. మరో 2 రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నాను. సిజెఐగా ఇది నా చివరి కార్యక్రమం. నా స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతి. సిజెఐగా నా చివరి కార్యక్రమంలో కూడా అమరావతిలోనే కావడం విశేషం. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. సాంఘిక, ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనను నియమించిన తర్వాత తొలిసారిగా ఎపి రాజధాని అమరావతికి వచ్చానని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలోనఎపి హైకోర్టు సిజె జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మైలురాళ్లు అధిగమించాం అన్నారు ప్రజలందరికీ సమాన అవకాశాలు, జవాబుదారీతనం ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. పేదలకు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలకు వివిధ అంశాల్లో రక్షణ కల్పించేలా రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య భావన, సోషల్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగ రచన చేశారు. రాజ్యాంగానికి 1951 సంవత్సరంలో తొలి సవరణ చేస్తే.. ఇప్పటి వరకు 106 రాజ్యాంగ సవరణలు జరిగాయి అన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం, వర్క్ ప్లేసులో మహిళలపై వేధింపుల నిరోధక చట్టం, లోకాయుక్త చట్టం ఇలాంటి వాటి ద్వారా న్యాయ వ్యవస్థలో మార్పులు వచ్చాయి అన్నారు.

# రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్ష సూచన

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో బుధవారం వరకూ తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో, సోమ, మంగళ వారాల్లో ఏపీ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, శ్రీసత్యసాయి వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని అంచనా వేస్తోంది. అల్పపీడనం ప్రభావంతో కోస్తా తీరం వెంబడి గంటకు 35 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశ ముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని సూచించింది. ఈ నెల 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. దీని ప్రభావంతో 24 నుంచి 27 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో పక్క రాష్ట్రంలో చలి తీవ్రతం కొనసాగుతోంది. తెలంగాణ, ఒడిశా సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో అత్యల్పంగా 7 డిగ్రీలు నమోదైంది. అదే జిల్లా లోని డుంబ్రిగుడలో 7.6, హుకుంపేట, ముంచంగిపుట్టులో 8.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## వారం - వర్జ్యం

17-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
త్రయోదశి పూర్తి
చిత్త తె.5.01, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.11.19-1.07
దు.మ.12.16-1.01, 2) మ.2.32- 3.17
శుభసమయం : ఉ.9.15 - 9.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం :** పలుకుబడి కలిగినవ్యక్తులతో పరిచయాలు లాభిస్తాయి. సోదరుల నుండి వచ్చిన వార్తవల్ల ఆనందం కలుగుతుంది.

**వృషభం:** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. ప్రయాణాలు. సంతానం ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. శ్రమ ఫలించే సమయం.

**మిథునం:** ముఖ్య వ్యవహారాలలో తొందర పాటు వద్దు. వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. పట్టుదలతో ముందుకు సాగుతారు.

**కర్కాటకం:** పాత మిత్రలను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వస్తు, వస్త్రాలాభాలు పొందుతారు.

**సింహం:** కార్యాలయములో ఉన్నతాధికారుల మెప్పును పొందే శుభసూచనలు ఉన్నాయి. పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కన్య :** నూతన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. శ్రమకు తగ్గిన ఫలితం దక్కుతుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**తుల :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు. బాంధవ్యాల యత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం మిత్రలుగా మారి సాయం అందిస్తారు. సంగీత సాహిత్యా విషయా లలో ఆసక్తి చూపుతారు. వస్త్రలాభాలు.

**ధనుస్సు:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడుతారు. వృత్తివ్యాపారాలు విస్తరిస్తారు.

**మకరం:** రాజకీయ, కళారంగాల వారికి విదేశీ యోగం. వాహన సౌఖ్యం. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**కుంభం:** మరిన్ని లాభాలు కోసం అదనపు మార్గాలను అన్వేషిస్తారు, అంతంత ఫలితాలు సాధిస్తారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు.

**మీనం :** స్త్రీలలో విభేదాలు ఏర్పడే సూచనలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించండి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రూ. 50 లక్షల కోట్ల పెట్టుబడులు ఐదేళ్లలో రాక

>> గెలిపించారు. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. 700కు పైగా బీటూబీ సమావేశాలు జరిగాయన్నారు. మొత్తంగా రూ.13లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. సిఐఐ సదస్సు కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే కాదని అన్నారు. మేధోపరమైన చర్చలకు, వినూత్న ఆవిష్కరణల్ని పంచుకునేందుకు కూడా దేశవిదేశాల నుంచి పారిశ్రామిక వేత్తల్ని, మేధావుల్ని, విదేశీ ప్రతినిధుల్నికూడా ఆహ్వానించాంఅన్నారు. 500 మంది విద్యార్థు లను సెలెక్ట్ చేసి ఈ సిఐఐ సదస్సుకు ఆహ్వానించాం అన్నారు ఔత్సాహిక పారిశ్రామికవేత్త లుగా వారిని మార్చాలన్నదే మా ఉద్దేశం అన్నారు. ఆస్పిరెంట్ ఇండస్ట్రియలిస్ట్సుగా వారిని మార్చే అవకాశం ఉంటుంది అన్నారు. ఆర్టీఐహెచ్ ద్వారా వినూత్న ఆవిష్కరణల్ని, ఆలోచనల్ని, స్టార్టప్‌లను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం యువత, విద్యార్థుల ఆలోచనలకు ఇదో వేదిక కావాలన్నదే మా ఉద్దేశం అన్నారు.
ఇదోక వినూత్నమైన పారిశ్రామిక అభివృద్ధి మోడల్. కేంద్ర ప్రభుత్వం క్వాంటం మిషన్ తీసుకువచ్చింది. క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేసి దానిని మనం అందిపుచ్చుకున్నాం అన్నారు. 2026 జనవరికి క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతుంది అన్నారు. గ్రీన్ ఎనర్జీ లేకపోతే గూగుల్ డేటా సెంటర్ రాదు. ఎకోసిస్టం తయారైంది కాబట్టే మరో నాలుగైదు డేటా సెంటర్లు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఈజ్ నుంచి గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వచ్చాం. సింగపూర్‌ను ఒప్పించి మళ్లీ రాష్ట్రానికి తీసుకువచ్చాం. అమరావతిలో భాగస్వామి కాకపోయినా ఇతర ప్రాంతాల్లో కలిసి పనిచేసేలా ఒప్పించాం. బ్రాండ్ దెబ్బతింది. రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు ఈ 18 నెలల్లో వచ్చాయి. 17 లక్షల ఉద్యోగాలుకూడా వస్తాయి. పరిశ్రమలకు విశ్వాసం కల్పించాలనే దేశంలో ఎక్కడా లేనట్టుగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నాం. దీనికి సావరిన్ పవర్‌ను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. గుడ్ గవర్నెన్స్, డెవలప్మెంట్‌పై శ్రద్ధపెడతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. 10 ఏళ్లలో 1 ట్రిలియన్ డాలర్లు కోటిమందికి ఉద్యోగాలు తీసుకురావటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అన్నారు. శ్రీకాకుళంనుంచి కుప్పం వరకూ అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతోంది. ఎంఎస్ఎంఇ పార్కులు, పోర్టులు, రైలు, రోడ్ లాంటి ఇన్ ఫ్రా అభివృద్ధి చేస్తున్నాం. ఈస్ట్ టు వెస్ట్ లాజిస్టిక్స్ డెవలప్ చేయాలని నిర్ణయించాం అన్నారు. డీప్ టెక్నాలజీలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం, ఏరోస్పేస్, క్వాంటం, ఏఐ, 12శాతం కాదు. సీరియస్ ఇన్వెస్టర్స్‌తోనే మాట్లాడి ఒప్పందాలు చేసుకున్నాం అన్నారు. 8.8 లక్షల కోట్లు పెట్టుబడులు కేబినెట్‌లో క్లియర్ చేసి ఉత్పాదన దశకు వస్తాం అన్నారు. 20 లక్షల కోట్ల పెట్టుబడులు మెటీరియలైజ్ అవుతుంది అన్నారు. ప్రతీ 15 రోజులకూ ఎస్ఐపీసీ, ఎస్ఐపిబి సమావేశాలు, విజన్ డాక్యుమెంట్, 25 పాలసీలు పెట్టుకుని ప్రోత్సహిస్తున్నాం అన్నారు. గతంలో బకాయిలు పెట్టిన పరిశ్రమలకూ ఇన్సెంటివ్‌లు ఇచ్చాం. బ్రాండ్ ను రివైజ్ చేసుకుని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో వెళ్తున్నాం అన్నారు. 3 ఏళ్లలోనే ఈ పెట్టుబడులు అన్నీ ఉత్పత్తి దశకు వస్తాయి, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ దీనిని పర్యవేక్షిస్తుంది. అన్నారు పరిశ్రమలు వచ్చేందుకు ఇప్పటికే మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అలాగే వాటికి ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కూడా మా వద్ద విధానం ఉంది. మొత్తంగా ఎకనామిక్ యాక్టివిటీ రివైవ్ అవుతుంది. జీఎస్టీ ఆదాయం కూడా వస్తుంది అన్నారు.



ఆదివారం పాట్నాలోని హరిమందిర్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించిన కేంద్ర మంత్రి పాశ్వాన్

# నితీశ్ ప్రమాణోత్సవానికి హాజరుకానున్న ప్రధాని



**పాట్నా, నవంబరు 16:** బీహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని పాట్నా గాంధీ మైదానంలో ప్రమాణస్వీకారానికి సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎవరనేది కూడా లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది. అయితే పాశ్వాన్, మాంఝీ వంటి నేతలు నితీష్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. సిఎం పదవిలో నితీష్ కొనసాగుతారని చెబుతున్నారు. ఈ నెల 19 లేదా 20 తేదీన నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా, ఎన్‌డిఎ కూటమి మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఇక కొత్త ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా సోమవారంనాడు నితీష్ మంత్రివర్గం సమావేశమై త్వరలో గడువు తీరనున్న అసెంబ్లీని రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం నితీష్ తన రాజీనామాను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు సమర్పిస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తారు. ఆ తరువాత ఎన్‌డిఎ ఎమ్మెల్యేలతో సమావేశమై శాసనసభా పక్ష నేతగా నితీష్ కుమార్‌ను ఎన్నుకోనున్నారు. 243 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌డిఎ కూటమి 202 స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహాగఠ్ బంధన్ 35 స్థానాలకు పరిమితమైంది. దీంతో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 19 లేదా 20న బీహార్ సిఎంగా నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కేబినెట్ కూర్పు కోసం కూటమిని ప్రతి పార్టీకి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి చొప్పున నితీష్ కుమార్ ప్రభుత్వం చోటు కల్పించనున్నట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్‌కుమార్ సహా ఎన్‌డిఎ కూటమి సీనియర్ నేతల సమావేశంలో ఈ మేరకు అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. ఈ ఫార్ములా ప్రకారం, బిజెపికి కేబినెట్‌లో సింహభాగం వాటా దక్కనుంది. కమలం పార్టీకి 15 నుంచి 16 మంత్రి పదవులు లభించే అవకాశముంది. జెడియుకు 14, ఎల్‌జెపికి 3 మంత్రిపదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది. జితిన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హెచ్‌ఏఎం (సెక్యులర్)కు ఒకటి, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ ఆర్‌ఎల్‌ఎంకు ఒక మంత్రి పదవి దక్కే వీలుంది. కాగా, కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారం తేదీని ఇంకా ప్రకటించనప్పటికీ సాధ్యమైనంత త్వరలోనే ఉండవచ్చని తెలుస్తోంది.

# మరో ఎన్‌కౌంటర్

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 జనవరి నుండి ఆపరేషన్ ఖగార్ పేరిట నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో దండకార్యాలను జల్లెడ పడుతుండడంతో 23 మాసాలుగా ఇప్పటికే వందలాది మంది నక్సల్స్ మృతి చెందగా సుమారు 300 మంది ఛత్తీస్‌గఢ్, మహరాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాల ముందు లొంగిపోయిన విధితమే. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు జెజ్జి, చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమల్‌పాడ్ అటవీ ప్రాంతంలో జిల్లా రిజర్వుడ్ భద్రతా బలగాలకు నక్సలైట్లకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు దళ కమాండర్స్‌తో పాటు ముగ్గురు మరణించినట్లు సుకుమా జిల్లా పోలీస్ సూపరిండెంట్ కిరణ్ ఛవాన్ ఆదివారం సాయంత్రం విలేకరులకు వెల్లడించారు. మృతి చెందిన వారిలో మద్వీదేవా అలియాస్ జెనివి లిథియా కమాండర్‌తో పాటు మరో మావోయిస్టు మహిళా కోంత ఏరియా కమిటి దళ కమాండర్ పోడియం గంగి ఇద్దరి దళ కమాండర్ లు మృతి చెందగా మరో మహిళ నక్సలైట్ కిస్తారామ్ ఏరియా కమిటి దళ సభ్యురాలు సోడి గంగి మృతి చెందినట్లు ఎస్‌పి కిరణ్ ఛవాన్ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టు ఒక్కొక్కరిపై 5 లక్షల రూపాయల చొప్పున రివార్డు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మృతి చెందిన మావోయిస్టుల నుండి కిట్ బ్యాగ్‌లు, 303 రైఫిల్స్, బిజిఎల్ లాంఛర్లు, ఇతర ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

**ఇప్పటికైనా లొంగిపోండి: బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజన్**
ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో దండకారణ్యంలో మిగిలిపోయిన మావోయిస్టులు ఇప్పటికైనా ఆయుధాలతో వచ్చి ప్రభుత్వానికి లొంగిపోతే ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందని, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుందని, ఆయుధాలు దించి లొంగిపోవాలని బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజన్ మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం చివరి దశలో ఉందని, ఆ ఉన్న కొద్దిమంది అయిన ప్రభుత్వానికి లొంగిపోతే ప్రాణాలు దక్కుతాయని, హింసను విడిచిపెడితే పునరావాసం కల్పిస్తామని సుందర్‌రాజన్ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం

>> తాయని టిడిపి, జనసేన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వ ఆర్థిక పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. 2025- 26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో గతేడాదితో పోలిస్తే కేవలం 7.03 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్ల వినియోగానికి అద్దం పడతాయి. ఈ రెండింటి ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే కేవలం 2.85 శాతం మాత్రమే పెరిగింది.
గత రెండేళ్ల (2023-24 నుంచి 2025- 26) మొదటి అర్ధభాగంలో రాష్ట్ర సొంత పన్ను రాబడి వార్షిక వృద్ధి రేటు కేవలం 2.75 శాతంగా ఉంది. ఇది మరింత ఆందోళన కలిగించే విషయం. అయినా, రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని చంద్రబాబు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 2024 -25లో 12.02 శాతం, 2025-26లో 17.1 శాతం జీఎస్‌డీపీ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని వారు చెబుతున్నారు. ఈ స్థాయిలో వృద్ధి ఉంటే పన్నుల రాబడి కూడా 12 శాతం నుంచి 15 శాతం వరకు పెరగాలి. కానీ వాస్తవ వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే. మరోవైపు, మూలధన వ్యయం గత రెండేళ్లలో మైనస్ 16 శాతం వార్షిక వృద్ధి రేటుతో క్షీణించడం మరింత బాధాకరమని జగన్ అన్నారు.

# వీడని సతీష్ మృతి మిస్టరీ

>> శాత్తు పడితే ఎలా..ఆత్మహత్యకు పాల్పడితే ఎలా అనే విషయాలను బొమ్మల ద్వారా పరిశీలనాత్మకంగా ప్రయోగించి చూశారు. మొదటి బొమ్మను నిల్చోబెట్టి కిందకు పడవేయగా అది 61 అడుగుల దూరంలోనూ, రెండవ బొమ్మ నిలబడి ప్రమాదవశాత్తు కాలు జారేలా చేయగా అది 88 అడుగుల దూరంలోనూ, మూడవ బొమ్మ కూర్చొని జారి పడగా 46 అడుగుల దూరంలో పడిపోవడాన్ని పోలీసులు డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. ఈ కేసు విచారణలో కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. రైల్వే టిసి, ఇతర సిబ్బందిని విచారించిన పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ దృశ్యాలను చిత్రీకరించారు. సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి కేసులో ఆదివారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన ప్రయాణించిన రైలులో లభించిన లగేజి సంచిపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఆయన 29వ సీటు రిజర్వు చేసుకుంటే 11వ సీటులోకి సదరు లగేజి ఎలా వచ్చిందనే అంశం అనుమానాస్పదంగా మారింది. తిరుపతి ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు అప్పగించారని చెబుతున్న ఈ లగేజి బ్యాగును ఎవరు అప్పగించారనే అంశం కూడా సందిగ్ధంగా మారింది. ఆదివారం సుమారు 5 గంటల పాటు కొనసాగిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా కేసు దర్యాప్తు వేగవంతం కానుందని పోలీసు వర్గాలు తెలిపాయి. టిటిడి పరకామణి కేసులో కీలక అధికారిగా ఉన్న పూర్వ ఎవిఎస్‌వో సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి కేసును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు, సాధ్యమైనంత త్వరగా కేసు దర్యాప్తును పూర్తి చేసి దోషులను కోర్టుముందర పెట్టాలనే పట్టుదలతో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. శవపరీక్ష నివేదిక రావాల్సి ఉండటం, సతీష్ చరవాణితో పాటు ఆయన భార్య చరవాణిని కూడా సాంకేతిక సాయంతో పరిశీలించిన వివరాలు బహిర్గతం కావాల్సి ఉండటంతో ఇప్పుడే పూర్తి వివరాలు వెల్లడించలేమని పోలీసులు చెబుతున్నారు.



ఆదివారం రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, సుప్రీం మాజీ సిజె ఎన్.వి.రమణ తదితరులు

# ఆలోచనలను సంస్థలుగా మార్చిన రామోజీ

## రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

## నమ్మిన సిద్ధాంతాలను వదలని అక్షరయోధుడు: సిఎం చంద్రబాబు

### రామోజీ పేరే ఒక బ్రాండ్: తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు16:** తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని, సమస్యల పరిష్కారం కోసం సీఎంలు ముందుకు వస్తే సహకరిస్తామని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల సమస్యలు కుటుంబంలోని సమస్యల్లాంటివే, కలిసి కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. రామోజీ ఒక కుగ్రామం నుంచి వచ్చి ఎంతో గొప్పస్థాయికి చేరారని, ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి రామోజీరావు అని ఆయన పేర్కొన్నారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా రామోజీరావు స్పందించేవారని చెప్పారు. రామోజీరావు దానం చేస్తూ ప్రజలను భాగస్వాములను చేసేవారని,సమాజానికి స్ఫూర్తిగా నిలవడమే ఓ గొప్ప విజయమన్నారు. మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సూచించారు. ఏఐ యుగంలో ఫేక్ న్యూస్‌ను కనిపెట్టడం సవాలుగా మారిందని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన రామోజీరావు సేవలు చిరస్మరణీయమని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయని, ఆయన స్ఫూర్తి ఎందరికో ఆదర్శమని అన్నారు. అక్షర యోధుడు రామోజీరావుకు నా ఘన నివాళలు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. సమాజంలో ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు, ఆ లోటును రామోజీరావే తన పత్రిక ద్వారా భర్తీ చేసేవారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజల గొంతుకగా నిలిచారు. ఆయన కేవలం ఒక మీడియా అధినేత మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కలిగిన ఒక మార్గదర్శకుడు అని ప్రశంసించారు. నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది. ఈనాడు పత్రికను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, ప్రజలను సమాజ సేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, తన సొంత డబ్బుతో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు. రామోజీరావుకు తెలుగు భాషపై ఉన్న మమకారాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రామోజీరావు స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు భాష పరిరక్షణ, దాని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తానని, రామోజీరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపైనా ఉంది అని ఆయన స్పష్టం చేశారు. రామోజీరావు సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ రెండువేల ఎకరాల కళాఖండమని, తెలంగాణకు నాలుగో అద్భుతంగా ఆర్ఎఫ్‌సీ నిలిచిందని కొనియాడారు. పొంతన లేని వివిధ రంగాల్లో ఒకే వ్యక్తి రాణించడం చాలా కష్టం. రామోజీరావు రోజుకు 18 గంటలు శ్రమించే వారు. రామోజీ ఏ రంగంలో అడుగుపెట్టినా తనదైన ముద్ర వేసేవారు. రామోజీ అవార్డు గొప్ప గౌరవంగా భవిష్యత్‌లో నిలుస్తుంది. రామోజీరావు స్ఫూర్తిని భావితరాలకు మనం అందించాలి. పదవుల గురించి సీఎంలకు తాను సిఫార్సు చేయలేదని నిక్కచ్చిగా చెప్పేవారు. రామోజీరావు పేరు కాదు, ఒక బ్రాండ్. రామోజీ గ్రూప్ సంస్థలకు మా సంపూర్ణ సహకారం ఉంటుంది. రామోజీ ఆశయాలు ఆలోచన చేసిన కుటుంబసభ్యులను అభినందిస్తున్నా. రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులు భావించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, కేంద్రమంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండిసంజయ్, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ ఐటీ,పరిశ్రమల శాఖ డి. శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ వంటి ఏడు విభాగాల్లో ఈరామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. రామోజీరావు ఆదర్శాలను,ఆయన సేవా దృక్పథాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ అవార్డులను ఏర్పాటు చేసినట్లు రామోజీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు తెలిపారు.





మీట్ ది ప్రెస్‌లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

# ప్రశ్నార్థకంగా మారిన ఎన్నికల సంఘం

## సమగ్ర సంస్కరణలు అవసరం

## సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్థకమైందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు ఆవశ్యమని ఉద్ఘాటించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందన్నారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశపరిచాయన్నారు. దీనిపై వారు నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో డి. రాజా మాట్లాడారు. దేశం నేడు సంక్లిష్ట పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నదని, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆర్ఎస్ఎస్ తపాలా బిళ్ళను, ఆ సంస్థ శత వార్షికోత్స వం సందర్భంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ నగర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు ఐజేయూ సభ్యులు షేక్ బాబు. సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ .రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.

## అమరావతి భూ సమీకరణ పంచాయతీల్లో

# రూ.1305 కోట్లతో మౌలిక సదుపాయాలు

### అమరావతిలో 423 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్లు టెండర్లు పిలిచిన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్

**రాజంపేట, నవంబరు 16 ప్రభాతవార్త:** రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు శుభవార్త. సి ఆర్ డి ఏ భూములు సమీకరించిన గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎట్టకేలకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చర్యలకు కార్యాచరణ సిద్ధం చేసింది. రోడ్లు, డ్రైనేజీ, అవెన్యూ ప్లాంటేషన్లు, విద్యుత్, మొత్తం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, నిర్మాణం పనులు చేపట్టేందుకు ఎడిసిఎల్ ఆదివారం టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. రాజధాని జోన్ 8 తో పాటు రాజధాని అమరావతి చుట్టుపక్కల జోన్ల అభివృద్ధికి కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ప్రభుత్వం భూములు సమీకరించిన కృష్ణాయ పాలెం, వెంకట పాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామపంచాయతీలలో 1305.39 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టనుంది. అలాగే రాజధానికి వరద ముప్పు లేకుండా 8400 క్యూసెక్కుల వరద నీటిని పంపింగ్ చేసేం దుకు ప్రపంచ బ్యాంక్, ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో 423.64 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచింది. అలాగే రాజధాని నీటి అవసరాలు తీర్చేందుకు కొండవీటి వాగు, గుంటూరు ఛానల్ లకు రెగ్యులేటర్ కూడా ఏర్పాటు చేస్తారు. రెండు లైన్ల బ్రిడ్జిని కూడా నిర్మించేందుకు 55 కోట్లతో టెండర్లు పిలిచారు.1784 కోట్ల ఏంతో పిలిచిన టెండర్లను పనులు చేపట్టడంతో పాటు పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు నిర్వహణ చేసేందుకు కూడా టెండర్లలో షరతు విధించారు. టెండర్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమవుతుంది. టెండర్లలో పాల్గొ నేందుకు డిసెంబర్ 9 చివరి గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేసి నిర్మాణ సంస్థను ఖరారు చేస్తారు.

# 'సిట్'వద్దకు రాలేను, విచారణకు హైదరాబాద్‌కు రండి

## మాజీ టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి సమాచారం

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని వెంట సేవకుడిగా సేవలందించిన టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కల్తీనెయ్యి కేసులో విచారణ చేయడానికి సిబిఐ సిట్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఇప్పటికే ఆయనకు సిట్ అధికారులు గత వారమే నోటీసులు జారీచేశారు. అయితే కొన్ని అనివార్యకారణాల వల్ల 13వతేదీ ,16వతేదీ విచారణకు రాలేనని 17వతేదీ తరువాత వస్తానని సమాచారం



ఇచ్చారు. ఇప్పుడు ఆయన ఏకంగా తనకివారం సిట్ అధికారులకు తనదైన శైలిలో సమాచారం ఇవ్వడం, తనకు ఆరోగ్యం సరిగా లేనందున తిరుపతిలోని సిట్ తాత్కాలిక కార్యాలయానికి రాలేనని, వీలైతే 20వతేదీ హైదరాబాద్‌లోని తన ఇంటికి వచ్చి విచారణ చేయవచ్చని తెలిపారు. దీంతో సిట్ అధికారులు ఇప్పుడు అనుసరించే వ్యూహం ఏంటనేది కల్తీనెయ్యి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రిమాండ్‌లో ఉన్న నిందితుల్లో మరింత ఆందోళన నెలకొందని తెలుస్తోంది. ఇదేసమయంలో వైవి మాజీ పిఏ చిన్నఅప్పన్నను కస్టడీకి తీసుకునే అంశంపై నేడు నెల్లూరు ఏసిబి కోర్టు తీర్పువెలువరించనుంది. ఒకవేళ కోర్టు కస్టడీకి ఇస్తే అప్పన్నను కూడా హైదరాబాద్‌కు తీసుకెళ్ళి సుబ్బారెడ్డితో బాటు కలిపి విచారణ చేస్తారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20వతేదీ విచారణకు వస్తున్నామని సిట్ కూడా ఆయనకు సమాచారం అందించడం విశేషం.

# రాజకీయాల్లోకి మోహనరంగా కుమార్తె ఆశా కిరణ్

**విజయవాడ, నవంబరు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** దివంగత వంగవీటి మోహనరంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లో క్రియాశీలకం కానున్నారు. విజయవాడలో ఆదివారం తన తండ్రి వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. రాధా రంగా మిత్రా మండలి ఆహ్వానం మేరకు తాను ఇకపై కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. తన తండ్రి



రంగా ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆశా కిరణ్, ఇకపై తన ప్రయాణం పూర్తిగా బహిరంగంగా, ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాధా రంగా మిత్రా మండలి మధ్య ఉన్న గ్యాప్‌ను పూరించడానికి తాను వస్తున్నానని ఆశా కిరణ్ స్పష్టం చేశారు.

# అప్పు చెల్లించమని అడిగినందుకు హత్య

## కర్ణాటక పోలీసుల అదుపులో నిందితులు

**కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త:** తన పెదనాన్న కుమారుడి వద్ద నుంచి తీసుకున్న నలభై లక్షల అప్పు తిరిగి చెల్లించక ఎగ్గొట్టాలని భావించి వరుసకు అన్న అయ్యే వ్యక్తి మరొకరి సాయంతో తమ్ముడినే హతమార్చి ఇంటి కింద గుంతలో పూడ్చి పెట్టిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పంలో ఆదివారం వెలుగుచూసింది. ఈసంఘటనకు సంబంధించి కర్ణాటక, ఆంధ్ర పోలీసు అధికారులు తెలిపిన మేరకు కుప్పం పట్టణంకుచెందిన కమలనాథ్ కుమారుడు శ్రీనాథ్ తనకుటుంబంతో బెంగళూరులో స్థిరపడ్డాడు. శ్రీనాథ్ చిన్నాన్న అయిన బలరాం కుమారుడు ప్రభాకర్ డికెపల్లిలో ఉంటూ 2013లో ఓ హత్య కేసులో నిందితుడుగా ఉండడంతో జైలుకు వెళ్లి 2022లో బయటకు వచ్చాడు. ఇతని భార్యది ముద్దనపల్లి. కాగా ప్రభాకర్ బెంగళూరులో శ్రీనాథ్ ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యాడన్నారు. ఈ నేపథ్యంలో శ్రీనాథ్ బాగానే ఉండడంతో అతన్ని వ్యాపారం చేద్దాం అరవై లక్షలు పెట్టుబడి పెట్టు ఏడాది లోపే లాభాలు వస్తాయని చెప్పి ప్రభాకర్ శ్రీనాథ్ నుంచి దాదాపు 40లక్షలు అప్పు తీసుకున్నాడు. అయితే ఏడాది అనంతరం ఎలాంటి లాభం



కర్ణాటక పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ఇవ్వలేదు, శ్రీనాథ్ ఈవిషయంపై ప్రభాకర్‌ను అడిగాడు. చివరకు తన పాప ఆరోగ్యం బాగా లేదని పది లక్షలు కావాలని అడిగితే గత అక్టోబర్ నెలలో కుప్పానికి రమ్మని ఇస్తానని చెప్పి పని కాలేదని ప్రభాకర్ పంపేశాడన్నారు. కుప్పం వచ్చే సమయంలో ఫోన్ తేవద్దని సైతం సూచించాడన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 27న శ్రీనాథ్ కుప్పంకు వచ్చాడని అప్పటికే శ్రీనాథ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న ప్రభాకర్ తనకు జైలులో పరిచయం అయిన చిత్తూరుకు చెందిన మరో నిందితుడ్ని కుప్పంకు పిలిపించుకున్నాడు. స్థానిక కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇంటిని ఇదివరకే కొనుగోలు చేసిన ప్రభాకర్ శ్రీనాథ్‌కు అక్కడకు తీసుకెళ్లి మత్తుమాత్రలు ఇచ్చాడన్నారు. అనంతరం అతని తలపై సమ్మిటతో కొట్టి హతమార్చి ఇంట్లో తీసిన గుంతలో పూడ్చిపెట్టి వెళ్లిపోయారన్నారు. తన భర్త కుప్పం వెళ్లి రాకపోగా శ్రీనాథ్ భార్య అక్టోబర్ 31న కుప్పంకు వచ్చి ప్రభాకర్‌ను అడిగితే తనకు తెలియదని పేర్కొన్నాడన్నారు. దీంతో శ్రీనాథ్ భార్య బెంగళూరు అత్తిబెలే స్టేషన్‌లో తన భర్త కన్పించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో కర్ణాటక పోలీసులు ప్రభాకర్‌ను అదుపులో తీసుకుని విచారించగా బుకాయించాడన్నారు. చివరకు అతని సెల్‌ఫోన్ కాల్ డేటా పరిశీలించి చిత్తూరుకు చెందిన వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా హత్య కేసు వెలుగుచూసిందన్నారు. ఆదివారం కర్ణాటక పోలీసులు నిందితులను తీసుకువచ్చి కాలనీలోని ప్రభాకర్ ఇంటినుంచి శ్రీనాథ్ మృతదేహాన్ని వెలికితీశారు. కర్ణాటక పోలీసులకు అర్బన్ సిఐ శంకరయ్య, ఎస్సై బాబులు సహకరించారు.

# రెండోఘాట్‌లో కారు బోల్తా

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినుండి తిరుమలకు వస్తున్న తమిళనాడు భక్తుల కారు రెండోఘాట్‌లో లింకురోడ్డుకు కిలోమీటరు ముందే అదుపు తప్పి బోల్తాపడింది. కారు అతివేగంగా నడపడంతో మలుపువద్ద అదుపుచేయలేక రైలింగ్‌ను ఢీ కొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తమిళనాడు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ఐదేళ్ళచిన్నారి ఉన్నట్లు పోలీసులుతెలిపారు. అదేమార్గంలో వెళుతున్న ప్రయాణీకులు కారులోంచి భక్తులను బయటకు తీసి వాహనంలో తిరుమల అశ్వనీఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో తిరుమలకు వచ్చే వాహనాలు కిలోమీటరు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు, తిరుమల ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని కారును తొలగించారు. ఆ తరువాత





వాహనాలు తిరుమలకు కదిలాయి. తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

# చరిత్రాత్మక వేదికగా విశాఖ సిఐఐ సమ్మిట్

**సచివాలయం,నవంబర్ 16,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మారి ్చన చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్, స్టాంప్ ్స శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.ఏపిని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ ఎంతగా శ్రమిస్తున్నారో నిరూపించింది.పెట్టుబడులకు ఏపిని గమ్య స్థానంగా నిలపడంలో చంద్రబాబు మరోసారి తన సత్తాను చాటారు.మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారు.మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అనుసరిస్తుండడంతో ఏపికి పరిశ్రమలు క్యూ కట్టాయి. మొత్తం రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు,16లక్షల ఉద్యోగాలు రావడం ఏపి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం.అన్ని కీలక శాఖలతో ఒప్పందాలు కుదరడం పెట్టుబడులను సమగ్రంగా ఆకర్షిస్తున్న ప్రభుత్వ నైపుణ్యాన్ని చూపింది. మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వెళ్ళడం..ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనం.సీఐఐ సదస్సులో ప్రతి జిల్లాకి ప్రాధాన్యత లభించింది.ప్రతి జిల్లాకు పరిశ్రమలను తీసుకొచ్చారు.సదస్సు విశాఖలో జరిగినా పెట్టుబడులు మాత్రం యావత్ రాష్ట్రానికి విస్తరించేలా సిఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ కృషి చేశారు.

# రామోజీ అవార్డు గ్రహీతలు వీరే..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్16:** రామోజీరావు అవార్డు గ్రహీతలకు రూ.5లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం,జ్ఞాపికను అందజేసి సత్కరించారు. **అమలా రూయా:** గ్రామీణాభివృద్ధి విభాగంలో అసాధారణ కృషి చేసినందుకు అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చారు. **శ్రీకాంత్ బొల్లా:** యూత్ ఐకాన్ కేటగిరీలో గుర్తింపు పొందారు. యువతకు ప్రేరణగా నిలిచి, విద్య,ఉపాధిరంగాల్లో కొత్త మార్గాలను సృష్టించారు. **మాధవీలత:** సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభ చూపి అవార్డు సాధించారు. **ఆకాశ్ టాండన్:** మానవసేవా రంగం లో అమానత్వంగా కృషి చేసినందుకు గౌరవం లభించింది. అసహాయులకు, అనాథలకు అందించిన సేవలు అపూర్వమైనవి. **ప్రసన్న శ్రీ:** కళ సంస్కృతి క్షేత్రంలో సృజనాత్మక తకు అవార్డు. భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. **జైదీప్ హార్దికర్:** జర్నలిజం రంగంలో సత్య సంధత,నిర్మలతతో పనిచేసినందుకు గుర్తింపు. **పల్లవి ఘోష్:** మహిళా సాధికారత కేటగిరీలో అవార్డు. మహిళల హక్కులు, సాధికారత కోసం చేసిన కృషి ప్రశంసనీయమైనది.

# తిరుమల సమాచారం



## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి

### సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై కలగాలని వేడుకున్నట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. సుప్రీంకోర్టు జడ్జి కుటుంబంతో కలసి ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు.



## అంతా మంచి జరగాలి: హైదరాబాద్ సిపి సజ్జనార్

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభకరమని,అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు తెలంగాణ హైదరాబాద్ మహానగర సిపి సజ్జన్నార్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సిపి సజ్జ నార్ వెంట తిరుపతిజిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ,డిఎస్పీ విజయశేఖర్ పోలీసు అధికారులు ఉన్నారు.తిరుమలలో ఏర్పాట్లు,దర్శన సౌకర్యం బావుందన్నారు.




## భగవంతుని నామస్మరణతోనే మోక్షం

### కంచిపీఠాధిపతి విజయేంద్రసరస్వతి


**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో మానవాళి ప్రతిఒక్కరూ భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ,తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉంటారని కంచికామకోటిమఠం పీఠాధిపతి విజయేంద్రసరస్వతిస్వామి అనుగ్రహభాషణం చేశారు. కార్తీకమాసంలో ద్వాదశి ఘడియల్లో ఆదివారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయమర్యాదలతో మహద్వారం వద్ద స్వాగతం పలికారు.స్వామి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ నాయుడు, ఇఒ సింఘాల్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఫిబ్రవరి నెల టిక్కెట్లు రేపు ఆన్‌లైన్‌లో విడుదల

### 21న వర్చువల్ సేవా, 24న అంగప్రదక్షిణ టోకెన్లు



**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి 2026 ఫిబ్రవరి నెలాకోటా టిక్కెట్లు మంగళవారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఫిబ్రవరినెలకు సంబంధించి రేపు మంగళవారం 18వతేదీ ఉదయం 10గం టలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 20వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 21వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్స వం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్స వం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది. 24న ఉదయం 10గంటలకు అంగప్రదక్షణ టోకెన్లు, శ్రీవాణి టిక్కెట్లు 24న ఉదయం 11గంటలకు, వృద్ధులు దివ్యాంగులు దర్శన కోటా 24వతేదీ మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 25న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులుఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కెట్లును 'టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఓవి.ఇన్' వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.



## పద్మావతిలో ముగిసిన అంతర్జాతీయ నృత్యవాహిని

**తిరుపతి,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీపద్మావతిమహిళ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడురోజులు జరిగిన అంతర్జాతీయ నృత్యవాహిని అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్యమహోత్స వం ఉత్సాహంగా ముగిసింది. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆహ్లాదకరంగా ముగిశాయి. గౌరవ అతిథిగా పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, ఎస్వీయూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య టి.నరసింగరావు, మైసూరు విశ్వవిద్యాలయం ఆచార్య కె.శీల శ్రీధర్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, కన్వీనర్ ఆచార్య పి.విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ హిమబిందు,పిఆర్ఓ శ్రీరజని,విద్యార్థులు, కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం అత్యంత నిబద్ధతతో ,సమగ్రంగా నిర్వహించబడిందని అభినందించారు.ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు మహిళ విశ్వవిద్యాలయం ప్రతిష్టను ఉన్నతస్థాయికి తీసుకెళ్తాయని పలువురు వక్తలు కొనియాడారు. నృత్యవాహిని వంటి సాంస్కృతిక మార్పిడి వేడుకలు విద్యా ర్థులకు ప్రపంచ కళా సాంప్రదాయాలను చేరువుచేస్తాయన్నారు. అన్ని జట్లు తమ అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.


ENDOWMENTS DEPARTMENT
SRI ESWARA SWAMY TEMPLE
Kokkarayapalli (V), Chennuru (M), YSR Kadapa District
e-Procurement Tender
NIT.NO.P/COE/813/2025-31 Dt:15-07-2025
E-Tenders are invited through the e-Procurement portal for Reconstruction of Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
-EXECUTIVE OFFICER

కోరికలు తీర్చుకునేందుకు, పనులు సానుకూలమయ్యేందుకు దైవాన్ని కొలిచే భక్తి భక్తికాదు. మనసును దైవమందు నిలపడానికి చేసే ప్రయత్నమే భక్తి.

న-ఇ.గిబ్బన్

# కాటేస్తున్న 'కాలుష్య చలి'

దేశమంతటా శీతలగాలులు ప్రారంభమయ్యాయి. ఎన్నడూ లేనిది ఈసారి 'సింగిల్ డిజిట్' ఉష్ణోగ్రత ప్రజల్ని ఇంట్లోంచి బయటకు రానీయడం లేదు. చలి రోజురోజుకి పెరిగిపోతోంది. సాధారణ ఉష్ణోగ్రతలు మటుమాయమై చలిగాలులు ప్రారంభమయ్యాయి. ఉష్ణోగ్రతలు బాగా పడిపోతాయన్న హెచ్చరికల మధ్య జనం ఇల్లు దాటి బయటకు రావడం లేదు. ఈ చలిని తట్టుకోవడం నిజానికి కష్టంగానే ఉంది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత కోర్ కోల్డ్‌వేవ్ జోన్‌లో ఉందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ (ఎన్‌పిసిసిహెచ్‌హెచ్), లోగడనే ప్రకటించింది. ఈసారి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోదగినవేమీ లేవు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5డిగ్రీల కన్నా కిందకు పడిపోయే ప్రమాదం ఉంది. మరో 2రోజులు ఆగితే జనం పూర్తిగాఇంటికే పరిమితమైపోవాల్సి వస్తుంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 8.5డిగ్రీల నుంచి 12.5డిగ్రీల వరకు ప్రకృతి ఉత్పాతాలు వచ్చినప్పుడు వాతావరణ శాఖ సూచించే 'అలర్ట్'లు చలికి వేడికీ కూడావర్తిస్తాయి. చలి తీవ్రతకు సంబంధించి తెలంగాణలోని మంచిర్యాల జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాలలో 10 డిగ్రీలకన్నా తక్కువకు పడిపోవచ్చునని వాతావరణ విశ్లేషణల ద్వారా కనుగొన్న హెచ్చరికలివి. మిగిలిన జిల్లాలు కూడా కనిష్ట ఉష్ణోగ్రతలకు పడిపోవచ్చుననే అంచనాతో ఎల్లోఅలర్ట్ జారీ అయింది. ఇప్పటికే చలి తీవ్రతతో ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల దాకా పొగమంచు ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే గత మూడు రోజుల్లో సాధారణం కన్నా 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. తెలుగు రాష్ట్రాలకు చలీ వదిలేటట్లు లేదు. వాన చినుకులు వదిలేటట్లు లేవు. ఈ వరుణుడి శాపం ఈనాటిది కాదు. గత 5,6 నెలలుగా ఈ రెండు రాష్ట్రాల రైతాంగం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 'మొంథా'తుఫాను ప్రభావం నుంచి కుదుటపడుతున్నారనేలోపే మరో అవాంతరం మీద పడనున్నది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగిపోతోంది. అల్లూరి జిల్లా జి.మాడుగులలో 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాలేకాదు మైదాన ప్రాంతాల్లోని శ్రీకాకుళం, కర్నూలు, ఎన్టీయార్ జిల్లాలో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 6నుంచి 16 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలున్నాయి. కొన్ని జిల్లాలో వేడి గాలులు ఉన్నాయి. రానున్న రోజుల్లో 19వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రంలో ఆవర్తనం ఏర్పడ్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుంది. అల్పపీడనం వాయుగుండగా మారితే ఈ నెల 24నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీవర్షాలకు అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్ష వాతావరణం నుంచి శీతల కాలానికి ప్రవేశిస్తున్నామనుకున్న తరుణంలో మళ్లీ వర్షాలంటే ఇక రైతు ఏమాత్రమూ కోలుకునే పరిస్థితి లేదనే భావన రైతాంగంలోఉంది. నిన్నమొన్నటి వరకు అధిక కాలుష్య సూచీలతో సతమతమైన ఢిల్లీ కూడా శీతల గాలులు వ్యాపిస్తున్నాయి. రాజధాని వాసులకు ఎలాంటి ఊరట లభించే అవకాశం లేదు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి మరికొన్ని రోజులు చలిగాలులను భరించక తప్పదు. ఝాము పొద్దుటే ఎవరూ బయటకు రాలేకపోతున్నారు. రాత్రిపూట చలిగాలులకు శరీరం మంటలెక్కుతోంది. ఎముకలు కొరికే చలికి ప్రజలు గజగజలాడుతున్నారు. తెలంగాణలోని పది జిల్లాల్లో సింగిల్ డజన్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డిజిల్లా కోహిర్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 7.8డిగ్రీలు నమోదైంది. అన్ని చోట్ల దాదాపు 9డిగ్రీల కన్నా తక్కువే. వచ్చే నాలుగైదు రోజుల్లో కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. ఆంధ్రాలో అల్పపీడనం వాయుగుండం ప్రభావం ఉండనే ఉంది. ఈ కారణం చేత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయి. ఇలాంటి వర్షాలకు పంటలు చివరి ప్రయత్నంగా మరోసారి నష్టాలతో చతికిలపడిపోవడం ఖాయం. చలి నుంచి కాచుకునేందుకు తెల్లారి లేచి చలిమంటలు వేసుకుంటున్నప్పుడు కాలుష్యం వెదజల్లుతుందని వాటి జోలికి పోరాదని వైద్యులు చెబుతున్నారు. మంటల వేడిమి కోసం ప్లాస్టిక్ రబ్బరు, ఇతరత్రా చెత్త కూడా మండుతున్నప్పుడు కాలుష్యం నుంచి కాపాడడం కష్టమని వాటికి పిల్లల్ని దూరంగా ఉంచమని వేడుకుంటున్నారు. ఇలాంటి మంటల సమయంలో సూక్ష్మ ధూళికణాలు వ్యాప్తి చెంది విషతుల్యమౌతుంటాయి. ఈ గాలులు కారణంగా శ్వాసకోశ సమస్యలు వస్తాయని, తమవద్ద ఇలాంటి వ్యాధులకు గురయిన పిల్లలు, పెద్దలు, వృద్ధులు చికిత్సకు కోసం వస్తున్నారని వైద్యులు చెప్తున్నారు. ఆస్తమా, కేన్సర్, దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడకుండా హార్మోన్ల అసమతుల్యత, ఆమ్లవర్షాల నుంచి కట్టడి చేసుకోవాలి. ఇంటిలోకి చలి ప్రవేశించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ మధ్యనే చలితీవ్రత తట్టుకో లేక ఇద్దరు వృద్ధులు దుర్మరణంపాలయ్యారు. ఉలెన్ దుస్తులు ధరించి బయటకు రావచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. చలి పెరగడంతో తాము నిల్వ చేసుకున్న పత్తిపై తేమ శాతం పెరుగుతోందని పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేయడం చూస్తున్నాము.



పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.

ఆస్కార్‌వైల్డ్



బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

జార్జి ఎలియట్

# ప్రజావాక్కు



### నితీశ్ మెడలోనే బీ'హారం'

బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిసీట్ల ప్రభంజనం సృష్టించింది. ఆ కూటమిలోని ముఖ్యమైన పార్టీలన్నీ తమ ఓట్ల, సీట్లశాతాల్ని గణనీయంగా పెంచుకున్నాయి. రెండు దశాబ్దాలుగాముఖ్యమంత్రి పదవిని ఎలాగోలాచేతిలోనే ఉంచుకున్న నితీశ్ కుమార్, ఈసారి పద్ధతిగా పదోసారి అధిష్ఠించడానికి అర్హత పొందారు. ఆయన పార్టీ జేడీయూ కూడా అధికసంఖ్యలో సీట్లుసాధించి, కూటమిలో మొదటి స్థానం పొంది పదవిని దర్జాగా పొందే స్థితిలో ఉన్నారు. బీజేపీ కూడా నాయకుడిగా ఆయన పేరే చెప్తూ వచ్చింది. కాబట్టి అన్నీ అనుకున్నట్టే జరగొచ్చు వారి విషయంలో. బీజేపీ ఎటూ బలంగానే ఉంది. మహిళా ఓట్ల పెరుగుదల నితీశ్ వైపే మొగ్గింది. అత్యంత వెనుకబడిన వర్గాలు, మహిళలు ఎన్డీఏ వెంట నిలిచారు. ఇది నితీశ్, మోడీ జోడీల ఉమ్మడి విజయం. ఈ ఘన విజయం వల్ల ప్రత్యేక ఎలెక్టోరల్ రివిజన్ పై కమ్ముకున్న నీలినీడల్ని విస్మరించరాదు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### తెలంగాణలో చలి గాలులు

రాష్ట్రవ్యాప్తంగా శీతల గాలులు వీచడంతో చలితీవ్రత గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఉత్తరతెలంగాణ జిల్లాల్లో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంటలు వేసుకుని వేడిని పొందుతున్నారు. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొమురం భీంఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) ప్రాంతంలో అత్యల్పంగా 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది ఈ సీజన్‌లోఇప్పటివరకు నమోదైన అత్యంతతక్కువ ఉష్ణోగ్రతల్లో ఒకటిగా గుర్తించారు. చలిగాలుల వల్ల వివిధ జబ్బులు వచ్చే అవకాశాలు వున్నాయి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ప్రతి నెల స్ఫూర్తి ప్రోగ్రాం నిర్వహించాలి

విద్యార్థులకు ప్రతినెల నిర్ణీత సమయంలో ప్రతి విద్యా సంస్థలలో స్ఫూర్తి ప్రోగ్రామ్ నిర్వహించాలి. గురుకులాలలో, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోమొదటి తరగతి నుండి డిగ్రీస్థాయివిద్యార్థులకు ఈప్రోగ్రాం నిర్వహించాలి. ప్రతి విద్యా సంస్థ నుండి మంచి మోటివేషన్ స్పీకర్ కూడా పాల్గొనే విధంగా ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

### సిబ్బంది కొరత

రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం బోధనా సిబ్బంది తీవ్రకొరతతో అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దాదాపు 70-75 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఐదు నెలల క్రితమే నియామక మార్గదర్శకాలు ప్రకటించినప్పటికీ, అమలు జరగకపోవడం ప్రశ్నార్థకం. ఈకొరత కేవలం సంఖ్యల సమస్య కాదు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తు దీనిపై ఆధారపడి ఉన్నాయి. అధ్యాపకుల కొరత కారణంగా బోధన నాణ్యత తగ్గిపోగా, పరిశోధన కార్యకలాపాలు కూడా మందగిస్తున్నాయి. ప్రాజెక్టులు, కొత్త పరిశోధన పత్రాలు తగ్గిపోవడంవల్ల విశ్వవిద్యాలయాలు కేంద్రనిధులు ప్రతిష్టాత్మక గ్రాంట్లు కోల్పోతున్నాయి. ఇంకా, సిబ్బంది తక్కువ ఉండటంతో ఉన్న అధ్యాపకులపై పనిభారం పెరిగి, విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందడం లేదు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

రహదారి ప్రమాదాలు, మరణాలు సంభవించని రోజులేదు. దీనికి అనేక కారణాలు గోచరిస్తున్నాయి. డ్రైవర్లు మద్యం సేవించి నడపడం, స్టీరింగ్ ముందు కూర్చుని సెల్‌ఫోన్లు చూస్తూ, మాట్లాడుతూ, నిద్ర మత్తులో నడపడం ఇంకా పరిమితికి మించిన వేగం పెంచడం, సడెన్‌గా బ్రేక్ వేయడం, అనుభవం, లైసెన్సు లేని చోదకులు, నియమంప్రకారం నిర్వహణ లేని వాహనాలు, పాతబడిన వాటిని ఉపయోగించడం ఇలా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు అన్నిటికి ఇవే లోపాలున్నాయని అనిపిస్తోంది. మరీ ముఖ్యమైంది ఏమంటే అధికారులు సమగ్ర పరిశీలనలు చేయకుండా పర్మిట్లు, పర్మిషన్స్ ఇవ్వడం కూడా ఒక కారణమై ఉండవచ్చు. ప్రయాణీకుల ప్రాణాలు తమ చేతులలో ఉన్నాయని డ్రైవర్లు మరువకూడదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బదలీ అయినవారికి పోస్టింగ్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్‌స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదలీలను నిర్వహించినవారికి వెంటనే పోస్టింట్ ఇవ్వాలి. పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడివారిన అక్కడే ఉంచినట్లయితే బదలీలు వృధాఅవుతాయి. కొంత మందికి పోస్టింగ్ ఇచ్చి మరికొంత మందికి ఇవ్వకపోవడం బాధాకరం. మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎన్నికల సంస్థపై కేంద్ర పెత్తనమా!

***భారతీయులు తమ విలువైన ఓటు హక్కుతో నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో లేని వ్యక్తులపై ఓట్లుచూయించి, ఒక వ్యక్తికే అనేక ప్రాంతాల్లో ఓట్లు చూయించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంటే భారతీయ ప్రజల ఆలోచనకి వ్యతిరేకమైన ప్రభుత్వాలు ఏర్పడుతున్నప్పుడు, ప్రజల ఇష్టాలకి గౌరవం లేనప్పుడు దేశ ప్రజలను, గొప్పనైన రాజ్యాంగాన్ని పాలకులు ఇష్టానుసారం అగౌరపరుస్తున్నట్లే కదా. అలాంటప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు ఎలా వర్ధిల్లాబడతాయి.! కాబట్టి అంతిమంగా ఇలాంటిఅనేక సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నైతిక విలువలతో వ్యవహరించి 140కోట్ల మంది భారతీయులకి వాస్తవాలతో కూడిన సమాధానం చెప్తూ, భారత సార్వభౌమాధికారాన్ని, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని, కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ఉండే స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్నిలోతుగా ఆలోచిస్తూ పార్టీలకు, కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.***

పుల్లెంల గణేష్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా స్వతంత్రంగా పనిచేసే అతికొద్ది సంస్థల్లో భారతీయ ఎన్నికల వ్యవస్థ ప్రధానమైనది. ఎందుకంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటుకై ఓటర్లకు సంబంధించిన ఓటర్ లిస్ట్‌ని తయారు చేసేది, వివిధ రాజకీయ పార్టీలకి గుర్తింపుని, రాజకీయ పార్టీలకి చిహ్నాలని కేటాయించేది కేంద్ర ఎన్నికల సంస్థ. కాబట్టి ఐదు సంవత్సరాలకి ఒకసారి నూతనంగా ఏర్పాటు అయ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వ్యవస్థపై పెత్తనం చూయించి వివిధ రాజకీయ పార్టీలకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి అనుకూలంగా వ్యవహరించేలా వేటికి కూడా హక్కు ఎన్నికల వ్యవస్థపై ఉండదు. భారతదేశం అంటే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యా దేశంగా ఉండడానికి భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 324 ద్వారా అంబేద్కర్ ఎన్నికల వ్యవస్థకు చాలా పటిష్టమైన భద్రతను ఇస్తూ, స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించారు. అందుకే కేంద్ర, రాష్ట్రాల్లో ఎంతటి బలమైన ప్రజాబలం ఉన్న నాయకులు ఉన్నప్పటికిని ఎన్నికల వ్యవస్థని, వాటిని నడిపే అధికారులని ఆయా పార్టీలకి, ప్రభుత్వాలకి అనుకూలంగా వ్యవహరించడానికి అవకాశం లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాడానికి భారత రాజ్యాంగం రూపంలో ఎన్నికల వ్యవస్థకి అత్యున్నతమైన స్వేచ్ఛ స్వతంత్ర ఉన్నది. ఇది భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని చెప్పడానికి నిదర్శనం. కానీ గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వంలో బిజెపి అనుబంధ ఎన్డీయే ప్రభుత్వ హయాంలో కేంద్ర ఎన్నికల వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి అనేక సందర్భాల్లో అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ప్రతిపక్ష పార్టీ నాయకులు బలమైన ఆధారాలతో ఆరోపణలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తూ హర్యానా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాని ఎన్నికల వ్యవస్థని తమకి అనుకూలంగా మలుచుకొని హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఆధారాలతో సహా ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా ఢిల్లీలో ప్రొజెక్టర్లో ఫోటో, వీడియోలు వేసి ఎన్నికల వ్యవస్థ లోపాలను వివరిస్తూ దాదాపు 25 లక్షల నకిలీ ఓట్లు హర్యానాలో ఉన్నాయని చెప్తున్నారు. అందువల్లనే హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అందుకు బలమైన ఆధారాలు చూపిస్తూ బ్రెజిల్ దేశానికి చెందిన మోడల్ పేరుపై వివిధ పేర్లతో హర్యానాలో 22 చోట్ల ఓటు హక్కు ఉండడం రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోర్ విధానానికి బిజెపి పాల్పడుతున్నదని నమ్మక తప్పని పరిస్థితి నెలకొన్నది. అంతేకాదు బ్రెజిల్ మోడల్ కూడా రాహుల్ గాంధీ చూయించిన ఆధారాలకు స్పందించి అవి తన గతంలోని మోడల్ ఫొటోస్ అని, ప్రస్తుతం భారతదేశంలో తాను వైరల్ అవ్వడం ఓటు హక్కు కూడా ఉండడాన్ని తీవ్రంగా





ఖండించింది. ఇది మన దేశంలోని ఎన్నికల వ్యవస్థలోని లోపాలకి నిదర్శనం కాదా, విదేశీయుల ముందు అత్యున్నత విలువలతో కూడిన భారత రాజ్యాంగాన్ని అవమానపరచడం కదా..! మరి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై ఎన్నికల వ్యవస్థ తప్పు లేనప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల వ్యవస్థ వ్యవహరించనప్పుడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల వ్యవస్థపై తప్పుడు ఆరోపణ చేస్తూ, ఎన్నికల వ్యవస్థనే అభాసుపాలు చేస్తున్నారని ఎన్నికల అధికారులు ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తమ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోలేకపోతున్నదంటే కేంద్ర ఎన్నికల వ్యవస్థ ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదా..? అనే విషయాన్ని మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం నమ్మక తప్పడం లేదు.! ఎందుకంటే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఒక్క ఓటే నాయకుల గెలుపు, ఓటమిని నిర్ణయిస్తుంది. కాబట్టి భారతదేశమంటేనే ఒకే వ్యక్తి ఒకే ఓటు ఒకే విలువ అనే రాజ్యాంగబద్ధమైన ఉన్నత విలువలతో కూడిన అంశం కాబట్టి ఒక్క ఓటు ఐన ముఖ్యమైనదనే విషయం జగమెరిగిన సత్యం. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా చూయిస్తూ, బిజెపి కేంద్ర ప్రభుత్వంఓటు దొంగతనానికి పాల్పడుతున్నదనే అంశంలో ఎన్డీఏ ప్రభుత్వంలో, మోడీ నేతృత్వంలో ఎలాంటి లోపాలు లేనప్పుడు కేంద్ర ఎన్నికల సంస్థని తమకి అనుకూలంగా కీలు బొమ్మగా మార్చుకోవడం లేదని నిజం ఐతే, తప్పుడు ఆరోపణలు చేస్తూ భారతీయ ప్రజల ఓట్లని, ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరచేలా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ పై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు! అంటే రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నదని కేంద్ర ఎన్నికల వ్యవస్థ, కేంద్ర ప్రభుత్వ గుప్పిట్లో ఉన్నదని ప్రధాని చెప్పదలుచుకున్నారా? అంటే భారత రాజ్యాంగం ద్వారా ఎన్నికల వ్యవస్థకి కల్పించిన స్వతంత్ర ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదంటే భారత రాజ్యాంగాన్ని, 140 కోట్ల భారతీయ ప్రజల ఆత్మ గౌరవాన్ని అవమాన పరుస్తున్నట్లే కదా! భారతీయులు తమ విలువైన ఓటు హక్కుతో నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో లేని వ్యక్తులపై ఓట్లు చూయించి, ఒక వ్యక్తికే అనేక ప్రాంతాల్లో ఓట్లు చూయించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంటే భారతీయ ప్రజల ఆలోచనకి వ్యతిరేకమైన ప్రభుత్వాలు ఏర్పడుతున్నప్పుడు, ప్రజల ఇష్టాలకి గౌరవం లేనప్పుడు దేశ ప్రజలను, గొప్పనైన రాజ్యాంగాన్ని పాలకులు ఇష్టానుసారం అగౌరపరుస్తున్నట్లే కదా. అలాంటప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు ఎలా వర్ధిల్లాబడతాయి.! కాబట్టి అంతిమంగా ఇలాంటిఅనేక సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నైతిక విలువలతో వ్యవహరించి 140 కోట్ల మంది భారతీయులకి వాస్తవాలతో కూడిన సమాధానం చెప్తూ, భారత సార్వభౌమాధికారాన్ని, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని, కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ఉండే స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్ని లోతుగా ఆలోచిస్తూ పార్టీలకతీతంగా, కుల, మతాలకతీతంగా, ప్రాంతాలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం. •

# పిల్లలపై తల్లిదండ్రుల ప్రవర్తన ప్రభావం

మేకిరి దామోదర్

నారుతోపాటు నీరు పోసే తీరుపైనే మొక్క ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. పిల్లల పెంపకం కూడా అంతే! చిన్నప్పటినుంచి వారితో తల్లిదండ్రులుగా, పిల్లల ఎదుగుదలలోని వివిధ దశల్లో ఎలా ప్రవర్తిస్తున్నామనే దాన్నిబట్టి వారి వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. మన పిల్లలు మొట్టమొదటి సూపర్ హీరోల్లా ఆరాధించేది సూపర్ మ్యాన్‌నో, సూపర్ హీరోనో, స్పైడర్ మాన్నో కాదు..తమ తల్లిదండ్రులనే. చిన్నారులు తొలుత ఎక్కువగా విశ్వసించేది, ప్రేమించేది తాము అనుకరించాలని కోరుకునేది కూడా వారినే. తల్లిదండ్రులు పరిపూర్ణ వ్యక్తులుగా వ్యవహరిస్తూనే, కన్నబిడ్డల్ని ప్రేమగా చూసుకుంటూవారితో గడిపేందుకు తరచూ సమయం కేటాయించుకుంటే చాలు. పిల్లలకు గొప్ప మేలు చేసినట్లేనని మానసిక నిపుణులు అంటున్నారు. ప్రతి కుటుంబంలో పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర చాలాకీలకం, ఇది కాదనలేని వాస్తవం. తల్లిదండ్రుల పెంపకాన్ని బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందనేది నిజం. కానీ ఆధునిక టెక్నాలజీ మారుతున్న సామాజిక పరిణామాలు, ఆర్థిక పరిస్థితుల ప్రభావం తదితరాల మూలంగా తల్లిదండ్రుల భావోద్వేగాల ప్రతికూల ప్రభావం, తరచూ గొడవలు పడడం మూలంగా పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు. ఇలాంటి ఘటనలు ఎదిగే వయసులో వారిని మానసికంగా కృంగిపోయేలా చేస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇంట్లో పిల్లలు పెద్దవారయ్యాక కూడా తల్లిదండ్రులు ప్రవర్తనలో మార్పులు రాకపోవడం. అదే తరహా గొడవలు వాదోపవాదాలు ఎదిగిన పిల్లల ముందు పెట్టడం మూలంగా యువతరం భావోద్వేగాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెప్తున్నారు. ఒక వయసు వచ్చి చదువు పూర్తయి పరీక్షలకు సన్నద్ధం కావటమో, ఉద్యోగాలు, వ్యాపారం వంటివి చేస్తున్న పిల్లలకు తల్లిదండ్రులు తగులాటడం అనేది వారి సంతతికి ఆధునిక సమస్యగా పరిణమించింది. అలాంటి సందర్భాల్లో గొడవలు ఆపాలని ప్రయత్నించినా తల్లిదండ్రులు వినకపోవడం, తిరిగి వారి ఎదిగిన పిల్ల




లనే నిందించడం వంటివి చేస్తున్నారు. ఉద్యోగం, పెండ్లి, భవిష్యత్తు వంటి అనేక బాధ్యతలు మీద పడుతున్న సమయంలో ఇలాంటివి దేశంలోని పలు కుటుంబాల్లో యువతి, యువకులకు ఇబ్బందికరంగా మారాయని మానసిక నిపుణులు అంటున్నారు. ఫలితంగా వారు తీవ్ర ఒత్తిడి గురవుతున్నారని చెప్తున్నారు. పిల్లలు పెద్దవారయ్యాక కూడా తల్లిదండ్రుల మధ్య గొడవలను చూసి పెరిగిన కారణంగా వారిలో కలిగే బాధ, ఆందోళన, దుఃఖము వంటివితగ్గిపోవు. తల్లిదండ్రుల మధ్య జరిగే గొడవల్లో పిల్లలు పావులుగా చిక్కుకపోతున్నారు. ఇద్దరినీ సముదాయించాలని వారు ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో పంతాలకు పోవడం కారణంగా పిల్లలకు ఏమి చేయాలో పాలు పోనీ పరిస్థితి నెలకొంటున్నాయి. ఇలా పిల్లలే మధ్యవర్తులుగా మారుతున్న సందర్భాల్లో తల్లిదండ్రులు పిల్లలను పక్షపాతం వహిస్తున్నవంటూ తిరిగి తల్లిదండ్రులే పిల్లలను ఆరోపిస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ఇలాంటి స్థితి పిల్లల, ఎదుగుతున్న యువత మానసిక భావోద్వేగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దేశంలోని మెజార్టీ యువత ఇదే అనుభవాలను ఎదుర్కొంటుందని మానసిక వైద్యులు చెప్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు విలువలు బోధించాలి. ఇక్కడ ప్రధానంగా తల్లిదండ్రులు జాగ్రత్తగా వహించాల్సిన విషయం ఏమంటే? గొడవలు ఆపాలన్న మధ్యవర్తి పాత్ర పిల్లల బాధ్యత కాదన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. పిల్లలు తల్లిదండ్రుల నుంచి సంస్కారం నేర్చుకోవాలి. మరోవైపు పలువురు తల్లిదండ్రులకు కూడా పిల్లలకు మంచి, చెడు చెప్పే సమయం ఉండటం లేదు. విలువల గురించి మాట్లాడుకోవడం కష్టమయింది. ఇలాంటి పరిస్థితుల్లో పెరుగుతున్న పిల్లలు దారి తప్పుతున్నారు. పరిస్థితి చేయి దాటిన తరువాత తల్లిదండ్రులు బాధపడుతున్నారు. అందుకే పిల్లల పెంపకం విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విలువలు పాటించాలి, పిల్లలకు బోధించాలి. ఇంట్లో ఎప్పుడు ఘర్షణ వాతావరణం ఉంటుందో అప్పుడు పిల్లల మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అభద్రతా భావం ఏర్పడుతుంది. తల్లిదండ్రుల ఆస్తులు వారి సంతానమే. ఆ పిల్లలను సమాజంలో సంస్కారవంతులుగా, ఉన్నత స్థాయిలో ఎదగాలంటే..ఆస్తులు కాదు? విలువలను ఇచ్చే విద్యతో పాటు కుటుంబంలో తల్లిదండ్రుల ప్రవర్తనే మంచి వ్యక్తిత్వం గల వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని నేటితరం భావించాల్సిన అవసరం ఎంతో ఉంది. •

# విజ్ఞాన, సంస్కృతుల నిలయం గ్రంథాలయం

డా. పూసపాటి వేదాద్రి

గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాల నిల్వగూడి కాదు, అది విద్యా, సాహిత్య, సంస్కృతి, విజ్ఞానాలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పాఠకులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఇంటర్నెట్, సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే పుస్తకాలు ఇస్తున్న లోతైన జ్ఞానం, విశ్లేషణా శక్తి, ఆలోచనా సంపత్తి అమూల్యం. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుండి నవంబర్ 21 వరకు భారతదేశంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయి. పుస్తకాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం, చదవడం అలవాటు పెంపొందించడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. జ్ఞానంఅనేది మనిషిని సంపూర్ణుడిగా మార్చే శక్తి. ఆ జ్ఞానానికి నిలయమేవైతే గ్రంథాలయం. అదే ఈ వారోత్సవాల ద్వారా మరింత ప్రజల్లోకి చేరుతుంది. భారత దేశ చరిత్రలో గ్రంథాలయాలు విద్య, జ్ఞానం, ప్రజల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా స్వతంత్రపోరాట కాలంలో గ్రంథాలయాలు జాతీయ చైతన్యాన్ని ప్రజల్లో నాటడంలో ఒక శక్తివంతమైన వేదికగా నిలిచాయి. బ్రిటీష్ పాలన కాలంలో భారతీయులు విద్య, జ్ఞానం, సాహిత్యం ద్వారా స్వాతంత్ర్య భావాలను బలపరిచే ప్రయత్నం చేశారు. విదేశీ పాలకుల అన్యాయాలను ప్రజలకు తెలియజేయడానికి, దేశభక్తి, జాతీయతను వ్యాప్తిచేయడానికి పుస్తకాలు, పత్రికలు, సమావేశాలు ముఖ్య సాధనాలయ్యాయి. ఈ క్రమంలో ప్రజల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. 1900 దశకం ప్రారంభంలోనే బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడులో గ్రంథాలయ ఉద్యమానికి ఉతమిచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత దేశంలోని అనేక ప్రాంతాలకు ఈ ఉద్యమం విస్తరించింది. తెలుగునాట గ్రంథాలయ ఉద్యమాలకు ఒక విశిష్ట చరిత్ర ఉంది. ప్రజల్లో చదవాలనే తపన, అవగాహన పెంపు, సంస్కరణాత్మక భావజాలం ప్రచారం కోసం గ్రంథాలయాలు ప్రధాన వేదికలుగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాల్లో ఈ ఉద్యమం సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో ప్రభావవంతంగా సాగింది. 19వ శతాబ్దం చివరలో సామాజిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయ స్వాతంత్ర్య ఉద్యమాలు ప్రజల్లో జ్ఞానోదయాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో ప్రజలలో చదువుపై ఆసక్తి పెరిగి, పుస్తకాల విస్తరణ కోసం గ్రంథాలయాల అవసరం ఏర్పడింది. తెలంగాణా ప్రాంతంలో గ్రంథాలయ ఉద్యమం స్వతంత్ర పోరాటం, ముఖ్యంగా నిజాం వ్యతిరేక పోరాటంతో సన్నిహిత సంబంధం కలిగి ఉంది. తెలంగాణాలో పాఠశాల విద్య అభివృద్ధి కష్టతరమైన కాలంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం (1918) స్థాపనతో ఉన్నతవిద్య విస్తరించింది. ఈ



విజ్ఞాన వాతావరణంలో గ్రంథాలయాల ఆవశ్యకత పెరిగింది. నిజాంల దోపిడీ పాలన, ఉర్దూ భాష ఆధిపత్యం ఉన్న సందర్భాలలో ప్రజల్లో జ్ఞానోదయం, స్వేచ్ఛాభావాల వ్యాప్తికి గ్రంథాలయాలు రహస్య కేంద్రాలుగా పనిచేశాయి. భారత దేశ చరిత్ర, దేశభక్తి కథలు, విప్లవ రచనలు ప్రజల్లో చైతన్యం పెంపొందించాయి. స్వరాజ్య అనే భావనను ప్రజలలో బలంగా నింపాయి. గ్రంథాలయాలు స్వాతంత్ర్య ఉద్యమానికి సమాచార కేంద్రాలుగా పనిచేశాయి. పత్రికలు, పాంప్లెట్లు, ప్రసంగాల ద్వారా ప్రజలు ఉద్యమ కార్యక్రమాలను తెలుసుకుని వాటిలో పాల్గొన్నారు. అక్షరాస్యత పెంపుద్వారా ప్రజలను జాగృతం చేయడంలో గ్రంథాలయాలు కీలకంగా మారాయి. ప్రజల్లో ప్రశ్నించే మనస్తత్వాన్ని పెంపొందించాయి. మహాత్మా గాంధీ, బాల గంగాధర తిలక్, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్ వంటి నేతల రచనలు గ్రంథాలయాల ద్వారా ప్రజలకు చేరాయి. వీటిలోని ఆలోచనలు స్వాతంత్ర భావజాలానికి బీజం వేశాయి. అనేక గ్రంథాలయాలు సమావేశ కేంద్రాలుగా ఉపయోగపడ్డాయి. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించింది. భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమం కేవలం పుస్తకాలు సేకరించి భద్రపరచడం కోసం కాకుండా, ప్రజలలో అక్షరాస్యతను, చైతన్యాన్ని, జాతీయ భావాన్ని పెంపొందించడానికి ఒక ముఖ్యమైన సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించింది. ఎందుకంటే గ్రంథాలయాల ద్వారానే మహాత్మా గాంధీవంటి జాతీయ నాయకుల సందేశాలు సామాన్య ప్రజలకుచేరాయి. తెలుగు భాష సంస్కృతి పరిరక్షణకు, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఒక మైలురాయిగా నిలిచింది. నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం ద్వారా గ్రంథాలయాలఏర్పాటుకు, తెలుగు భాషా వికాసానికి కృషి చేశారు. నిజాం రాష్ట్రంలో నిరంకుశ పాలనలో, గ్రంథాలయాలు ఒక రకంగా ప్రజాస్వామ్య సాధనకు, తెలుగు భాషా పరిరక్షణకు, స్వాతంత్ర్యోద్యమానికి వేదికలుగా నిలిచాయి. వారి నిస్వార్థ సేవ, దూరదృష్టి కారణంగానే ఈ ప్రాంతాలలో అక్షర జ్ఞానంవ్యాపించి, అనేక సామాజిక ఉద్యమాలకు పునాది పడింది. జాతీయ చైతన్యం పెరిగింది. అక్షరాస్యత, విద్య విస్తరించింది. దేశభక్తి భావాలు బలపడ్డాయి. ప్రజలు స్వేచ్ఛ ఉద్యమంలో పాల్గొన్నారు. కొత్త ఆలోచనలు, సంస్కరణలు వ్యాప్తి చెందాయి. స్వాతంత్ర్య సంగ్రామానికి బలమైన మౌలిక వేదికగా మారాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాలు అమూల్యమైన సేవలు అందించాయి. ప్రజలను చదవడం, ఆలోచించడం, ప్రశ్నించడం వైపు మళ్లించాయి, జాతీయత, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలను ప్రజల్లో నింపాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమ విజయానికి గ్రంథాలయాలు మౌన సైనికుల్లా పని చేశాయి అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ గ్రంథాలయాల వారోత్సవాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ గ్రంథాలయాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించి, పుస్తక ప్రదర్శనలు, పఠన పోటీలు, వ్యాసరచన కార్యక్రమాలు, సాహితీ సదస్సులు, రచయితలతో సంభాషణ కార్యక్రమాలు వంటివి నిర్వహించి విద్యార్థుల్లో పఠనాభిరుచిని పెంచవలసిన ఆవశ్యకత ఉంది. పుస్తకాలు మనలో ఉన్న అనేక సందేహాలను తీర్చడమే కాక మనలో ఆలోచనా శక్తిని, పరిశీలనా దృక్కోణాన్ని పెంచుతాయి. గ్రంథాలయాలు మన సంస్కృతి, చరిత్రను భద్రపరిచే కేంద్రాలు, పాత పుస్తకాల ద్వారా పూర్వీకుల జ్ఞానం, వారి భావాలు, సంఘటనలు మనకు లభిస్తాయి. దాంతో మన జాతి పట్ల గౌరవం, బాధ్యత పెరుగుతుంది. •

# భారీ పరిశ్రమలతో యువతకు ఉపాధి



**ఒంగోలు - (ప్రభాతవార్త)**
ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన Summit 2025 గురించి దామచర్ల జనార్దన్ గారు మీడియాకు వివరించారు. రెండు రోజుల ఫలితాల్లో రాష్ట్రానికి 13 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు, 16 లక్షల యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త కంపెనీలు తీసుకురావటం అలా ఉంచి, ఉన్న కంపెనీలను పక్క రాష్ట్రాలకు తరిమారు. ఇప్పుడు Summit ద్వారా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. ఈ విజయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐటీ మంత్రి లోకేష్ నేతృత్వం కీలకం. చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి దృఢమైన దారిని చూపుతూ, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఇన్వెస్ట్‌మెంట్‌పై ఫోకస్ చేసి, ఆంధ్రప్రదేశ్‌ను వ్యాపార కేంద్రంగా రూపొందించారు. లోకేష్ సమ్మిట్ వేదికను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, కంపెనీలతో నేరుగా చర్చలు జరిపి, కొత్త పెట్టుబడులను రాష్ట్రానికి రావడానికి ఎంతో కృషి చేశారు. ప్రతి అవకాశాన్ని ఫలితాలుగా మార్చడంలో లోకేష్ కష్టం స్పష్టంగా కనిపించిందని దామచర్ల జనార్దన్‌రావు అన్నారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న శిద్దా రాఘవరావు దంపతులు




**ఒంగోలు - (ప్రభాతవార్త)**
ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని ఆదివారం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థాన అధికారులు, వేద పండితులతో కలసి శిద్దా రాఘవరావు దంపతులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం దేవస్థానం అధికారులు, అర్చకులతో కలిసి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులకు వేద ఆశీర్వచనంతో స్వామి వారి, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి అమ్మవారి చిత్ర పటం, శేష వస్త్రాలు అందచేశారు.

## ప్రభుత్వ అధికారిపై ఓ కాంట్రాక్టర్ బెదిరింపు

**ఒంగోలు - (ప్రభాతవార్త)**
ప్రభుత్వ అధికారిపై ఓ కాంట్రాక్టర్ బెదిరింపులకు పాల్పడిన ఘటన ఒంగోలులో చోటు చేసుకుంది. ఆర్డబ్ల్యూఎస్ శాఖ నందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి.వి.నాగేశ్వర రావు పై ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్ చేసిన ఆరోపణలను నిరసిస్తూ సదరు ఆ అధికారి ఆయన పని చేస్తున్న కార్యాలయంలోనే ఇంజనీర్లకు ఆదర్శం అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఎదుట ఆదివారం నిరసన దీక్షను చేపట్టారు. గతంలో పని చేసిన వాటికి బిల్లులు చెల్లించాలని లేకపోతే చంపుతానని కాంట్రాక్టర్ బెదిరించినట్లు ఈఈ నాగేశ్వర రావు తెలిపారు. ఓ వైపు కాంట్రాక్టర్ బెదిరింపులు మరో వైపు రాజకీయ ఒత్తిడి కారణంతో ఉద్యోగం చేయలేకపోతున్నాం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం ఉండడం లేదని అన్నారు. తన సమస్యకు పరిష్కారం దొరికే వరకే నిరాహార దీక్ష కొనసాగిస్తాను లేని పక్షంలో ప్రాణ త్యాగానికైనా వెనుకాడను అని హెచ్చరించారు.

## చిన్నా.. వినరా చిన్న బండంతా లేవురా కన్న

### - ప్రమాదకరంగా బాలల డ్రైవింగ్

**ఒంగోలు (ప్రభాతవార్త)**
ఇటీవల ద్విచక్ర వాహనం నడుపుతున్న సుమారు 30మంది పిల్లలను ఒంగోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి ఒంగోలు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చినా కొందరు పిల్లల తీరు మారకపోవడంతో మరలా మరోసారి కొందరు చిన్నారులు ద్విచక్రవాహనం నడుపుతూ గత గురువారం రాత్రి వారికి ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు ఇచ్చిన యజమానులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని సూచిస్తూ ఇచ్చిన ప్రతి యజమానికి రూ.5035 చొప్పున జరిమానా విధించారు. మళ్లీ ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇటీవల పిల్లల డ్రైవింగ్ ప్రమాదంగా మారింది. తెలిసి తెలియని వయస్సులో వచ్చి రాని విద్యగా వాహనాలు నడుపుతూ అపాయంలో పడుతున్నారు. ఇతరులను ఆపదలోకి నెడుతున్నారు. వీరికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు దృష్టి పెట్టారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీసులతో పాటు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వన్‌టౌన్, టూటౌన్ తాలూకా పోలీసులతో ఇతర ప్రాంతాల్లో పోలీసులతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయాల్లో నిఘా పెడుతున్నారు. వాహనాలు నడిపే బాలలను అదుపులోకి తీసుకుంటున్నారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి హితబోధ చేస్తున్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే మీపై కేసులు నమోదు చేస్తామని 18ఏళ్ల నిండి లైసెన్సు తీసుకున్నాకే వాహనాలు ఇవ్వాలని సూచిస్తున్నారు. కొందరు పిల్లలు తమ వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలపై ఇద్దరు ముగ్గురిని ప్రమాదకరంగా వెళ్తున్నారు. మరికొందరైతే ఫోన్లలో మాట్లాడుతూ నడిపేస్తున్నారు. రోడ్లపై రయ్ మంటూ దూసుకెళ్లడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులే కట్టడి చేయాలి. వాహనం నడపాలన్న, ఆలోచన అత్యుత్సాహాన్ని విరమించుకునేలా కౌన్సెలింగ్ ఇవ్వాలి. లేదంటే తల్లిదండ్రులే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తాం అని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు.


## ఇన్‌చార్జి దద్దాల నారాయణని సన్మానించిన కాళికాయ నారాయణ



**హనుమంతునిపాడు, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ నారాయణ యాదవ్‌ని కాళికాయ నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి తనకు మండల ప్రచార కమిటీ అధ్యక్షుడుగా అవకాశం కల్పించిన సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దద్దాల కాళికాయ నారాయణకి అభినందనలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, నియోజకవర్గ పంచాయతీ విభాగం అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జి డాక్టర్ కస్తాల బాలాజీ, గుంటక రమణారెడ్డి, వేములపాడు కన్వీనర్ కొండపు రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డిపల్లి కన్వీనర్, సర్పంచ్ చిన్న, గొబ్బిళ్ళ శ్రీను తదితరులు ఉన్నారు.

## పార్టీకి కార్యకర్తలే వెన్నుముక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

### - పుట్టవారిపాలెం అతిథి గృహములో బల్లికురవ మండలం పలు గ్రామాల నేతలు కార్యకర్తలతో సమీక్ష



**అద్దంకి రూరల్ నవంబర్ 16 (ప్రభాతవార్త)**
సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అతిథి గృహంలో ఆదివారం వెలమవారిపాలెం, కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాల తెదేపా శ్రేణులతో సమీక్ష సమావేశాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం వారీగా పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకలాపాలు, గ్రామాల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణ, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలను మంత్రి సవివరంగా పరిశీలించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసంపర్కాన్ని మరింత బలోపేతం చేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేయాల్సిన అవసరాన్ని మంత్రి గారు గుర్తుచేశారు. కార్యకర్తలు తమ గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రజల నుండి వస్తున్న సూచనలను వివరించగా, వాటిని ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని మంత్రి గారు భరోసా ఇచ్చారు. సమీక్షా సమావేశంలో స్థానిక పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## నేడు అద్దంకిలో ఇరువురు మంత్రులు పర్యటన

### - 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు

**అద్దంకి , నవంబర్ 16, (ప్రభతవార్త)**
అద్దంకి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఇరువురు మంత్రులు పర్యటించనున్నట్లు అద్దంకి మున్సిపల్ కమీషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మాత్యులు డాక్టర్ పొంగురు నారాయణ, రాష్ట్ర విద్యుత్‌శాఖమాత్యులు గొట్టిపాటి రవికుమార్‌లు పర్యటించనున్నట్లు అందుకు అవసరమైన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు, పూర్తి చేశారు. ఈ పర్యటనలో ద్వారాక నగర్‌లో 4.50కోట్లతో నిర్మించి, 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మంత్రులు ప్రారంభిస్తారు. 7.50కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలైన పాతపసుమర్తిపాలెంలో పునరుద్దరించిన కమ్యూనిటీ హాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజిలో డైనింగ్ హాల్‌తోపాటు, సిసి రోడ్లు, డ్రైయిన్‌లు, సంబంధించి పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభిస్తారు. పట్టణంలోని ఎన్‌ఎస్‌పి కాలువపై గృహాలు నిర్మించుకొన్న 64మందికి స్థాన చలనం కొరకు నివేశన స్థల పట్టాలను పురపాలకసంఘ కార్యాలయంలో మంత్రులచే పంపిణీ చేయడం జరుగుతుందని కమీషనర్ తెలియజేశారు.

# అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై మంత్రి గొట్టిపాటి పర్యటన

### - శిథిల వంతెనలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి - నీటి కోసం ఒక్క రైతు ఫిర్యాదు చేయకూడదు





**బల్లికురవ, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
అద్దంకి బ్రాంచ్ కెనాల్స్‌పై ఆదివారం రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. అద్దంకి నియోజకవర్గ పర్యటనలో భాగంగా పంగులూరు నుండి సంతమాగులూరు వెళ్తూ.. రైతుల ఫిర్యాదు నేపథ్యంలో ఏబీసీపై మేజర్లలో రైతులతో మాట్లాడారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై శిథిలావస్థకు చేరిన ప్రధాన వంతెనల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంతమాగులూరు డీఈ లక్ష్మీనారాయణను ఆదేశించారు. మండలంలోని రామాంజనేయపురం వద్ద ముక్తేశ్వరం మేజర్ కాలువను పరిశీలించారు. ఇటీవల స్థానిక రైతులు కాలువలో చిల్లచెట్లు ఎక్కువగా పెరిగిపోవడం వల్ల పంట పొలాలకు నీరు సక్రమంగా అందడం లేదని, మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకుపోవడంతో సత్వరం స్పందించిన ఆయన అన్ని మేజర్ల పరిధిలో చిల్లచెట్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. తక్షణం పనులు చేపట్టడంతో 3 వేల ఎకరాల మాగాణి భూమికి సాగునీటి ఇక్కట్లు తొలగాయి. చిల్లచెట్లు తొలగింపు, పూడిక తీత పనుల పురోగతిని పరిశీలించారు. మేజర్ పరిధిలోని రైతులతో మాట్లాడారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఒక రైతు కూడా సాగునీరు అందలేదు అనే ఫిర్యాదు చేయకూడదన్నారు. నీటి ప్రవాహం సాఫీగా వ్యవసాయ భూములకు చేరేలా అవసరమైన అన్ని చర్యలను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు ప్రధానకాలువతో పాటు మేజర్లలో కూడా అధికారుల పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జి మల్లినీడి గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షులు దూళిపాల హనుమంతరావు, మస్తాన్‌రావు, పోగులశేఖర్, గొట్టిపాటి శంకర్ తదితరులు ఉండగా ఎస్సై నాగరాజుఆధ్వర్యంలో భద్రతా కార్యక్రమాల పర్యవేక్షణ కొనసాగింది.

## చోరీ కేసును చాకచక్యంగా చేధించిన చీరాల టూటౌన్ పోలీసులు



**వేటపాలెం, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
నవంబర్ 8వ తేదీన చీరాల మండలం పేరాల ముట్టే వారి వీధికి చెందిన గుండా నరసింహారావు ఇంటిలో దొంగలు పడి చోరీ చేసిన కేసును చీరాల టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా చేదించారు. 8వ తేదీ గూండా నరసింహారావు అను వారి ఇంట్లో దొంగలు పడి ఆఉ లక్షలు నగదు, లాకెట్ ఉన్న నల్లపూసల బంగారు చైన్ చోరీ జరిగిందని టూటౌన్ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు చీరాల ఎస్టీపీవో ఎండీ మొయిన్ సూచనల మేరకు పోలీసు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి నవంబర్ 16వ తేదీ చీరాల బాపట్ల ఎన్‌హెచ్ హైవేలోని హాయ్ రెస్టారెంట్ వద్ద నిందితుడు బుదే హరీష్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి నాలుగు లక్షల 65 వేల నగదు, లాకెట్ కలిగిన నల్లపూసల దండను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రైవేటీకరణ విరమించే వరకు ఉద్యమం

**కురిచేడు, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ విరమించే వరకు ఉద్యమం ఆగదని వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలు మూలే నాగమణి, కురిచేడు బూత్ కన్వీనర్ నుసుం చిన్న వెంకటరెడ్డి(బుజ్జి), కార్యవర్గ సభ్యులు మూలే బాలిరెడ్డిలు తెలిపారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపు మేరకు కురిచేడు నుసుం బజారులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వలన రాష్ట్రంలో వైద్య విద్య కుంటుపడుతుందని, విద్య వైద్యం సామాన్యుడికి భారమయ్యే స్థితి ఉందన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న ఇచ్చిన హామీల ప్రకారం 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి ఐదు పూర్తి చేసి విద్యా వైద్యం అందుబాటులోకి తెచ్చాడని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం ప్రైవేటు విధానాన్ని విరమించుకోవాలని, మెడికల్ కాలేజీలు పూర్తికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అంకె గోపాలకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, కాటం చిన్న కోటిరెడ్డి, నుసుం రాజ్యం, మూలే నర్సమ్మ, అనూషా, నుసుం శివమ్మ, మూలే లక్ష్మీ, నుసుం కనకాలు, నుసుం పావని, మూలే నర్సింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నర్సిరెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.






గృహ,పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటన సందర్భంగా, ముంబయిలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన కమిటీ ఛైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి , ఇతర కమిటీ సభ్యులు.

## ఇన్‌చార్జి దద్దాల నారాయణని సన్మానించిన మల్లెల వెలుగొండయ్య



**హనుమంతునిపాడు, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ని మల్లెల వెలుగొండయ్య మర్యాదపూర్వకంగా కలిసి తనకు మండల సోషల్ మీడియా అధ్యక్షులుగా అవకాశం కల్పించిన సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి దద్దాల మల్లెల వెలుగొండయ్యకి అభినందనలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, నియోజకవర్గ పంచాయతీ విభాగం అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జి డాక్టర్ కస్తాల బాలాజీ, గుంటక రమణారెడ్డి, వేములపాడు కన్వీనర్ కొండపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డిపల్లి కన్వీనర్ సర్పంచ్‌చిన్న, గొబ్బిళ్ళ శ్రీను, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి షేక్ కాశీం, బూతపాటి కోటేశ్వరరావు, గుంటగాని రామయ్య, మల్లెల పవన్, చందు, ప్రసన్న కుమార్, నవీన్ తదితరులు ఉన్నారు.

## అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, నవంబర్ 16, (ప్రభాతవార్త)**
గవినివారిపాలెం గ్రామం నందు వడ్లమూడి సాయి స్వామి గృహం నందు శ్రీ అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు అయ్యప్ప మాలధారుల తో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

**అయోధ్యనగర్‌లో :**
అయోధ్యనగర్ గ్రామంలోని చీరాల నియోజకవర్గ కృష్ణబలిజ వన సమారాధన, నూతన పట్టణ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు.



# దేశ హితం అకాక్షించండి .. శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ..

### - ఆంధ్రాశ్రమంలో ఆధ్యాత్మిక పరిమళాలు

నేను పుట్టిన సువి శాలమైన ఈ దేశం, ప్రపంచం బాగుండాలని ప్రతి పౌరుడు ఆకాక్షిస్తూ ఆ దేవ దేవుడు నీలకంఠె స్వరుని ప్రార్ధించాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కారులు శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ సమాజానికి సూచిస్తూ భక్తులకు అనుగ్రహభాషణం చేసారు. కలియుగ కైలాసం వారణాసి క్షేత్రంలో భక్తులకు ఆవాసం ఇస్తున్న ఆంధ్రాశ్రమం లో నీల కంఠెస్వరశతకం పై శ్రీ సామవేదం గారు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా భక్తి మార్గంలో అందరు పయనిస్తూ సమాజం పట్ల కూడా సామాజిక స్పృహ కలిగి ఉండాలని, అన్నారు. వారణాసి క్షేత్రంలోసాక్షాత్ నీలకంఠెస్వరుడు కొలువై ఉన్నారని, భక్తితో సేవిస్తే స్వామి అనుగ్రహం అందరికి లభిస్తుందని తెలిపారు. నిర్మలమైన మనస్సు తొ స్వామిని సేవిస్తూ అలాగే సమాజం పట్ల ఎంతో భాద్యతతొ మెలగాలని సూచించారు. నేడు ఉగ్ర మూకలు, దుష్టశక్తులు సమాజంపై దాడులుకు పాల్పడుతూ, చెడు చేస్తున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. దుష్ట శక్తులు రోజు రోజు కి కొత్త పుంతలు తొక్కుతూ సమాజానికి భయపెడుతూ, పౌరుల ప్రాణాలు హరిస్తున్న నేపథ్యం నేడు చూస్తున్నామని, ఈ దుష్ట శక్తుల భారీనుంచి కాపాడమని నీలకంఠె స్వరుని అందరు ప్రార్ధించాలని కోరారు. సమాజం బాగుంటే మనం బాగుంటామని అందరు ఎరుకలో ఉంచుకోవాలని అనుగ్రహ భాషణం చేశారు.

**ఆంధ్రాశ్రమంలో ఆధ్యాత్మిక పరిమళాలు**
భూకైలాస క్షేత్రం వారణాసి అటువంటి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ గంగా అన్నపూర్ణ విశాలక్ష్మి సమేత విశ్వనాధుని దర్శనంకు ప్రపంచ నలు మూలల నుంచి నిత్యం లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. కానీ ఈ క్షేత్రంలో వసతి సౌకర్యం కొంచం కష్టంగా ఉంటుంది. పైగా భక్తులకు బురిడీ కొట్టించే వాళ్ళు అనేకం. అలా చోటు చేసుకునే సంఘటనలు మనం సినిమాల్లో కూడా చూస్తూంటాం. అటువంటి ఈ కాశీ క్షేత్రంలో ముఖ్యంగా తెలుగు భక్తులకు శ్రీ రామ తారకా ఆంధ్రాశ్రమం రక్షణతో కూడిన వసతిని దాదాపు ఆరు దశాబ్దాలుగా కల్పిస్తున్నది. నిత్యం వేలాది భక్తులు ఇక్కడ బస చేసుకోని స్వామి వారిని దర్శించుకొని తిరిగి వెళుతుంటారు. కేవలం వసతి సౌకర్యం కాకుండ భక్తులకు మంచి ఆధ్యాత్మిక సత్సంఘాలను ఆశ్రమ మేనేజింగ్ ట్రస్ట్ వేమూరి సుందరశాస్త్రి అందిస్తున్నారు. ఈనేపథ్యంలోకంచి, కుర్తాళం, శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానించి భక్తులకు మంగళా శాసనాలు అందిస్తున్నారు. అలాగే హిందూ సమాజ అభ్యున్నతికి తోడ్పాటు అందించి సమాజాన్ని జాగృతి చేసే ప్రముఖ ప్రవచనకారులు సామవేదం షణ్ముఖశర్మ లాంటి పెద్దల చేత ఆధ్యాత్మిక ప్రసంగాలను భక్తులకు అందిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రాశ్రమంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి అని చెప్పవచ్చును. ఈ ఆశ్రమంలో వసతి చేసిన భక్తులు కూడా ఎంతో ఆనందం వ్యక్తం





చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఆంధ్రాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వేమూరి సుందరశాస్త్రి ప్రముఖ వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి గ్రంధ రచయిత సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

6_6.qxd 11/16/2025 11:46 PM Page 1



## వివాహ కార్యక్రమానికి హాజరైన చింతలపూడి



**బల్లికురవ, నవంబర్ 16, ప్రభాతవార్త**
మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన వివాహ కార్యక్రమానికి అద్దంకి వైకాపా ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హాజరయ్యారు. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి, అల్లాబి కుమారుని వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైకాపా మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, స్థానిక నేతలు ఉన్నారు.

## సొంత నిధులతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు



**వెలిగండ్ల, నవంబర్ 16, ప్రభాతవార్త**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సందేశం మేరకు మండలంలోని రామగోపాలపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి రామిరెడ్డి దాదాపు లక్ష రూపాయలు తన సొంత నిధులతో గ్రామంలో నీటి సౌకర్యం లేని 40 కుటుంబాలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బొబ్బా రమణారెడ్డి, వెలిగండ్ల క్లస్టర్ ఇన్‌చార్జి మీనిగ కాశయ్య కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం సొంత నిధులను వినియోగించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ణాటక భాస్కర్‌రెడ్డి, సోముల రామిరెడ్డి, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి చొరువతో తీరనున్న తిమ్మరాజుపాలెం గ్రామ ప్రజల తాగునీటి ఎద్దడి



**మార్టూరు, నవంబర్ 16, ప్రభాతవార్త**
మాటలు చెప్పేవారి దగ్గరకు తాత్కాలికంగా జనం చేరతారు. కానీ కష్టపడి పని చేసి ఇచ్చిన మాట నెరవేర్చే వారి దగ్గరకు విజయం శాశ్వతంగా వచ్చి తీరుతుంది. అందుకు నిదర్శనం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు. అందుకే అక్కడ హ్యాట్రిక్ విజయం సాధించారు. తిమ్మరాజుపాలెం గ్రామ ప్రజలకు మంచినీటి ఎద్దడి తీరనుంది. మంచినీటి చెరువు దుర్గంధం అయి ఫిల్టర్ బెడ్స్ లేక ఏళ్ల తరబడి దుర్గంధమైన నీటితో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రధాన సమస్య అయిన మంచినీటి సమస్యను గత ఎన్నికల సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోగా సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 70.40 లక్షల రూపాయల జలజీవన్ పథకం నిధులతో గ్రామంలో శరవేగంగా ఫిల్టర్ బెడ్స్, ఇంటింటికి నూతన పైపు లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

## ఆర్యవైశ్య సంఘం వనభోజనాలలో పాల్గొన్న యువ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్‌బాబు

### - యువ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్‌బాబు





**దర్శి, నవంబర్ 16, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని ఆర్యవైశ్య సంఘంవారి వనభోజన మహోత్సవం ఆదివారం పులిపాడు గ్రామ శివాలయం దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడు యువ పారిశ్రామిక వేత్త పాల్గొన్న యువనాయకుడు శిద్దా సుధీర్ కుమార్. ఈ సందర్భంగా సాగర స్వాగతం పలికిన ఆర్యవైశ్య ప్రముఖులు మొదటిగా శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం ఆర్యవైశ్యులకు అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సభలో ఆర్యవైశ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆర్యవైశ్యులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పేద వారిని ఆదుకోవడం జరుగుతుంది, అదుకుంటామని, అన్ని రంగాలలో అభివృద్ది చెందాలని ఆయన అన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు శిద్దా సుధీర్ కుమార్‌ని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జబర్దస్త్ టీమ్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు మహిళా నాయకులు, దర్శి మండలం అధ్యక్షులు భూమా సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, మాజీ జిల్లా అధ్యక్షులు కోట హనుమంతరావు, దర్శి ముండ్లమూరు మండలంలోని ఆర్యవైశ్య సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## దర్శి తహాశీల్దార్ శ్రావణ్ కుమార్‌కు సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు



**దర్శి, నవంబర్ 16, ప్రభాతవార్త**
మొంథా తుఫాన్‌లో ప్రజలకు అండగా నిలిచిన దర్శి మండల తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు అభినందించారు. తుఫాన్ సమయంలో మండలంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సైక్లోన్ మొంథా ఫైటర్ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. మండల ప్రజల నుండి తహశీల్దార్ శ్రావణ్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎక్సైజ్ ఆఫీసులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**దర్శి, నవంబర్ 16, ప్రభాతవార్త**
శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం దర్శి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ వారం నినాదమైన వ్యక్తిగత, సమాజ ఆరోగ్యం నినాదాన్ని పాటిస్తూ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది. బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాలను గురించి ఒక ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



## కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో రక్తదాన శిబిరం



**సీఎస్‌పురం, నవంబర్ 16, ప్రభాతవార్త**
సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం-2025 కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఒంగోలు వారు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని సేకరించారు. సుమారుగా 200 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి స్టెఫి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## పంచాయతీ ఎన్నికల్లో ప్రజల వద్దకు ఏ మొహం పెట్టుకోని వెళ్లాం..?

### - అధికార పార్టీలో అంతర్మధనం - ప్రతిపక్ష పార్టీకి ప్రచారాస్త్రం

**పుల్లలచెరువు, నవంబర్ 16, ప్రభాతవార్త**
గ్రామాల్లో స్థానిక సంస్థ హడావిడి మొదలైనట్లే కనిపిస్తోంది. ప్రభుత్వం వచ్చే జనవరి మాసంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు సమాచారం. ఇటీవలే ఇవ్వగా పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ మద్దతుతో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థుల్లో ఓ రకమైన ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మాత్రమే మహిళలందరికి వర్తించింది. మినహా మరే పథకం గ్రామాల్లో ప్రజలకు అందేలుద. ఇది వాస్తవమే. ఎందుకంటే డీఎస్సీలో వచ్చిన ఉద్యోగాలు గ్రామాల్లో ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేలా లేదు. రైతు భరోసా సొమ్ము అంటే అది పీఎం కిసాన్‌తో ముడిపడిన అంశమే. ఇక మరేం ప్రజలకు పలానా పథకాలు ఇచ్చాము అని చెప్పుకోవాలా అని అధికార పార్టీ నాయకులు ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, గ్రామాల్లో లబ్ది పొందిన వారి జాబితా సేకరిస్తే చాలా తక్కువ మందే లబ్దిదారులు ఉంటారు. ఇలా మేము మీ అందరికి ఈ రెండు సంవత్సరాల నుండి ఈ పనులు చేశామని చెప్పడానికి తటపటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే ప్రతిపక్ష పార్టీకి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్లస్ పాయింట్ కానుంది. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి పథకం చేర్చాం అంటూ అప్పటి వైసీపీ ప్రభుత్వంలో అమలైన పథకాల పేర్లన్నీ చెప్పి, మంచి చేశాం.. మంచే చేస్తాం అంటూ ప్రణాళికతో ముందుకెళ్లేలా పార్టీ అధిష్టానం ఇప్పటికే రంగం సిద్దం చేసి గెలుపు గుర్రాలను ఎంపిక చేసే పనిలో పడింది. గ్రామాల్లో వైసీపీ తరుపున పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారి వివరాలు తెప్పించుకుని పోటీకి ఎలా సిద్దం చేయాలో అని పక్కాగా అన్ని అస్త్రశస్త్రాలను సంసిద్ధం చేస్తోంది. ప్రస్తుతం యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ హైకమాండ్ ఏ కార్యక్రమం చేయమని ఆదేశించినా తాటిపర్తి పిలుపుతో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు జన సంద్రంలా తరలివచ్చి విజయవంతం చేస్తున్నారు. కొద్దిపాటి నిరసన కార్యక్రమం అయిన గొప్ప హైలైట్ అవుతోంది. ఇదే పార్టీలో ఐక్యత, వైసీపీకి పట్టుగా నిలుస్తోంది. కొత్త అభ్యర్థులు అయినా ఇక్కడ గెలుపు పిలుస్తోందంటే ఇక్కడ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కనిపిస్తోంది. పార్టీలో గ్రూపులు ఉన్నట్లే ఉన్నా అవి కనిపించాలంటే బూతద్దంలో చూడాల్సి ఉంటోంది. ఇది అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య ఇక్కడ ప్రధాన తేడా. అందుకే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపుకు అధికార బలాన్ని ఉపయోగించి ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని పటాపంచలు చేసేందుకు వైసీపీ సిద్దంగా ఉందని తెలుస్తోంది. రానున్న ఎన్నికలు ఇక్కడ నువ్వా నేనా అన్నట్లు కాకుండా ఈ నియోజకవర్గంలో వైసీపీకి ఏకపక్షంగా మారే అవకాశం ఉందని పలువురు కూటమి నాయకులే బహిరంగంగా చెబుతోండడం విశేషం.

## గ్రంధాలయ ఉద్యమకారులకు నివాళి



**నాగులుప్పలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా మూడవరోజు కార్యక్రమాన్ని గ్రంధపాలకులు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమంగా గ్రంధాలయ ఉద్యమకారులను స్మరించుకొనుట నిర్వహించబడింది. గ్రంధాల యోద్యమానికి సేవలందించిన ప్రముఖులు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం తదితరుల చిత్రపటాలకుపూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం వారి సేవలు, గ్రంధాలయ ఉద్యమంలో వారి పాత్ర గురించి పిల్లలకు, పాఠకులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జి.నారాయణ పాల్గొని పిల్లలను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని అభినందించారు. తదుపరి పిల్లల కార్యక్రమంగా చదవటం మాకిష్టం నిర్వహించారు. పిల్లలతో కథల పుస్తకాలు చదివించడం జరిగింది. పిల్లలు కథలు చెప్పటంలో ప్రతిభను ప్రదర్శించారు. చదవడాన్ని ప్రోత్సహించే భాగంగా వారికి పెన్నులు, పెన్సిళ్లు బహుమతులుగా అందజేశారు. తదుపరి ఇండోర్ గేమ్స్ ఆడించటం జరిగింది. పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం చివరగా పిల్లలకు బిస్కెట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలు, పాఠకులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంధాలయ వారోత్సవాలు చదువు సంస్కృతిని విస్తరించేందుకు దోహదపడుతన్నాయని గ్రంధపాలకులు తెలిపారు.

## ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

### - బీజేపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణారావు




**కొనకనమిట్ల, నవంబర్ 16, ప్రభాతవార్త**
ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. ఆదివారం ఆత్మానిర్భార్ భారత్ సంకల్ప అభియాన్ ప్రవాస యోజనలో భాగంగా మండలంలోని గొట్లగట్టు, నాగంపల్లి గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షుడు మన్న సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంట స్వదేశీ ఇంటింట స్వదేశీ నినాదంతో కరపత్రాలు పంపిణీ, స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కిలారి శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గాడిచర్ల, అయ్యంకి, ఎస్సార్‌లకు నివాళి




**దర్శి, నవంబర్ 16, ప్రభాతవార్త**
శాఖా గ్రంధాలయం దర్శి నందు 58వ జాతీయ గ్రంధాలయం ఆలచనలో భాగంగా మూడవరోజు గ్రంధలయోద్యమానికి సేవలందించిన ప్రముఖులు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్సార్ రంగనాథన్, పాతూరు నాగభూషణం తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రంధ పాలకురాలు విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. విద్యార్థిఈన, విద్యార్థులకు దేశభక్తి గీతాల పాటల పోటీలు నిర్వహించడం జరిగింది.

## శాలివాహన కుమ్మర సీఐ సతీష్ హత్యను ఖండించిన శాలివాహన రాష్ట్ర కార్పొరేషన్ డైరక్టర్ మాడపాకుల శ్రీనివాసులు



**దర్శి, నవంబర్ 16, ప్రభాతవార్త**
శనివారం మన కుల బాంధవుడు సీఐ సతీష్‌ని అతికిరాతకంగా హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నిజాయితీ గల ఆఫీసర్ సతీష్ పోయిన సారి వైసీపీ గవర్నమెంట్‌లోతిరుపతి పరకామణి కేసులో నిజాన్ని నిక్కచ్చిగా సాక్ష్యం చెప్పడానికి సతీస్ సిట్ అదికారులకు ముందుకు గుంతకల్ రైల్వే స్టేషన్ ట్రైన్ బుక్ చేసుకుని తిరుపతికి బయలుదేరిన మార్గమధ్యలో నితీష్ ని చంపడం దారుణమని ఈ కేసును సిబిఐకి అప్పచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అమర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పడిపూజలో చింతలపూడి



**బల్లికురవ, నవంబర్ 16, ప్రభాతవార్త**
మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో వైకాపా ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వైకాపా నాయకులు దర్శి శ్రీరామమూర్తి అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. భక్తిభావంతో స్వామివారి అభిషేక కార్యక్రమాలలో చింతలపూడి పాల్గొన్నారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొనటం మానసిక ఉల్లాసాన్ని ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందింప చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మండల వైకాపా కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, దర్శి రామకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి స్వామి





**పొన్నలూరు,నవంబర్ 16 ,ప్రభాతవార్త**
మండలానికి చెందిన వెల్లటూరు, చెరుకూరు గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదివారం పంపిణీ చేశారు. తూర్పునాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండలంలోని లబ్ధిదారులతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల లబ్ధిదారులకు కూడా సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరు, ముప్పాళ్ల పిఏసీఎస్ అధ్యక్షులు వడ్డే మాల్యాద్రి, మన్నెం రమణయ్య, తెదేపా నాయకులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మలినేని విద్యార్థినులకు క్యాంపస్ ఉద్యోగాలు



**సింగరాయకొండ, నవంబర్ 16, ప్రభాతవార్త**
మండలంలోని కనుమళ్ల పంచాయతీ పరిధిలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో స్టాట్స్ పెర్ఫార్మన్స్ కంపెనీ ఏడుగురు విద్యార్థినులను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కళాశాల చైర్మన్ డా. మలినేని పెరుమాళ్లు తెలిపారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థినులు ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 21 మందికి క్యాంపస్ ద్వారా ఉద్యోగాలు లభించాయని డైరెక్టర్ డా. గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఎంపికైన వారికి వార్షికంగా రూ.3 లక్షల ప్యాకేజీ లభించనుంది. కే. వైష్ణవి, వై. పల్లవి, షేక్ షబానా, పి. లక్ష్మీ సాత్విక, బి. భాగ్యలక్ష్మి, కె. లక్ష్మీ వైష్ణవి, ఎస్. వాసవిలు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, టిపిఓ స్రవంతి, కాలేజ్ సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

## గ్రంధాలయ పితామహులు రంగనాతన్ తదితరులకు ఘన నివాళులు





**సంతనూతలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఏపీ గురుకుల పాఠశాలలో ఆదివారం నాడు సంతనూతలపాడు శాఖ గ్రంధాలయం ఆధ్వర్యంలో జరిగిన 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంధాలయ పితామహులు సీఆర్ రంగనాథన్, పాతూరి నాగహూషణం, అయ్యంకి వెంకట రమణయ్యలకు ఘన నివాలులర్పించారు. సంతనూతలపాడు శాఖ గ్రంధాలయం గ్రంధ పాలకులు కే.సత్యనారాయణ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు ఇ.సుప్రజ తదితరులు గ్రంధాలయ పితామహులు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు, దేశభక్తి గీతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మోషే తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్యవైశ్య కార్తీక మాస సమారాధన వేడుకలు



**సంతనూతలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఆర్యవైశ్య శ్రీ సీతారామస్వామి నిత్య భజన మందిరం నందు ఆదివారం నాడు ఘనంగా ఆర్యవైశ్య కార్తీక మాస సమారాధన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రత వేడుకలు నిర్వహించారు. 15 మంది దంపతులు ఈ పూజలలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు నేలబట్ల శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు వి.నాగసాయి కృష్ణ శర్మ తదితరులచే సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య కార్తీక మాస సమారాధన వేడుకలకు శాశ్వత ఉభయ దాతలుగా శిఘాకొల్లి సత్యనారాయణ అండ్ సన్స్ మరొక 22 మంది వ్యవహరించారు. ఈ వేడుకలలో అధిక సంఖ్యలో మహిళలు, ఆర్యవైశ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ వేడుకలను ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు శిగాకొల్లి సత్యనారాయణ, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, కోశాధికారి వేమా చిన వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### గుండంచర్ల కాటమరాజు ఆలయంలో జరిగే కార్తీక మాస యాదవ సమారాధన వేడుకలకు తరలి వెళ్ళిన సంతనూతలపాడు నేతలు



**సంతనూతలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
గుండం చర్లలోని కాటమరాజు ఆలయంలో జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగే కార్తీక మాస వన సమారాధన వేడుకలకు సంతనూతలపాడు నుండి యాదవ సంఘం నేతలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. జిల్లా యాదవ సంఘం ఈ వేడుకలను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నలగట్ల శ్రీను, బొడ్డు శంకర్, రావులపల్లి సురేష్‌బాబు, నల్లగట్ల సుబ్బారావు, పి.స్థానకాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితం పేరు.. అమ్మకం జోరు..!

### - తీరం, నదులలో ఇసుక దందా

**ఒంగోలు, ప్రభాతవార్త**
ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని కొందరు దళారులు వారికి అనుకూలంగా మార్చుకుని లాభపడుతున్నారు. దీంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం జనానికి ఇసుకను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నిబంధనలు సడలించిన దానిని ఇసుకాసులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇకనైనా యంత్రాంగం ఇసుక విక్రయాలు సాగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, గుండ్లకమ్మ నది ప్రాంతాల్లో ఇసుక క్వారీల నుంచి ట్రాక్టర్లలో ఇసుక తోలుకెళ్తున్నారు. ఒక్కో క్వారీలో డిమాండ్‌ను బట్టి ఒక ట్రాక్టర్‌కు రూ.500 నుంచి రూ.800ల వరకు కూలీలు ఇసుక లోడ్ చేస్తున్నారు. ఈ విధంగా ఇసుక లోడ్ చేసుకుని వెళ్తున్న ట్రాక్టర్లు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు విక్రయాలు జరుపుతున్నారు. దీని వల్ల టన్ను ఇసుక ధర రూ.1000ల వరకు పలుకుతుంది. ఇసుక అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీలో బాట ఖర్చుల కోసం రూ.200లు తీసుకుంటున్నారు. ధరలు మాత్రం అధికారులు నియంత్రణ చేయడం లేదు. ఉచిత ఇసుక ఎక్కడి నుంచి ఎక్కడికి తోలుకెళ్లాలి. ఎంత వసూళ్లు చేయాలి అనే స్పష్టత అధికారులు కూడా ఇవ్వలేని పరిస్థితి. దీంతో అదును చూసి ఇసుకాసురులు అక్రమ సంపాదనకు తెరతీసి జేబులు నింపుకుంటున్నారు. దీంతో అటు వినియోగదారుడి జేబుకి చిల్లుపడడమే కాకుండా జాతి సంపద కొందరు జేబుల్లోకి వెళ్తుంది. ప్రతి వినియోగదారుడు ఇసుక అవసరం అయినప్పుడు యడ్లబండి, ట్రాక్టర్‌తో ఉచితంగా ఇసుక తీసుకెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కానీ క్షేత్ర స్థాయిలో క్వారీలో ఇసుకను వినియోగదారులకు కాకుండా కొంత మంది ట్రాక్టర్లలో లోడింగ్ చేసుకుని అమ్మకాలు చేపడుతున్నారు. రాత్రి సమయాల్లో లారీల్లో నింపి అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

7_7.qxd 11/16/2025 11:47 PM Page 1



## కార్తీక వన విహార యాత్రలో ఇడస్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

### - కోటప్పకొండలో సందడి చేసిన విద్యార్థులు , కార్తీక వన భోజనాలు




**సంతమాగులూరు నవంబర్ 16 ,ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలంలోని ప్రముఖ విద్యాసంస్థ కార్తికేయ విద్యాసంస్థ నిర్వహణలోని ఇడస్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, బోధన, బోధ నేతర సిబ్బంది కార్తికేయ వన మహోత్సవంలో భాగంగా కోటప్పకొండ లో సందడి చేశారు. పాఠశాల విద్యార్థులు కార్తీక వన విహార యాత్రను ఇడస్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ యశోద శివారెడ్డి మాధవి,లు పాఠశాల ఆవరణలో యాత్రకు బయలు దేరు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో విద్యార్థులు, బోధన , బోదనేతర సిబ్బందితో యాజమాన్యం సందడిగా పార్కులు, పూర్వపు చరిత్రలను తెలిపే శిల్పాలు, ఆలయాలను దర్శించడంతో పాటు కోటప్పకొండ ప్రాంతాన్ని అన్నింటిని కలియ తిరిగి సందడి చేశారు. అనంతరం పుణ్యక్షేత్రంలో పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన వన బోజనాలు చేసి తిరిగి పాఠశాల వద్దకు చేరుకుని యాత్రను ముగించారు. ఈ యాత్రలో పాఠశాల డైరెక్టర్ యశోద శివారెడ్డి, మాధవి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నలగాటి శివ కోటేశ్వరరావు



**పెద్దదోర్నాల, నవంబర్ 16, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు ఉత్తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మొంథా తుఫాన్ సమయంలో ముందే రూపొందించుకున్న ప్రణాళికల ద్వారా సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా మురుగునీటి కాలువల శుభ్రత, ప్రజల రక్షణ వంటి అత్యవసర సేవలలో అంకితభావంతో పని చేసినందుకు ఉత్తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి అవార్డును నలగాటి శివ కోటేశ్వరరావు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శివ కోటేశ్వరరావు సేవలు ప్రశంసిస్తూ పలువురు దోర్నాల ప్రజలు, నాయకులు అభినందనలు తెలిపారు.

## ప్రజాస్వామ్య విలువలను కాపాడేది పత్రికా రంగమే

### - పత్రికా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన పోట్ల గోవిందు



**పుల్లలచెరువు, నవంబర్ 16, ప్రభాతవార్త**
జాతీయ పత్రికా దినోత్సవం పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో పోషించే పాత్రను గుర్తించే రోజు మాత్రమే కాదు అది పత్రికల విజయాలు, అవి ఎదుర్కొనే ప్రతి సమస్యలు చర్చించడానికి ఒక వేదిక కూడా అని పోట్ల గోవిందు అన్నారు. పత్రికా దినోత్సవం పురస్కరించుకుని పుల్లలచెరువు మండలంలోని పత్రిక విలేకర్లకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పోట్ల గోవిందు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను సామాజిక అంశాలను, ప్రభుత్వ విధానాలను ముందుగా ప్రజల ముందుకు తీసుకువచ్చేది విలేకరులే అని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను వాస్తవ రూపంలో ప్రజల దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయులు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని అన్నారు. పుల్లలచెరువు మండల అభివృద్ధి ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ప్రజల మధ్య వంతెనగా విలేకర్లు పని చేస్తున్న విధానాన్ని గోవిందు ప్రత్యేకంగా అభినందించారు. విపత్తుల సమయంలోనైనా వేడెక్కిన రాజకీయ పరిణామాల్లోనైనా తమ బాధ్యతను మరచిపోకుండా నిజాయితీగా పని చేసే పాత్రికేయులకు సమాజం రుణపడి ఉంటుందన్నారు. సమాజ నిర్మాణంలో నాలుగో స్తంభంగా పత్రికా రంగం కృషి అమూల్యమని పేర్కొన్న గోవిందు ప్రజలకు అండగా, నిజానికి అద్దంగా నిలిచే పత్రికా రంగం మరింత బలోపేతం కావాలి. పుల్లలచెరువు మండల విలేకర్లందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రికా విలేకర్లు పాల్గొన్నారు.

## విజయవంతమైన గాండ్ల సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం

### - అలరించిన కోలాటం, నృత్య ప్రదర్శనలు




**కొనకనమిట్ల, నవంబర్ 16, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలోని గోశాల నందు గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, పొదిలి యూనిట్ ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం గోపూజ, మహాశివాభిషేకంతో ప్రారంభించారు. అనంతరం కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర సలహాదారుల అధ్యక్షులు తిరుపతి హరిగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలో ప్రకాశం జిల్లాలో ఉన్న గాండ్ల సామాజిక వర్గం యొక్క ఐక్యత గొప్పదని అభినందించారు. అనంతరం జిల్లా గౌరవ సలహాదారులు తగ్గెల నాగభూషణం మాట్లాడుతూ 2000 సంవత్సరంలో సంఘం స్థాపించామని 25 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా జిల్లాలో సిల్వర్ జూబ్లీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని సూచించారు. మార్కాపురం జాతీయ జనతా పార్టీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ భారతదేశాన్ని పరిపాలిస్తున్న గొప్ప నాయకులు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నరేంద్ర మోడీ అని కొనియాడారు. బీసీలకు 18 రకాల వృత్తుల వారికి ఏర్పాటు చేసిన విశ్వకర్మ పథకంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి మాట్లాడుతూ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పిల్లలను చక్కగా చదివించుకోవాలని, చదువుతో రాణించినట్లయితే అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. యూత్ కన్వీనర్ రోషన్‌బాబు మాట్లాడుతూ త్వరలో కార్పొరేషన్ రాబోతున్నందున చాలా సంతోషమని తెలిపారు. అనంతరం సాంప్రదాయ పద్దతిలో విందు భోజనం ఏర్పాటు చేసి తదుపరి మహిళలకు కోలాటం డ్యాన్స్ నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిద్దలూరు ప్రభాకర్, హరిగోపాల్, వరికుంట్ల రాజా, సిరిగిరి సత్య, జిల్లా గౌరవ అధ్యక్షులు తంగెళ్ల నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ కన్వీనర్ రోషన్‌బాబు, జిల్లా గౌరవ సలహాదారులు చిట్టెంశెట్టి పెద్ద సుబ్బారావు, కోశాధికారి వరికుంట్ల హనుమంతరావు, ఏరువ వెంకటరామయ్య, దుద్దు హరి, బట్టు పిచ్చయ్య, ఫణి, మాధవి, హారిక, అనూష తదితరులు పాల్గొన్నారు.

## 17 వ బ్లాకులో వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**మార్కాపురం, నవంబరు 16, ప్రభాతవార్త**
మార్కాపురం మున్సిపాలిటీలో 17వ బ్లాక్ ఇంచార్జ్ కరీముల్లా ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబుకు గజమాలతో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. కార్యక్రమ మార్గమంతా ప్రజలు పెద్ద ఎత్తున ఆయనకు స్వాగతం, సన్మానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలను వెంటనే ఉపసంహరించాలని, ప్రభుత్వం స్వయంగా మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళనకు ప్రతిరూపంగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మార్కాపురంలో భారీగా ప్రజలు పాల్గొనడం గర్వకారణమన్నారు. కరెంట్ ఆఫీస్ వద్ద నుండి ప్రారంభమైన ఈ సంతకాల సేకరణలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం టౌన్ అధ్యక్షుడు షేక్ సలీం, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేక్, ఏపీ స్టేట్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ మక్బూల్ బాషా, వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ ముద్దీన్, గోలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ టి అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 9వ బ్లాక్ కౌన్సిలర్ సిరాజ్, కొత్త కృష్ణ, 18వ బ్లాక్ ఇంచార్జ్ సయ్యద్ గఫూర్, 11వ బ్లాక్ ఇంచార్జ్ ఉత్తంకుమార్, 31వ బ్లాక్ ఇంచార్జ్ ఏడుకొండలు, 8వ బ్లాక్ ఇంచార్జ్ గోలమారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపాలిటీ 17వ బ్లాక్ అధ్యక్షుడు గుర్రపు వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు విశేష స్పందన ఇచ్చి భారీ ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

**రాచర్ల, నవంబర్ 16 ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన రాచర్ల పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు మండలంలోని చిన్నగానిపల్లి గ్రామానికి చెందిన తలపాటి గోపి మనోహర్ ఆది లక్ష్మమ్మ ఇరువురు ద్విచక్ర వాహనంపై గిద్దలూరు వెళుతుండగా అదే సమయంలో చిన్నగానిపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శ్రీనివాసులు కారులో గిద్దలూరు నుండి చిన్నగానిపల్లి వెళ్లేందుకు వస్తున్నారు. రాచర్ల పెట్రోల్ బంక్ మూలమలుపులోకి రాగానే రెండు వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో ఆది లక్ష్మమ్మ గోపి మనోహర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న కొందరు క్షతగాత్రులను ఆటోలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. రెండు వాహనాలు అధిక శాతం దెబ్బతిన్నట్లు సంఘటన స్థలంలో కనిపించింది.

## విద్యుత్‌కు అంతరాయము

**ఒంగోలు - ప్రభాతవార్త**
17 వ తేదీ అనగా సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు ద్వారకా నగర్, సమతనగర్, లింగారెడ్డి కుంట, మిల్క్ ప్రాజెక్ట్, పీర్ల మాన్యం, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, జెబి పి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయము కలదు అని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి.రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా కోరడమైనది.

# దేవరాజుగట్టులో హరిత హారతి కార్యక్రమం

### - చెట్టును నాటడం భవిష్యత్ తరాలకు జీవనాధారం

### - యర్రగొండపాలెం టిడిపి ఇన్ ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు




**పెద్దారవీడు, నవంబరు 16, ప్రభాతవార్త**
పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఆదివారం హరిత ఆంధ్ర ప్రదేశ్ ఇన్స్టిట్యూషన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పండ్ల మొక్కలు నాటి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హరిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంతో దూరదృష్టి ప్రణాళికలు రూపొందించి, ప్రతి గ్రామంలో పచ్చదనం విస్తరణకు కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాల ప్రాంగణాల్లో పచ్చదనం పెంపు కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. చెట్టును నాటటం ఒక సేవ మాత్రమే కాదు, అది భవిష్యత్తు తరాలకు జీవనాధారమని రాబోయే తరాలకు ఇస్తున్న అమూల్యమైన కానుక అని ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండలంలోని అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానించిన డాక్టర్ మక్బూల్ బాషా




**మార్కాపురం, నవంబరు 16, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ అన్నా రాంబాబును తాజాగా పార్టీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డాక్టర్ వింగ్ సెక్రటరీగా ఎన్నికైన డాక్టర్ మక్బూల్ బాషా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేక్, మార్కాపురం పట్టణ అధ్యక్షుడు షేక్ సలీం, 17వ బ్లాక్ ఇన్చార్జి షేక్ కరీముల్లా పాల్గొనగా కార్యక్రమాన్ని మార్కాపురం టౌన్ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ రఫీ సమన్వయం చేశారు. సన్మానోత్సవంలో నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ బలోపేతం కోసం డాక్టర్ మక్బూల్ బాషా సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం వైఎస్ఆర్సిపి ఏపీ స్టేట్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ మక్బూల్ బాషాను స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 9వ బ్లాక్ కౌన్సిలర్ సిరాజ్ , టౌన్ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, 18వ బ్లాక్ ఇంచార్జ్ సయ్యద్ గఫూర్, సీనియర్ నాయకులు సీఎం ఖాసీం, సీనియర్ నాయకులు అజమతుల్లా (బిల్డర్), 13వ బ్లాక్ నాయకుడు జాఫర్ (రియల్ ఎస్టేట్) తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాల పురోగతిలో డాక్టర్ మక్బూల్ బాషా సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. అనంతరం సభలో పాల్గొన్న వారందరూ ఆయనకు శాలువాలు కప్పి సన్మానించారు.

## కలెక్టర్ నుండి ప్రశంస పత్రం అందుకున్న ఇరిగేషన్ ఏఈ శేఖర్

### - అభినందనలు తెలిపిన శ్రేయోభిలాషులు



**రాచర్ల, నవంబర్ 16,ప్రభాతవార్త**
గత మొంథా తుఫాన్ సమయంలో ఇరిగేషన్‌శాఖ ఏఈశేఖర్ మండలంలోని చెరువుల పరిశీలనలో ప్రత్యేక ప్రతిభ చూపడం పై జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఇరిగేషన్‌శాఖ డిఈ సిహెచ్ రామారావు, ఏఈలు సుధాకర్‌రావు,అభిరామ్ రెడ్డిలు మాట్లాడుతూ ఇరిగేషన్‌శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమని అన్నారు.శేఖర్ ప్రతిభను గుర్తించి అతనికి శనివారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందించడం జరిగిందని, ఈ సందర్భంగా శేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నామని వారన్నారు. ప్రశంసా పత్రం అందుకున్న శేఖర్‌ను వివిధశాఖల అధికారులు,సహోద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజ ప్రారంభోత్సవంలో అన్నప్రసాద వితరణ

### - ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, జనసేన ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్




**మార్కాపురం, నవంబరు 16, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజ ప్రారంభోత్సవ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లిఖార్జున, సిఐ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు, కంబం వెంకట రమణ, శివసింగ్, ఫణీంద్ర, ఏలిశెట్టి భరత్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

## 18న మైనంపాడులో సాఫ్ట్‌బాల్ బాల బాలికల జట్టు ఎంపికలు

**సంతనూతలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం మైనంపాడు హైస్కూల్లో ఈ నెల 18న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ బాల్ అండర్-14 అండర్-17 ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల బాలికల జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా కార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏ.శిరీషలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఫోన్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, లీప్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రిపోర్టు చేయాలని తెలిపారు.వివరాలకు పీఈటీ డి.శ్రీనివాసరావు సెల్ నెంబరు 7989440879 ను సంప్రదించాలని వారు కోరారు.

# ఘనంగా సుదర్శన హోమం వేడుకలు




**సంతనూతలపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామంలోని శ్రీదేవి,భూదేవి,మాధవస్వామి, ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం నాడు ఘనంగా సుదర్శన హోమం వేడుకలు జరిగాయి. అర్చకులు ఉదయగిరి శేషాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో సీహెచ్ శ్రీనివాసరావు,దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం అన్నసంతర్పణ వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి.

## ఘనంగా కాపు వనభోజనాల కార్యక్రమం



**చీరాల, నవంబర్ 16, ప్రభాతవార్త**
కాపు జిల్లా అద్యక్షులు కొక్కిరాల సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒంగోలులో కాపు వనభోజనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాపు జేసీ నాయకులు సందు జనార్ధన్ కూడా వచ్చారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఉగ్గిరాల మార్కండేయులుని ఆమంచి కృష్ణమోహన్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి కాపుల ఐక్యతకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.ఈ వనభోజనాలకు ప్రాంతీయ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాపుల ఐక్యతకు కృషి చేస్తున్న చీరాల కాపు నాయకులు గుంటముక్కల నాగేశ్వరరావు మామిడాల శ్రీనివాసరావు, మిరియాల శ్రీనివాసరావు చింతా రమేష్‌లను కూడా సత్కరించారు. పండుగ వాతావరణంలో సాగిన ఈ వనభోజనాల కార్యక్రమం కాపుల ఐక్యతను మరింత బలపరిచేలా నిలిచాయి.

# అలుగు పారిన మార్కాపురం చెరువు

### - అలుగు వద్ద గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు




**మార్కాపురం, నవంబర్ 16, ప్రభాతవార్త**
ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మార్కాపురం చెరువు పూర్తిగా నిండిపోయి రెండు అలుగులు ప్రవహిస్తున్నాయి. చెరువు అలుగు వద్ద గంగమ్మ తల్లికి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత చెరువు అలుగు ప్రవహించడం ఆనందదాయకమని అన్నారు. దీంతో కిందనున్న బోడపాడు చెరువును పూర్తిగా నింపే అవకాశం లభించిందన్నారు. రెండు అలుగులలో ఒకదాన్ని తాత్కాలికంగా మూసివేసి బోడపాడు చెరువును సంపూర్ణంగా నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలోని డిప్‌బోర్లు రీచార్జ్ అయి రైతులకు, ప్రజలకు శాశ్వతంగా నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ సీనియర్ నాయకులు పివి కృష్ణారావు, జనసేన నాయకుడు సయ్యద్ సాధిక్, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గోపూజ, మహనివేదన



**సీఎస్‌పురం, నవంబర్ 16, ప్రభాతవార్త**
మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి అభిషేక సేవ,విశిష్ట పూజలు అర్చకుల వేద మంత్రాల నడుమ ఘనంగానిర్వహించారు.ఈసందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ స్వామివారి ఉత్సవమూర్తికి అభిషేకం గాంచారు. అదే విధంగా గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ గాంచి స్వామివారికి సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, ధర్మకర్త కొమ్మనేని చిన్న ఆదినారాయణ,భక్తులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా మహాపుష్పయాగం






**సీఎస్‌పురం, నవంబర్ 16, ప్రభాతవార్త**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహా పుష్పయాగం ఆలయ అర్చకులు మంకాల శివ ప్రసాద్ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాలలో భాగంగా నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి శ్రీ నారాయణ స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మహాపుష్పయాగం చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆకాశ దీపం కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలువురు దాతలు సమకూర్చిన పుష్పాలతో వేద పండితులు, ఆలయ పూజారులు మహా పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎన్‌జీఆర్ నరసింహబాబు, ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఆలయ సిబ్బంది, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాల కల్పనలో ముందంజలో ఎమ్మెల్యే ఉగ్ర

### - జననీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్ మేళా



**కనిగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త**
కనిగిరి వెనుకబడిన క్షామప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు అందించాలనే లక్ష్యంతో జననీ చారిటబుల్ ట్రస్టు తరుపున ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో భారీ జాబ్ మేళాను నిర్వహించారు. జననీ చారిటబుల్ ట్రస్టు, మేన్ పవర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సహకారంతో నిర్వహించిన ఈ ఉద్యోగ మేళాకు మొత్తం 172 మంది యువత హాజరయ్యారు. వీరిలో హీరో కంపెనీకి 120 మంది అభ్యర్థులు ఎంపిక కావడం ఈ ప్రాంతంలో సానుకూల సంచలనంగా మారింది. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు మేన్ పవర్ మేనేజ్‌మెంట్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు షేక్ ఫిరోజ్, కొండా కృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, షేక్ జంషీర్ అహ్మద్, నంబల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతంలో యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి నిరంతరం సేవా కార్యక్రమాలు , వైద్య శిబిరాలు, జాబ్ మేళాలు నిర్వహిస్తూ ప్రజల అవసరాలను తీర్చుతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ట్రస్టు ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్సై సంపత్ కుమార్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు



**పుల్లలచెరువు, నవంబర్ 16, ప్రభాతవార్త**
మొంథా తుఫాన్ భారి నుండి ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సురక్షితంగా ఆయా ప్రాంతాలకు చేర్చిన పుల్లలచెరువు ఎస్సై ఎల్.సంపత్ కుమార్‌ను నిన్నటి రోజున జిల్లా కలెక్టర్ రాజాబాబు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న సందర్భంగా ఆయన్ని శాలువాతో సన్మానించిన పుల్లలచెరువు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పోట్ల గోవింద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల కోటయ్య, మాజీ మండల అధ్యక్షులు పయ్యావుల ప్రసాదరావు, టీడీపీ నాయకులు గజ్వాలి భాస్కరరావు, ఎంపీటీసీ మేడికొండ రాధాకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు సోమేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



**వేటపాలెం, నవంబర్ 16, ప్రభాతవార్త**
మండలంలోని దేశాయిపేట పంచాయతీ పరిధిలోని అనాథ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఆదివారం నాడు ఏర్పాటు చేశారు. డాక్టర్ కేఎస్ రామానుజమ్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. వృద్ధులను పరీక్షించిన ఆయన వారికి కావాల్సిన వైద్య సమాచారాన్ని అందించారు. అనాథ వృద్ధులకు ఈసేవను అందించినందుకు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. అనాథ వృద్ధులకు సేవ చేయడం దేవునికి సేవ చేయడమేనని ఈ సందర్భంగా రామానుజం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కులాల కార్తీక మాస వనభోజన మహోత్సవంలో టీడీపీ మండల నాయకులు కూరాకు వెంకట్



**హనుమంతునిపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నందు ఆదివారం బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కులాల కార్తీక మాస వనభోజన మహోత్సవంలో టీడీపీ మండల నాయకులు కూరాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ కూరాకు వెంకట్ ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడుతూ అందరం కలిసి బీసీల అభివృద్ధికి దోహదపడాలని బీసీ కులాల అభివృద్ధి కొరకు నా వంతు నేను కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక బీసీ నాయకులు పల్లా మాలకొండయ్య, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 11/16/2025 11:50 PM Page 1



## హిందూపురంలో వైసీపీ కార్యాలయం ధ్వంసం చేయడం అప్రజాస్వామిక చర్య

### - తీవ్రంగా ఖండించిన దద్దాల




**కనిగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే కార్యాలయంపై జరిగిన దాడిని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్సీపీ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని అద్దాలు, ఫర్నిచర్, విగ్రహాలు ధ్వంసం చేయటంతో పాటు అడ్డొచ్చిన పార్టీ కార్యకర్తలపై దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు ప్రజాస్వామ్యానికి ముప్పని దద్దాల విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించినందుకు దాడులకు పాల్పడటం తగదని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు కలిగించినా ప్రజల కోసం పోరాటం ఆగదు. అధికారం శాశ్వతం కాదు. ఈ అరాచకానికి భవిష్యత్తులో మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించిన దద్దాల, రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట దౌర్జన్యాలకు మార్గం సుగమం చేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. హిందూపురం ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అర్జునుని శౌర్య - ధర్మ గాథ .. చిన్నారులకు ప్రేరణగా బోధన




**కనిగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త**

స్థానిక కాకిపిచ్చుక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక బోధన కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ ప్రవీణ్ కుమార్ చిన్నారులకు మహాభారతంలోని మహావీరుడు అర్జునుడు జీవితం, పరక్రమం గురించి వివరించారు. అర్జునుడు పాండవుల్లో మూడవ వాడిగా, అత్యుత్తమ విలువిద్య నిపుణుడిగా, ధర్మనిష్టతో నిలిచిన యోధుడిగా భారతీయ పురాణాల్లో స్థానం సంపాదించాడని ఆయన చెప్పారు. చిన్నప్పటి నుంచే గురుభక్తి, కర్తవ్య పరత్వం, ఏకాగ్రత అర్జునుడిని అగ్రస్థానానికి చేర్చాయని ప్రవీణ్ కుమార్ చిన్నారులకు తెలియజేశారు. అశ్వత్థాముడు, కర్ణుడు వంటి మహాయోధులు ఉన్న కాలంలో కూడా అర్జునుడు తన శౌర్యంతో ప్రత్యేకతను చాటుకున్నాడని, ద్రోణాచార్యులు అతడిని అర్జునోత్తమ శిష్యుడుగా ప్రశంసించారని గుర్తు చేశారు. ధర్మసంకట సమయంలో శ్రీకృష్ణుడు ఇచ్చిన గీతోపదేశం అర్జునుని మాత్రమే కాకుండా మానవజాతికే మార్గదర్శకమైందని, గీతలోని బోధనలు జీవితానికి శాశ్వత ఆదర్శాలని వివరించారు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు ప్రదర్శించిన ధనుర్విద్య, గాండీవం నుంచి విడిచిన బాణాలు యుద్ధానికి కీలక మలుపులు ఇచ్చాయని ఆయన తెలిపారు. యోధుడిగా మాత్రమే కాకుండా స్నేహం, కుటుంబం, ధర్మానికి ప్రాధాన్యత ఇచ్చే సద్గుణాలవాడిగాను అర్జునుడు నిలిచాడని చెప్పారు. అర్జునుడి జీవితం మనకు కట్టుబాటు, శ్రమ, ధైర్యం, గురువుల పట్ల గౌరవం, ధర్మనిష్ట వంటి విలువలను నేర్పుతుందని పిల్లలకు వివరించారు.

## కార్తీక వన మహోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్న ఆర్యవైశ్యులు




**పామూరు, నవంబర్ 16, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని అనుమనగిరి పీఠం వద్ద శ్రీశ్రీశ్రీ శివరామ బ్రహ్మేంద్ర స్వామి(సజీవ సమాధి) పీఠం వద్ద పామూరు పట్టణ ఆర్యవైశ్య సోదర సోదరీమణులు కార్తీక వన భోజన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకలలో భాగంగా ఆర్యవైశ్య సోదర సోదరీమణులు కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక నాటికలు, పాట కచ్చేరీలు, డాన్సులతో, చిన్నలు పెద్దలు, పిల్లలతో ఆనందంగా గడిపారు.

## రోడ్డును ఆక్రమించిన చిల్లచెట్లు.. పొంచి ఉన్న ప్రమాదం

### - నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్అండ్బి అధికారులు



**పామూరు, నవంబర్ 16, ప్రభాతవార్త**

పామూరు మండలం కొత్తపల్లి వద్ద సగం రోడ్డుకి చిల్లచెట్లు ఆక్రమించాయి. అటు నుంచి, ఇటు నుంచి వచ్చే వాహనదారులకు..వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా ఆర్అండ్బి అధికారులు స్పందించి చిల్లచెట్లను తొలగించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ధీరజ్ కోట్ల కథా పురస్కారం విజేతలు ఎంపిక




**అద్దంకి, నవంబర్ 16, ప్రభాతవార్త**

ధీరజ్ కోట్ల కథా పురస్కారం 2025 సంవత్సరానికిగాను 105 పుస్తకాలు వచ్చాయి. వీటిలో ప్రథమ బహుమతి కోసం ఎం.బి.ఎస్ ప్రసాద్ రచించిన వశీకరణం కథా సంపుటిని ఎంపిక చేశారు. వీరికి 10,000 రూపాయల నగదు బహుమతి ఇవ్వనున్నారు. 1,116 రూపాయల ద్వితీయ బహుమతుల కోసం నల్లరేగడి నేలల్లో (పాలగిరి విశ్వప్రసాద్), వంకజం వదినలు(స్వరాజ్య పద్మజ కుందుర్తి), గారడీవాడు (మనసురేష్ పిళ్లె),అలీబాబా అరడజను దొంగలు(దేశరాజు) ,మోసం ఎరుపు(బి.మురళీధర్)వేల్పేరు చంద్రశేఖర్ కథలు(వేల్పేరు చంద్రశేఖర్),నాతి చరామి(గొర్ల శ్రీనివాస్)కథా సంపుటులను ఎంపిక చేయడమైనది. ముప్పై సంవత్సరాలుగా సాహిత్య సేవ చేస్తున్న టీవీఎస్ కృష్ణమూర్తి 3000 రూపాయల నగదు బహుమతితో కూడిన విశిష్ట పురస్కారం కోసం ఎంపిక చేయడం జరిగింది. వీటితో పాటు 1,116 రూపాయల ప్రత్యేక పురస్కారాల క్రింద యువ రచయిత పురస్కారానికి దొండపాటి కృష్ణ (రాతి గుండెల్లో నీళ్లు), బాల సాహిత్య పురస్కారానికి వాసంకి నూచెర్ల (తింగరి కథలు), ఉత్తమ పురస్కారానికి కేతు వచ్చమ్మ ( అమ్మ మనసు ) లను ఎంపిక చేశారు. ఈ పోటీ కోసం తమ కథా సంపుటులను పంపిన నూరు మందికి పైగా ఉన్న రచయితలకు వారి పుస్తకాల ధనను చెల్లించి సభా పూర్వకంగా గౌరవించడమే కాకుండా అన్ని పుస్తకాల మీద సమీక్షలను పుస్తకరూపంలో విడుదల చేయడం జరుగుతుందని పుట్టంరాజు ప్రకటించారు. పురస్కార విజేతల ఎంపిక ప్రముఖ సాహితీ విశ్లేషకులు, పురస్కారాల ప్రదాత యస్. రవీశ్వర్ రెడ్డి నిర్వహించారు. పుట్టంరాజు బుల్లెయ్య,రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ అద్దంకి వారి ఆధ్వర్యంలో అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రం ధీరజ్ కోట్ల పురస్కారాల సభ జరుగుతుందని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఒక ప్రకటనలో వెల్లడించారు.

## పురిమెట్లలో ఇరువురు వ్యక్తులపై దాడి

### - ఒకరికి రక్త గాయాలు - కేసు నమోదు

**ముండ్లమూరు , నవంబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని పూరిమెట్ల గ్రామంలో గురువారం రాత్రి ఇరువురు వ్యక్తులపై దాడి సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుమ్మా గోపి, గుమ్మా సురేష్లపై వారి మేనమామ కుమారుడు తానికొండ కిషోర్ కర్రతో దాడి చేశారు. ఈ సంఘటనలో గోపి తలకు రక్త గాయం కాగా, సురేష్కు కాలిపై దెబ్బ తగిలింది. వీరు దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం అర్ధరాత్రి చేరారు. వీరికి వైద్యులు వైద్యసేవలను అందించారు. దర్శి పోలీసులు క్షతగాత్రులనుండి రిపోర్టును స్వీకరించి, దాడి జరిగిన వివరాలను నమోదు చేసుకొని ముండ్లమూరు పోలీసులకు అటు వైద్యుల నుండి సేకరించిన సమాచారాన్ని పంపారు. దీనిపై ముండ్లమూరు ఎస్.ఐ.కె.నాగరాజు తానికొండ కిషోర్పై కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నారు. ఇది ఇలావుండగా ఈ సంఘటనకు ముందు తానికొండ కిషోర్ పూరిమెట్ల గ్రామంలో వారి నాయనమ్మ తానికొండ అదెమ్మను ఆమె నివాసం వుంటున్న ఇంటిలో నుండి బయటకు గెంటివేయడం, వస్తువులను నష్ట కలిగించడం లాంటి సంఘటనలకు పాల్పడగా, ముండ్లమూరు పోలీసులకు బాధితురాలు సమాచారాన్ని స్టేషన్కు వెళ్లి తెలియజేసింది. ఈసంఘటనలో గోపి,కిషోర్లు వాళ్లఅమ్మమ్మకు సహకారంగా స్టేషన్కు వెళ్లారని, పోలీసులు కిషోర్ను మందలించారని, ఈ కక్షతో కిషోర్ గోపి, సురేష్లపై దాడిచేసినట్లు గోపి,సురేష్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సృజన సాహిత్య సమావేశం

**అద్దంకి, నవంబర్ 16, ప్రభాతవార్త**

స్థానిక గ్రంథాలయ భవనం, బంగ్లా రోడ్డులో సోమవారం ఉదయం9: 30 గంటలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సృజన సాహితీ సంస్థ వారి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం కార్యక్రమం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

## తూర్పు కొప్పెరపాడులో గోకులం షెడ్లు, వడ్డెర కమ్యూనిటీ హాల్

### - ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్




**జె. పంగులూరు, నవంబర్ 16, ప్రభతవార్త**

ప్రజా సంక్షేమ పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, సి ఎస్ ఆర్ దాతల ఆర్థికసాయంతో త్వరితగతిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం సాధ్యమైందని విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటిరవికుమార్ అన్నారు. మండలంలోని టి.కొప్పెరపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల వ్యయంతో పశువుల షెడ్ ను, బీ.సీ కాలనీలో ఏ.పి.ఎస్. పి. పి. ఎల్. ( సి ఎస్ ఆర్ ఫ్రెండ్స్) 20 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రజల సామాజిక అవసరాలకుఅనుగుణంగా రూపొందించిన ఈ కమ్యూనిటీ హాలు స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పశువర్ధక రంగంలో రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పి.ఫోర్ పిలుపులో భాగస్వామ్యం అవుతుందా దాతలకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో రూ 6.90 కోట్లతో 20 కమ్యూనిటీ హాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, దేశంలో ఈ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా పింఛనులపై ఏపీ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, ఇటీవలే లక్ష పైగా పింఛన్లు కూటమి ప్రభుత్వ మంజూరు చేసింది అన్నారు. కల్పనలతో రాబోయే రోజులలో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు రానున్నాయని వాటికి అనుగుణంగా పారిశ్రమకవేత్తలతో సి.ఎ నారా చంద్రబాబు నాయుడు నింపిన విశ్వాసంతోనే రాష్ట్రానికి అనేక పెట్టుబడులతో పరిశ్రమల నిర్మాణ నిర్మాణాలతో నిరుద్యోగ యువతి,యువతకు భవిష్యత్తులో మన రాష్ట్రంలోనే ఉద్యోగ కల్పన మన కూటమి ప్రభుత్వంలోనే అవకాశాలు పొందుతారు అన్నారు. యువతి, యువకులకు ఉద్యోగ కల్పన లక్ష్యంగా వైజాగ్ లో పారిశ్రామకవేత్తలతో సమావేశం జరిగిందన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, లబ్ధిదారులకు సంబంధించిన నిధులు ఆలస్యం లేకుండా వ్యక్తిగతిన చెల్లించేటట్టు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావు రమేష్, మాజీ జెడ్పిటిసి సభ్యులు కేవీ సుబ్బారావు, సర్పంచ్ ఎనికపాటి కళ్యాణి శ్రీనివాసరావు, స్థలదాత మాజీ సర్పంచ్ పెంట్యాల సుబ్బారావు, బోరెడ్డి ఓబుల్ రెడ్డి, చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, సింగరయ్య, జి ఆదిరెడ్డి, గుర్రం ఆదిశేకర్, పలు గ్రామాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### టీ కొట్టు వద్దే సమస్యల పరిష్కారం...

రామకూరు వద్ద ప్రజలతో కలసి టీ తాగిన మంత్రి గొట్టిపాటి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తీసుకొచ్చిన గ్రీవెన్స్‌లోని సమస్యలను వెంటనే పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నేతలు, కార్యకర్తలు వున్నారు.

## మంత్రిని కలిసిన కొరిశపాడు మండల టిడిపి కమిటీ



**కొరిశపాడు , నవంబరు 16, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో టిడిపి మండల కమిటీలు ఏర్పాటు అయి ప్రమాణ స్వీకార కార్యక్రమాలు కూడా పూర్తి అయ్యాయి. కొరిసపాడు మండల టిడిపి అధ్యక్షత బాధ్యతలు స్వీకరించిన చింబోతుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మోపర్తి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గండే ఎజె స్కేలు ఆదివారం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ను ఆయన నివాసంలో కలిశారు. తమను మండల పార్టీ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినందుకు సహకరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలియ చేస్తూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల టిడిపి నాయకులు చెన్నుపాటి హరిబాబు, నాదెండ్ల కోటేశ్వరరావు, చింతం సుబ్బారావు, మందా నాగేశ్వరరావు, రావూరి సుందర బాబు, కొట్టే రవీంద్ర, శానం చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించి, నివాళులర్పించిన మంత్రి గొట్టిపాటి




**జె.పంగులూరు, నవంబర్ 16, ప్రభతవార్త**

మండలంలోని రామకూరు గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో మరణించిన మహమ్మద్ వలి కుటుంబాన్ని ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. మహమ్మద్ వలి చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు. అదే గ్రామంలో మస్తాన్‌రావు కాలికి శస్త్రచికిత్స చేయుంచుకోగ, వారి నివాసానికి వెళ్ళి ఆయనను కూడ మంత్రి పరామర్శించారు. విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డ డి.శ్రీను కుమారుడు అభిరామ్‌ను మంత్రి పరామర్శించారు. ఆయన వెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావు రమేష్ బాబు, నాయకులు మానవ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు,బోరెడ్డి ఓబుల్ రెడ్డి, చింతల సహదేవుడు, గుడిబండ్ల ఆది రెడ్డి, జాగర్లమూడి శ్రీను పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ నియంతృత్వాన్ని ఎండగట్టిన గ్రంథాలయ ఉద్యమం

### - డిప్యూటీ డీఈవో.. గంగాధర్.



**అద్దంకి, నవంబర్ 16, ప్రభతవార్త**

అద్దంకిలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అదివారం మూడవరోజు అద్దంకి గ్రంధాలయశాఖలో జరిగింది. ఈ కార్యక్రమానికిగ్రంథాలయ వారోత్సవాల ప్రోగ్రాం ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ధర్మవరపు గంగాధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ నియంత పోకడలను పాలనను గ్రంథాలయ ఉద్యమం ద్వారా ప్రజల్లో చైతన్య నింపి బ్రిటిష్ నియంత పాలనను ఎండగట్టిన గ్రంథాలయస్ఫూర్తి దేశ చరిత్రలో అందరికీ ఆదర్శమని గంగాధర్ అన్నారు. రిటైర్డ్ ఆర్జెడి డాక్టర్ ఉబ్బ దేవపాలన, అద్దంకిశాఖ గ్రంథ పాలకురాలు సిఎల్‌వి వసుంధర దేవి,కాటూరి నరసయ్య,పిసిహెచ్ కోటయ్య,లక్కరాజు శ్రీనివాసరావు, మల్లాది శ్రీనివాసరావు, దివాకర్ దత్తు,ఎస్కె రఫీ, సుబ్రహ్మణ్యం, శశిధర్, ఆంటోనీ, రమేష్,సాహితీ సాంస్కృతిక సంస్థల సభ్యులు,కార్ స్టాండ్ యజమానులు,సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు.

## ప్రసన్నాంజనేయస్వామికి కేజిన్నర వెండి కిరీటం బహుకరణ




**అద్దంకి , నవంబర్ 16, ప్రభతవార్త**

బాపట్ల జిల్లా అద్దంకి మండలం శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి వెండి కిరీటము బహుకరించినారు. 1కెజి 480 గ్రాముల ఈ వెండి కిరీటము 2,80,000 విలువ కలిగినది. చిలకలూరిపేట మండలం ఇ టి సెంటర్ వాస్తవ్యులు దేరంగుల వెంకటేశ్వర్లు, ధర్మపత్ని అంజమ్మ, వారి కుమారులు రామాంజనేయులు, చిరంజీవి ,మనవడు వీరాంజనేయులు, దేవస్థాన పాలక అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకర్ రావుకి ఆలయంలో అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి పూజ, వేద పండితులు సన్మానించి, స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యుడు బత్తుల చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో

## మాలధారణ స్వాములకు దారపనేని అన్న ప్రసాద వితరణ




**పామూరు, నవంబర్ 16, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం కనిగిరి మాజీ ఏఎంసీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పద్మ, తేజ కృష్ణ, చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులు,దారపనేని తోడల్లుడు మేలూరి విజయ్ చంద్రబాబు, సావిత్రి, కుమార్తె వెంకటకీర్తి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు, వెంకటేశ్వర స్వాములకు, ఆంజనేయ స్వాములకు దేవస్థానం గౌరవ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డితో కలిసి దారపనేని అన్న ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిమట పట్టాభి స్వామి, గోరుగంతుల సిద్దుస్వామి వేద మంత్రాలతో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాపనేని చంద్రశేఖర్‌కు స్వామివారి పూలమాల, చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఛైర్మన్లు గుత్తి వెంకటరాజ, కావిటి వెంకట సుబ్బయ్య, మాట్లాడుతూ శాశ్వత అన్నదాన కార్యక్రమానికి దాతల సహకారానికి దారపనేని చంద్రశేఖర్ ఎనలేని కృషి చేసి ప్రతి సంవత్సరం 60 రోజులు అన్నదానం చేయుటకు తోడ్పాటును దారపనేని అందించారని,ఆ కృత నిశ్చయంతో మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ దారపనేని సుబ్బారావు, తిరవీధి హజరత్, ఒగూరి నరసింహారావు, కంబాల రోశయ్య స్వామి, వాయునేని వైట్ మాల్యాద్రిస్వామి, యడవల్లి వెంకటరెడ్డి, జాజం హరికృష్ణ, మాలధారణ స్వాములు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా "సనాతన ధర్మక్షయము కలిధర్మమయము"పుస్తకావిష్కరణ



**ఒంగోలు - ప్రభాతవార్త**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ మేనేజర్ అచ్యుతుని శ్రీనివాసరావు రచించిన సనాతన ధర్మక్షయము !!కలి ధర్మమయము పుస్తక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ సభ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ సమకాలీన సమాజానికి ఇటువంటి రచనలు అవసరమన్నారు. మతాల మధ్య సమన్వయాన్ని రచయిత చక్కగా ప్రతిబింబించారని చెప్పారు. పరిశోధనాత్మక స్థాయిలో వ్రాసిన ఈ రచనను ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ తుమ్మల రాంభూపాల్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ... ఆదర్శవంతమైన జీవితానికి మతాలు ఎంతగానో తోడ్పాటు నిచ్చాయన్నారు. అన్ని మతాలు మంచినే ప్రబోధించాయని వాటి మార్గంలో మనందరం నడవాలని రచయిత సూచించడం గొప్ప విషయం గా పేర్కొన్నారు. గ్రంథాలయ ఇంచార్జ్ కాళహస్తి సంపూర్ణ వారోత్సవాల సందర్భంగా తాము చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రఖ్యాత విశ్లేషకులు డా.బీరం సుందరరావు పుస్తక సమీక్ష చేశారు. ఆయన తన ప్రసంగంలో రచయిత వైవిధ్యమైన సంక్లిష్టమైన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఇలాంటి రచనలు విశ్వవిద్యాలయ విద్యార్థులకు పరిశోధనాత్మకంగా ఉపయోగపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఒంగోలు 35 వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య, కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వారు తమ మాటల్లో సనాతన ధర్మము కాలానుగుణంగా మారుతూ వస్తుందని చెప్పారు. రచయిత ఆ విషయాన్ని చక్కగా తెలియజేశారు అన్నారు. కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి సభాహ్వానంతో కార్యక్రమం ప్రారంభమైంది. పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు మాగంటి శ్రీరామమూర్తి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రాప్రసాద్‌బాబు, స్వాతంత్ర సమరయోధుని కుమారుడు పర్వతం రాంప్రసాద్, ఆధ్యాత్మికవేత్త నెమ్మాని సీతారామమూర్తి , డాక్టర్ విద్యా శంకర్, డా.రోహిణి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నరసం జిల్లా కోశాధికారి బీరం అరుణ వందన సమర్పణ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రముఖులైన యు.వి.రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీ దుర్గ, డాక్టర్ మున్నంగి రాజకుమారి, డాక్టర్ చింతపల్లి ఉదయ జానకి లక్ష్మి, ఆదూరి మనోహర, రామచంద్రుని లక్ష్మి, పరాంకుశం కృష్ణవేణి, మైనంపాటి సాయికుమార్, ధర్నాసి చిరంజీవి, బీరం అరుణ, గంధవళ్ళ పద్మజ, కందుల మధు, బండారు సునీత, నాటూరు లక్ష్మీ నాంచారమ్మ, డాక్టర్ మాగంటి శ్రీనివాసమూర్తి తదితర కవులు కవయిత్రులు సత్కారాలు స్వీకరించారు. ఇంకా ఈ సభలో శ్రీమతి యం సూర్య కుమారి కె.బాలకోటయ్య,ధేనువకొండ సుబ్బారావు, నెమ్మాని హరిప్రియ,శ్రీరామకవచం సాగర్, ఒరుగంటి ప్రసాద్,జ్వాలా ఉమామహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది పోకల రామారావు పుట్టినరోజు పేదలకు అన్నదానం



**ఒంగోలు - ప్రభాతవార్త**

సీనియర్ న్యాయవాది పోకల వెంకటరామారావు జన్మదినోత్సవం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ మంచి మనసు దాతృత్వం కలిగిన పోకల రామారావు పుట్టినరోజు సందర్భంగా పేదలకు వృద్ధులకు పండ్లు కాయలు పంపిణీ చేయడం శివం శరణాలయంలో వృద్ధులకు మూడు పూటలా పౌష్టిక ఆహారంతో భోజనం ఏర్పాటు చేయడం శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలో అనాథలకు యాచకులకు 300 మందికి పైగా అన్నదానం చేయడం మానవత్వంతో కూడిన మంచి సేవా కార్యక్రమం అని తెలిపారు. వారికి శివం ఫౌండేషన్ తరపున జన్మదినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. శివం ఫౌండేషన్ ఛైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ ధనవంతులు మీ కుటుంబాలలో ముఖ్యమైన రోజుల్లో పేదలకు ఆర్థికంగాఅండగా ఉండాలని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో ప్రవీణ్ మరియు శివం శరణాలయంలోని వృద్ధులు పాల్గొని పోకల రామారావు కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు .

## నిస్పక్షపాత జర్నలిజం సమాజంలో సజీవం - రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్

### - జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు ఓర్సు కొండలుకు ఘనంగా సన్మానం



**సంతమాగులూరు ,నవంబర్ 16, ప్రభాతవార్త**

నిస్పక్షపాత జర్నలిజం సమాజంలో సజీవంగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం లోని గొట్టిపాటి అతిధి గృహంలో సంతమాగులూరు మండలంలో సీనియర్ పాత్రికేయుడు ప్రజాశక్తి విలేకరి ఓర్సు కొండలును ఘనంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పత్రికలు, పాత్రికేయులు నిస్పక్షపాతంగా నిజాలను సమాజానికి అందించాలన్నారు. పాత్రికేయులు పత్రికా విలువలకు కట్టుబడి పనిచేయాలన్నారు. నిస్పక్షపాత జర్నలిజం సమాజంలో సజీవంగా నిలుస్తుందని అన్నారు. ఒక నాడు చిన్న పత్రికగా అరంభించిన ఈనాడు దేశ విదేశాల్లో ప్రముఖ పత్రికగా తీసుకు వెళ్లి ప్రజాదరణ చూరగొన్న ఈనాడు రామోజీ రావు అందుకు నిదర్శనంగా నిలుస్తారన్నారు. పత్రికలు ప్రజల పక్షాన నిలవాలన్నారు అక్రమాలను , అవినీతిని ఎత్తి చూడంలో తప్పులేదన్నారు. అదే విధంగా అభివృద్ధిని కూడా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. దురదృష్ట వశాత్తు కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకుని పనిచేయడం బాధాకరమన్నారు. అయితే విశ్వసనీయతలేని వార్తలకు ప్రజల ఆదరణ ఉండబోదని రవికుమార్ పేర్కొన్నారు. సమాజంలో జర్నలిజం సజీవంగా ఉన్నప్పుడే సామాన్యుడు సైతం స్వేచ్ఛగా జీవించగలుగుతాడని రవికుమార్ అన్నారు. ఈకార్యక్రమంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ తెలప్రోలు రమేష్,సంతమాగులూరు మండల టీడీపీ అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి,సంతమాగులూరు మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు సన్నెబోయిన గురుబ్రహ్మం, మాదాల సుబ్బారావు, కొణికి శ్రీనివాసరావు,సీనియర్ జర్నలిస్ట్ బలుపునూరి కృష్ణారెడ్డి, సంతమాగులూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు,ట్రెజరర్ మొగిలి సుబ్బారావు,కార్యదర్శి షేక్ కలేషావలి, సహాయకార్యదర్శి షేక్ నాగూర్‌వలి,పోలెబోయిన బాలాంజనేయులు , బలుపునూరి వెంగళరెడ్డి, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

17-11Pg5 9_17-11Pg5.qxd 16/Nov/25 9:49 PM Page 1



# లాలూ ఇంట్లో 'రాజకీయ'చిచ్చు



### కుటుంబ సభ్యుల మధ్య కీచులాట
### కన్నీళ్లతో బయటకొచ్చిన కుమార్తెలు
### ఆడబిడ్డల కన్నీళ్లు ఎవరికీ మంచిది కాదు: రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్
### చెల్లెళ్ల జోలికొస్తే ఖబడ్దార్: తేజ్‌ప్రతాప్
### తేజస్విపై రోహిణి తీవ్ర ఆరోపణలు

**పాట్నా, నవంబరు 16:** బీహార్ ఎన్నికల ఫలితాలు లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో చిచ్చురేపాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ పార్టీ ఆర్‌జెడి కేవలం 25స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాలు కేవలం పార్టీపైనే కాదు, లాలూ కుటుంబంపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. లాలూ పెద్ద కుమారుడు తేజ్‌ప్రతాప్ ఇప్పటికే ఇంటి నుంచి, ఆర్‌జెడి నుంచి బయటకెళ్లిపోగా, తాజాగా అతని కుమార్తెలు నలుగురూ ఇంటి నుంచి వెళ్లిపో యారు. లాలూ ఇంట్లో ఏదో జరుగుతోంది బీహార్ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా జరు గుతోంది. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన కుటుంబసభ్యుల మధ్య కీచులాటలేంటి?, ఇంటి నుంచి కూతుళ్లను కొడుకు తేజస్వి వెళ్లగొడు తుంటే తల్లిదండ్రులుగా లాలూ, రబ్రీదేవి ఏం చేస్తున్నారు? అంటూ ప్రశ్నలు లేవనెత్తుతు న్నారు. ఇక లాలూ ఇంట్లో కీచులాటలకు సంబంధించి కూతురు రోహిణి ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. కుటుంబం నుంచి బంధాలు తెంచుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియాలో ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, గత కొన్నేళ్ల నుంచి లాలూ కొడుకు తేజస్వి యాదవ్‌కు, రోహిణి ఆచార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవి తారాస్థాయికి చేరాయి. కాగా, ఆదివారం వరుస సంచలన పోస్టులు పెట్టింది. సోదరుడు తేజస్విపై తీవ్ర ఆరోపణలు గుప్పించింది. అలాగే, తండ్రికి కిడ్నీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించింది. ఆ పోస్టుల్లో "నిన్న ఓ కూతుర్ని, ఓ సోదరిని, ఓ వివాహితను, ఓ తల్లిని దారు ణంగా అవమానించారు. చెప్పుతో కొట్టడానికి కూడా ప్రయత్నించారు. ఆత్మ గౌరవం విషయంలో నేను వెనక్కు తగ్గను. ఏడుస్తున్న తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లను వదిలి ఇంటి బయటకు రావాల్సి వచ్చింది. నన్ను ఓ అనాథలా మార్చేశారు.

నాపై అమానుషమైన కామెంట్లు చేశారు. డబ్బుల కోసం, టికెట్ కోసం మా నాన్నకు కిడ్నీ ఇచ్చానని అవమానించారు. ప్రతీ వివాహితకు నేను ఒకటే చెబుతున్నా మీ పుట్టింట్లో అన్నయ్య, తమ్ముడు ఉంటే ఏ పరిస్థితుల్లోనూ మీ తండ్రిని కాపాడేందుకు ముందుకు రాకండి. మీ సోదరులనే కిడ్నీ ఇవ్వమని చెప్పండి. మీరు ఎవరూ నా లాంటి తప్పు చేయకండి. ఏ ఇంట్లోనూ రోహిణి లాంటి కుమార్తె, చెల్లెలు పుట్టకూడదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇది మంచిది కాదు: రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్:** రోహిణి నా మేనకోడలు ఆమె కన్నీళ్లతో ఇంటి నుంచి బయటకు రావడం తన మనస్సు కలిచివేసింది. ఏఇంటి ఆడబిడ్డ అయినా కన్నీళ్లలో బయటకెళ్లకూడదు. అది ఎవరికీ మంచికాదు అని రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్ పేర్కొన్నారు. 'రబ్రీదేవి నా సోదరి, నేను కూడా చాలా బాధలు పడ్డాను, కానీ నా సొంత సోదరికి వ్యతిరేకంగా నేనెప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రోహిణి ఆచార్య నా మేనకోడలు. ఎవరైనా ఆమెతో అలా ప్రవర్తించి ఉంటే, అది ఎప్పుడూ జరగకూడదు, అది తప్పు' అని సాధు యాదవ్ అన్నారు. ఎవరినీ ప్రత్యే కంగా వేలెత్తి చూపలేకపోయినా, పరిస్థితి పూర్తిగా ఆలోచించాల్సి న అవసరం ఉందన్నారు.

రబ్రీదేవి మరో సోదరుడు సుభాష్ యాదవ్ కూడా ఈ సంఘటనను ఖండించారు. 'ప్రస్తుతం జరుగుతున్నదంతా ఆర్‌జెడి ఓటమి వల్లే జరిగింది. నెల రోజుల క్రితం వారు సిఎం అవుతున్నారు. నేడు పార్టీని నడపడానికి సమర్థవంతమైన నేత కూడా లేదు. బీహార్ ఏమి కోరుకుంటున్నదో వారికి అర్థం కాలేదు. రోహిణి విషయానికొస్తే, ఆమెకు అలా జరగకూడదు' అని సుభాష్ యాదవ్ పేర్కొన్నారు.

**నా చెల్లెల్ని అవమానిస్తే సహించను:** తన చెల్లెలు రోహిణి ఆచార్యకు బాసటగా ఉంటానని, ఆమెను అవమానిస్తే సహించేది లేదని పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ హెచ్చరించారు. తన సోదరికి జరిగిన అవమానం సహించరానిదని అన్నారు. తనకు అన్యాయం జరిగితే భరించానని, అయితే తన చెల్లెల్ని అవమానిస్తే మాత్రం మౌనంగా చూస్తూ ఉండేది లేదని హెచ్చరించారు. తన సోదరిని చెప్పుతో కొట్టారనే విషయం తెలిసి తన గుండె రగిలిపోయిందన్నారు. నేరుగా ఎవరి పేరునూ ఆయన ప్రస్తావించకుండా తన కుటుంబంపై దాడి చేసిన వంచకులను బీహార్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. ఈ విషయంలో తన తండ్రి లాలూ ప్రసాద్ జోక్యం చేసుకోవాలని తేజ్‌ప్రతాప్ కోరారు. 'మీరు (లాలూ)ఒక్క సైగచేయండి చాలు. ఈ జయచందలను బీహార్ ప్రజలు పూడ్చిపెడతారు' అని తేజ్ ప్రతాప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదేమీ రాజకీయ పోరాటంకాదని, ఇది ఒక కుటుంబ గౌరవం, ఒక ఆడకూతురు గౌరవం, బీహార్ ఆత్మాభిమానంపై జరుగుతున్నపోరాట మని అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.



# మెక్సికోలో జెన్‌జెడ్ ఉద్యమం

## వేలాది యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు

## ఘర్షణల్లో 100మంది పోలీసులకు గాయాలు

**మెక్సికోసిటీ, నవంబరు 16:** జెన్ జెడ్ ఉద్యమం ప్రపంచ దేశాలకు ఎగబాకుతోంది. నేపాల్‌లో ప్రభుత్వాన్నే కూల్చివేసిన ఈ జెన్‌జడ్ ఉద్యమం ఇపుడు ఉత్తర అమెరికాను తాకింది. మెక్సికోలో వేలాది మంది యువత రోడ్లపైకి వచ్చిన నిసనలు చేశారు. దేశ అధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే అధ్యక్ష భవనమైన నేషనల్ ప్యాలెస్‌లోకి దూసుకెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. దీంతో పోలీసులు నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మెక్సికో సిటీలో జెన్ జెడ్ యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నేషనల్ ప్యాలెస్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను ముసుగులు ధరించిన కొందరు నిరసనకారులు కూల్చేశారు. హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధ్యక్ష భవనంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులపైకి టియర్ గ్యాస్ ప్రయోగించారు. కాగా, ఈ ఘర్షణల్లో 100 మంది పోలీసులకు గాయాలయ్యాయని సిటీ సిటిజెన్ సేఫ్టీ సెక్రటరీ పాబ్లో వాజ్‌క్వెజ్ చెప్పారు. మరో 20 మంది యువత కూడా గాయపడ్డాని తెలిపారు. ఇప్పటికే 20 మంది నిరసనకారులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మెక్సికోలో జెన్ జెడ్ ఎందుకు నిరసలు చేస్తున్నారు ఈనెల ఒకటవ తేదీ మెక్సికో పశ్చిమ రాష్ట్రమైన మికోకాన్‌లోని ఉరుపాన్ నగర మేయర్ కార్లోస్ మంజో దారుణ హత్యకు గురయ్యాడు. నేరాలకు వ్యతిరేకంగా ఈయన పోరాడేవాడు. 'డే ఆఫ్ ది డెడ్' అనే ఓ బహిరంగ కార్యక్రమంలో కార్లోస్‌ను దుండగులు కాల్చి చంపారు. ఈ దారుణ హత్య దేశవ్యాప్తంగా యువతలో తీవ్ర ఆగ్రహావేశాల్ని రేపింది. ప్రభుత్వాలు హింసను అరికట్టడంలో విఫలమయ్యాయి అంటూ నిరసనలకు దిగారు యువత. మెక్సికో సిటీతో పాటు పలు నగరాల్లో వేలాది మంది యువత ప్రదర్శనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో అధ్యక్ష భవనం ముట్టడికి ప్రయత్నించారు. షీన్‌బామ్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో ఆమెకు 70 శాతానికి పైగా అప్రూవల్ రేటింగ్ ఉంది. అయితే, దేశంలో హింసను అరికట్టడంలో విఫలమవుతున్నారని తరచుగా తీవ్ర విమర్శలకు గురవుతున్నారు.

# పేలుడు కోసం 'మదర్ ఆఫ్ సైతాన్'



## సున్నితమైన ఒత్తిడికే పేలిపోయే రసాయనం

**న్యూఢిల్లీ, నవంబరు 16:** దేశ రాజధాని ఢిల్లీలో గతవారం సంభవించిన పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. విచారణలో సంచలన వాస్తవాలు బయటపడుతున్నాయి. తాజాగా, ఈ పేలుడుకు ట్రైఎసిటోన్ ట్రై పెరోక్సైడ్ అనే రసాయనాన్ని ఉయోగించినట్టు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. 'మదర్ ఆఫ్ సైతాన్ 'గా గుర్తింపు పొందిన ఈ రసాయనం డెటోనేటర్ లేకుండానే వేడి కారణంగా పేలిపోయే గుణం కలిగి ఉంటుందని నిపుణులు తెలిపారు. ఢిల్లీ పేలుడుకు ఇదే కారణమైందా అనేది ఫోరెన్సిక్ నిపుణులు ప్రస్తుతం పరీక్షిస్తున్నారు. ఎర్రకోట వద్ద 20 కారులో పేలుడు సంభవించి 13 మంది చనిపోగా మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఆ కారును నడిపిన డాక్టర్ ఉమర్ మహ్మద్ నబీకి పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోన్న జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. దర్యాప్తు బృందాల ప్రకారం టీఏటీపీ ప్రమాద తీవ్రత గురించి అవగాహన ఉండటంతో నిందితుడు ఉమర్ జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలోకి కారును నడిపించాడు. పేలుడు జరిగిన ప్రదేశంలో పాత ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే చాందినీ చౌక్‌కు కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది. ట్రైఎసిటోన్ ట్రై పెరోక్సైడ్ (టీఏటీపీ) అత్యంత సున్నితమైందని నిపుణులు పేర్కొంటున్నారు. ఘర్షణ, ఒత్తిడి, ఉష్ణోగ్రత పెరగడం వంటి భౌతిక పరిసరాల్లో ఏ చిన్న మార్పైనా పేలుడుకు దారితీస్తుంది. రసాయనికంగా, ఉష్ణస్థితిగతంగా స్థిరంగా ఉండే అమోనియం నైట్రేట్‌కు మాత్రం డెటోనేటర్ అవసరం పడుతుంది, ప్రపంచవ్యాప్తంగా నిషేధిత బాంబుల తయారీకి విస్తృతంగా ఉపయోగించడం వల్ల దీనిని 'మదర్ ఆఫ్ సైతాన్'గా పేర్కొంటారు. 2017 బార్సిలోనా, 2015 పారిస్ దాడులు, 2017 మాంచెస్టర్, 2016 బ్రస్సెల్స్ పేలుళ్లలోనూ ఈ సంయోగ పదార్థం ఆనవాళ్లు లభ్యమయ్యాయి. ఇటువంటి పేలుడు పదార్థాలను తయారు చేసిన వ్యక్తులు ఏదో రూపంలో ఉగ్రవాద శిక్షణ పొందినవారే అని నమ్ముతుంటారు. ఢిల్లీలో సంఘటనా స్థలిలో ధ్వంసమైన తీరును పరిశీలిస్తే టీఏటీపీకు సాధారణంగా కనిపించే లక్షణాలకు అనుగుణంగా ఉన్నాయి. శక్తివంతమైన ప్రకంపనలకు ప్రసిద్ధి చెందిన ఈ రసాయనం ఇలాంటి విధ్వంసాన్ని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఘటనా స్థలిలో నమూనాలను సేకరించిన ఫోరెన్సిక్ బృందాలు టీఏటీపీ ఉపయోగించారా అనేది నిర్ధారించే పనిలో ఉన్నాయి. పేలుడు తీవ్రతను బట్టి చూస్తే కారు లోపల ఉష్ణోగ్రత లేదా అస్థిర వాతావరణం కారణమై ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ ఉగ్రదాడుల కోసం తరలిస్తున్న సమయంలో అది అనుకోకుండా పేలిపోయిందా అనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది. టీఏటీపీ తయారీకి అవసరమైన రసాయనాలను నిందితుడు ఉమర్ ఎలా సంపాదించాడు అనే విషయంపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. ఎందుకంటే దీని తయారికి పలురకాల రసాయనాలు అవసరం అవుతాయి. ఏదైనా విస్తృత నెట్‌వర్క్ నుంచి అతడికి సహాయం లభించిందా లేదా ఈ పేలుడు పదార్థాన్ని సిద్ధం చేయడంలో మరెవరైనా పాల్గొన్నారా అనేది కూడా విచారిస్తున్నారు. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు పేలుడుకు ముందు నిందితుడు ఉమర్ డిజిటల్ కార్యకలాపాలు, ప్రయాణ వివరాలు, కమ్యూనికేషన్ రికార్డులను పరిశీలించి అతని కార్యకలాపాల పూర్తి మ్యాప్ రూపొందిస్తున్నారు.

## పెళ్లికావట్లేదని చిన్నారిని చిదిమేసిన అక్కాచెల్లెళ్లు!



**జైపూర్, నవంబరు 16:** వయసు మీరిపోతున్నా ఇంకా పెళ్లి కావట్లేదని రాజస్థాన్‌లో నలుగురు యువతులు ఆటవిక చర్యకు పాల్పడ్డారు. 17 రోజుల వయసున్న పసికందును క్షుద్ర పూజలకు బలిచ్చారు. ఇలా చేస్తే తమకు పెళ్లి అవుతుందని ఈ దారుణానికి ఒడగట్టారు. చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. జోధ్‌పూర్‌లోని నెహ్రూ నగర్ కాలనీలో నలుగురు యువతులు నివసిస్తు న్నారు. వీరి సోదరికి పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మళ్లీ డెలివరీ అయింది. అయితే ఈ నలుగురికి మాత్రం వయసు మీరిపోతున్నా ఇంకా పెళ్లి కాలేదు. గత కొన్నేళ్ల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ నలుగురు అక్కాచెల్లెళ్లలో అసహనం పెరిగిపోయింది. ఈ క్రమలో తమ సోదరి బాత్రూమ్‌కు వెళ్లిన సమయంలో ఈ నలుగురు బాలుడ్ని తమ రూమ్‌లోకి తీసుకెళ్లారు. అనంతరం పిల్లాడు నోరు నొక్కి, కాళ్లు చేతులు విరిచేసి చంపేశారు.

## సంక్షిప్తంగా..

### పేలుడు స్థలంలో 3 బుల్లెట్లు స్వాధీనం



**న్యూఢిల్లీ,నవంబరు 16:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తు బృందాలు విచారణను వేగవంతం చేశాయి. ఈ కేసులో కీలక ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందాలు మూడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇవి సైనికులు వాడే 9 ఎంఎం కాట్రిడ్జ్‌లు అని వెల్లడించారు. అయితే, ఆ ప్రదేశంలో ఎలాంటి తుపాకీ లభ్యం కాలేదని స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు, భద్రతా సిబ్బందికి అందించిన బుల్లెట్లను పరిశీలించామని, స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు వారికి సంబంధించినవి కావని పోలీసులు ధ్రువీకరించారు. దీంతో భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

### పాక్ ప్రధానిపై మాజీ క్రికెటర్ సెటైర్లు..



**ముంబయి, నవంబరు 16:** భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తన దైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శ్రీలంకపై వన్డే సిరీస్ గెలిచినందుకు పాక్ జట్టును అభినందిస్తూ షరీఫ్ చేసిన ట్వీట్‌పై చోప్రా ఘాటుగా స్పందించారు. ఒక ద్వైపాక్షిక సిరీస్ విజయాన్నే గొప్పగా చెప్పుకుంటున్నారంటూ ఆయన ఎద్దేవా చేశారు. రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ 2-0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా స్పం దిస్తూ జట్టును, పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీని అభినందించారు.

ఇస్లామాబాద్‌లో పేలుడు ఘటన జరిగినప్పటికీ సిరీస్‌లో పాల్గొన్నందుకు శ్రీలంక ఆటగాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అయితే, షరీఫ్ చేసిన ఈ ట్వీట్‌పై ఆకాశ్ చోప్రా స్పందిస్తూ, ఒక ద్వైపాక్షిక సిరీస్ గెలవడం మాత్రమే మీకు గొప్పగా చెప్పుకోవడానికి మిగిలి నప్పుడు ఇలాగే ఉంటుందంటూ సెటైర్ వేశారు.

### భారత్ సంతతి ఎడ్యుటెక్ సిఇఒకు అమెరికాలో అవమానం



**వాషింగ్టన్, నవంబరు 16:** ప్రముఖ ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ మైండ్‌వ్యాలీ వ్యవస్థాపకుడు, సీఈఓ విషెన్ లఖియానీకి అమెరికాలో చేదు అనుభవం ఎదురైంది. భారత సంతతికి చెందిన ఈ మలేషియన్ వ్యాపారవేత్త, అమెరికాలో పెరుగుతున్న జాత్యహంకారం, విదేశీయుల పట్ల వ్యతిరేకతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అసాధారణ ప్రతిభావంతులకు ఇచ్చే ఓ1 వీసా తన వద్ద ఉన్న ప్పటికీ, యూఎస్ విమానాశ్రయంలో ఎఫ్‌బిఐ అధికారులు తనను అడ్డుకున్నారని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఎంతో ఇష్టపడిన అమెరికాకు రావాలంటేనే ఇప్పుడు భయ మేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గత 22ఏళ్లుగా అమెరికాలో పన్నులు చెల్లి స్తున్నానని, తన కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా 230 మంది ఉద్యోగులు ఉన్నారని గుర్తుచేశారు.

### కొన్ని రకాల ఉత్పత్తులపై సుంకాలు తొలగించిన ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాలు విధించి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో పలు వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్ ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం కూడా ట్రంప్ దిగి రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎట్టకేలకు దిగొచ్చిన ట్రంప్. గొడ్డు మాంసం, కాఫీ, అరటి పండ్లు, నారింజ, పండ్ల రసం లాంటి పలు ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. పలు దేశాలపై భారీగా సుంకాలు విధించినప్పటికీ ఆ ప్రభావం వినియోగదారులపై పడదని ఇంతకాలం ట్రంప్ చెబుతూ వచ్చారు.

# ఉగ్రవాదుల కార్యకలాపాలకు అడ్డాగా 'అల్‌ఫలా'

## పోలీసుల వరుస సోదాలు, అరెస్టులతో వర్సిటీని ఖాళీ చేస్తున్న విద్యార్థులు




**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ కారు బాంబు పేలుడు తరువాత హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్శిటీ పేరు మీడియాలోఒక్కసారిగా పతాక శీర్షికలకు ఎక్కింది. కారు బాంబు పేలుడులో నింది తులుగా వున్న ముగ్గురు వైద్యులు (ఇందులో ఒకరు మహిళ వుంది) ఈ వర్శిటీలో పనిచేస్తున్న వారు కాగా మరో ఇద్దరు వైద్యులు ఈ వర్శిటీతో సంబంధాలుండడంతో పోలీసులు వారం రోజులుగా వరుసగా సోదాలు చేస్తుండడంతో పాటు అనుమానితులను అరెస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి విద్యార్థులు హాస్టళ్లను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

ఈ నెల 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఐఎస్ఐ ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిగా నిర్ధారణ అయిన తరువాత ఇందుకు కారకులైన వైద్యులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్శిటీ ఉద్యోగులని తేలడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. వీరిలో డాక్టర్ ముజమిల్ షకీల్, డాక్టర్ ఉమర్ మహమ్మద్‌లు కాశ్మీర్‌కు చెందిన వారు కాగా మహిళా వైద్యురాలు షహీన్ షహీద్ యుపిలోని లక్నోకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఆత్మాహుతి దాడికి కారకుడైన డాక్టర్ ఉమర్ నబీ కాశ్మీర్‌లోని పుల్వామకు చెందిన వైద్యుడు అయినా ఇతను తన సహచర ఉగ్ర వైద్యులతో సంబంధం కలిగి వున్నట్లు తేలింది. కాగా ఈ యూనివర్శిటీలో పనిచేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్ సమీపంలోని దౌజా గ్రామంలో రెండు గదులను అద్దెకు తీసుకుని అందులో ఐఈడీ బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థం 2950 కిలోలను కొన్ని టైమర్లను, ఇంకొన్ని వస్తువులను ఢిల్లీ, హరియాణా పోలీసులు పట్టుకోవడం తెలిసిందే. వీరంతా పాక్ కేంద్రంగా పనిచేస్తున్న నిషిద్ధ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహమ్మద్‌కు చెందిన వారుగా తేలింది. ఆపరేషన్ సింధూర్ తరువాత జైష్ ఏ మహమ్మద్ భారత్‌లో తమ కార్యకలాపాల విస్తరణ కోసం వీరు వ్యూహాలు రచించినట్లు ఇందులో మహిళలను రంగంలో దించినట్లు పోలీసులు తేల్చారు. ఇందులో జైష్ ఏ మహమ్మద్ సంస్థకు మహి ళా కమాండర్‌గా డాక్టర్ షహీన్ షహీద్ నియమితులైంది. వైట్ కలర్ టెర్రర్ మాడ్యూల్‌లో వైద్యులతో పాటు వైద్య విద్యార్థులను, పారా మిలటరీ సి బ్బందిని ఉగ్రవాదులుగా తయారు చేయడం కోసం జైష్ ఏ మహమ్మద్ నిర్ణీత కాల వ్యవధిని నిర్ణయించుకుని పనిచేస్తున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. ఇందుకు జైష్ ఏ మహమ్మద్ ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా వర్శిటీని అడ్డాగా మార్చుకుందని పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈ క్ర మంలోనే జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ సహా దేశ వ్యాప్తంగా పేలుళ్లకు జైష్ ఏ మహమ్మద్ కుట్రలు పన్నగా వాటిని భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. ఢిల్లీ పేలుడు తరువాత అల్‌ఫలా యూనివర్శిటీలో వారం రోజులుగా పోలీసులు వరుసగా సోదాలు చేస్తున్నారు. దీంతో పాటు పదుల సంఖ్యలో అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. వీరిలో కొందరిని అరెస్టు చేశారు. వీరిచ్చిన సమాచారంతో కాశ్మీర్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాలలో మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అల్‌ఫలా వర్శిటీని విద్యార్థులు ఖాళీ చేస్తున్నారు. వర్శిటీ అధికారులు కూ డా కొన్ని విభాగాలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో ఈ యూనివర్శిటీలో నిశబ్ద వాతావరణం నెలకొంది.



## ఉగ్రవాదంలోకి వైద్యులు రావడంపై లోతుగా దర్యాప్తుచేయాలి

### జమ్ముకాశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్, నవంబరు 16:** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ఒకే రోజు రెండు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయంగా కలకలం రేపారు. హర్యానాలో ఇటీవల పట్టుబడిన వైట్ కాలర్ టెర్రరిస్ట్ మాడ్యూల్‌లో డాక్టర్లు ఉండటంపై ఆయన స్పందిస్తూ, వారు ఆ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారో లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. చదువుకున్న డాక్టర్లు ఈ దారి పట్టడానికి కారణాలేంటి దీని వెనుక ఎవరున్నారు అనే విషయాలపై సమగ్రమైన విచారణ జరిపి, అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అబ్దుల్లా అన్నారు.

# వీధికుక్కలను ఇంట్లోకి తెస్తోంది.. విడాకులిప్పించండి

## గుజరాత్ హైకోర్టులో ఓ భర్త పిటిషన్



**అహ్మదాబాద్, నవంబరు 16:** తన భార్య రోజూ వీధికుక్కలను ఇంటికి తీసుకువస్తోందని, ఆమెకు వీటిపట్ల ఉన్న మమకారంతో నా వైవాహిక జీవితం నరకప్రాయం అయిందని విడాకులు కావాలంటూ గుజరాత్ హైకోర్టులో 41 ఏళ్ల వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అహ్మదాబాద్‌కు చెందిన ఈ 41 ఏళ్ల వ్యక్తి ఒక ప్రైవేటు సంస్థలో సీనియర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. అయితే 2006లో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె వయసు 40 ఏళ్లు కాగా ఈమె కూడా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అయితే ఈమెకు ముందు నుంచీ శునకాలు అంటే ఇష్టం. దీంతో తరచుగా వీధి కుక్కలను ఇంట్లోకి తీసుకు వస్తుండేది. కానీ భర్తకు ఇది ఏమాత్రం నచ్చట్లేదు. ముఖ్యంగా ఆమె తరచూ వీధి శునకాలను ఇంటికి తీసుకురావడం, వాటిని ఇంట్లోనే ఉంచడం, తనకంటే వాటి సంరక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వంటి పనులతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభం అయ్యాయి. వీధి శునకాలను ఇంట్లోకి తీసుకురావద్దని భర్త ఎన్నిసార్లు వారించినా భార్య ఆ మాటలను పట్టించుకోలేదు. దీంతో ఎంత చెప్పినా వినడం లేదని విడాకులు తీసుకోవడానికి సిద్ధమయ్యాడా భర్త. ఈక్రమంలోనే గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటికి తీసుకు వస్తున్న వీధి శునకాల్లో ఒకటి తనను కరిచినప్పటికీ భార్య ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పిటిషన్‌లో వివరించారు. వీధి శునకాల కారణంగా తనకు తీవ్ర మానసిక వేదన కలిగిందని ఇకపై ఆమెతో కలిసి జీవించలేనని ఆయన కోర్టుకు విన్నవించుకున్నారు. శునకాల వివాదంతో పాటు భార్య తనపై వివాహేతర సంబంధం ఆరోపిస్తూ ఓ రేడియో ఛానెల్‌తో కలిసి ప్రాంక్ కాల్ చేయించిందని ఇది తనకు సమాజంలో, ఉద్యోగంలో ఎంతో మానసిక ఒత్తిడి కల్గించిందని పేర్కొన్నారు. ఈ వివాదాల కారణంగా విడాకులు కోరుతూ భర్త 2017లోనే కుటుంబ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే కుటుంబ కోర్టు ఈ ఆరోపణల ఆధా రంగా క్రూరత్వం నిరూపితం కాలేదని పేర్కొం టూ పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో భర్త తీర్పును సవాల్ చేస్తూ తాజాగా గుజరాత్ హైకోర్టు తలుపు తట్టారు. మరోవైపు భర్త ఆరోపణలను భార్య పూర్తిగా తోసిపుచ్చింది. విడాకులకు అంగీకరిస్తే తనకు భరణం కింద ఏకంగా రూ.2 కోట్లు చెల్లించాలని ఆమె డిమాండ్ చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఇరువురు పార్టీలకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. వీధి శునకాలు, పెంపుడు జంతువుల ప్రేమ ఇప్పుడు విడాకులకు కారణం అవుతున్న నేటి సామాజిక పోకడలకు ఈ కేసు నిదర్శనంగా నిలిచింది.

# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లండి



పాలకొల్లు, నవంబరు 16 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ 16 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతోపాటు మనం చేసే మంచి పనులను గడప గడపకు తీసుకువెళ్లాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్ల నియంతృత్వ, నిరంకుశ, కక్షలు, వేధింపులు, కేసులతో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసంతో పాలన చేసిన వైసీపీ మళ్లీ అసత్యాలు, అబద్ధాలతో ప్రజల్లోకి వస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరు నిలదీసేలా వాస్తవాలను తెలపాలన్నారు. ఆదివారం పాలకొల్లులోని కార్యాలయ వద్ద జరిగిన పోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, సేవా మిత్ర, సాధికార, యువత, సోషల్ మీడియా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసం వైపు సాగగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ వైపు పరుగులు పెడుతుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని మంత్రి రామానాయుడు తెలిపారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు వరుసగా గెలిపించిన అన్ని వర్గాల ప్రజల మనం తీర్చుకునేలా విశ్రాంతి లేకుండా పనిచేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నానని, మీరు కూడా పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలని మంత్రి రామానాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు దాసరి రత్నం రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మేడిశెట్టి బుజ్జి, శీలం శ్రీనివాస్, పెనుమత్స రాంబద్ర రాజు, ఎల్లమిల్లి వెంకటరావు, కుక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఉచిత విద్య నిరుపేద విద్యార్థులకు ఆస్తి

## • మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



నెల్లూరు(వైద్యం), నవంబరు 16 ప్రభాతవార్త: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను ఆస్తిగా ఇవ్వడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో వ్యూహాత్మక ప్రణాళికలు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు మూలపేట బాలికోన్నత పాఠశాల ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు వేగంగా చేస్తున్న డీఎస్ఆర్ కంపెనీ సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో అధునాతన వసతులు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అయితే గత ప్రభుత్వం వీఆర్ హైస్కూల్‌ని మూసేసిందని, ఆ ప్రభుత్వానికి మూసేయటం తప్ప ఇంకేమీ తెలియదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కానీ తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌సీసీతో పాటు, తన పిల్లల సహకారంతో వీఆర్సీ స్కూల్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్ది ప్రారంభించామని తెలియజేశారు. వీఆర్ఎంసీ హైస్కూల్‌కు సీఎస్ఆర్ ఫండ్స్ కింద కోటి ఇరవై లక్షల విలువ చేసే 4 బస్సులను యూనియన్ బ్యాంకు అందజేసిందన్నారు. వీఆర్ఎంసీ స్కూల్ స్ఫూర్తితో మూలపేట స్కూల్‌ని డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సుధాకర్‌రెడ్డి దత్తత తీసుకొన్నారని తెలిపారు. 40 వేల చదరపు అడుగుల్లో అద్భుతమైన నిర్మాణం చేస్తున్నారన్నారు. రెండు ఫ్లోర్‌ల నిర్మాణం పూర్తయిందని, నర్సరీ నుంచి పదో తరగతి వరకు పేద పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని స్పష్టం చేశారు. అత్యాధునిక పరికరాలతో ప్లే గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి వీఆర్సీని మించిన వసతులతో ప్రారంభిస్తామన్నారు. సిటీలోని 15 హైస్కూల్స్‌ని దాతల సహకారంతో వీఆర్సీ తరహాలో సిద్ధం చేస్తామని తెలియజేశారు. సిటీలోని 15 వేల మంది పేద పిల్లలకి ఉచితంగా కార్పొరేట్ విద్య అందించాలన్నదే లక్ష్యం అని స్పష్టం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, జిగ్మా కంపెనీ, టీవీఎస్ కంపెనీ, రెడ్డి ల్యాబ్స్, ఏఎంఆర్ కంపెనీలు స్కూల్స్ దత్తతకు ముందుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకొస్తున్న దాతలకు మంత్రి అభినందనలు తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు కష్టాలు తెలుసు కాబట్టే పేద పిల్లలకు ఉచితంగా మెరుగైన విద్యను ఆస్తిగా ఇవ్వాలని సంకల్పించామన్నారు. ఒక్క స్కూల్‌కి హామీ ఇచ్చి 15 స్కూల్స్‌ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నారాయణ స్కూల్స్ కంటే మెరుగ్గా 15 హైస్కూల్స్‌ని తీర్చి దిద్దుతామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తోపాటు 39, 40వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి అన్నంగి ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, జనరల్ సెక్రటరీ గౌతమ్ మధు సూదన్‌రెడ్డి, 40 డివిజన్ అధ్యక్షుడు గండవరం నాని, యూనిట్ ఇన్‌చార్జి అమ్మని, టీడీపీ ముఖ్య నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మల్లెమడుగు రిజర్వాయర్‌లో మునిగిపోయి ఇద్దరు మృతి

రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ మల్లెమడుగు రిజర్వాయర్ నీటిలో మునిగిపోయి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా... తిరుపతికి చెందిన శేఖర్ (32), శివ (35) నరేష్ (36) ఈత కోసం మల్లెమడుగు రిజర్వాయర్‌కు వచ్చారు. వీరిలో శివ అనే వ్యక్తికి ఈత రాదు. అతను ముందుగా రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈతరాక శివ మునిగిపోతూ ఉండడాన్ని ఈత తెలిసిన నరేష్ గుర్తించాడు. వెంటనే నీటిలోకి దిగి అతనిని కాపాడే ప్రయత్నం చేశాడు. కాపాడ్డానికి వెళ్లిన ఇతను కూడా మునిగిపోయాడు. ఇది గమనించిన శేఖర్ వెంటనే గ్రామస్తులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు నీట మునిగిన ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెంది ఉన్నారు. అర్బన్ సిఐ జయచంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకొని పరిస్థితులను సమీక్షించి మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

# ఆటోను ఢీకొన్న సిమెంట్ లారీ

## - 12 మందికి గాయాలు - నలుగురి పరిస్థితి విషమం



మర్రిపాడు (నెల్లూరు), నవంబరు 16 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నందవరం క్రాస్‌రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం కూలీలతో వెళుతున్న ఆటోను సిమెంట్ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. 12 మంది కూలీలతో వెళుతున్న ఆటో ఆత్మకూరు మండలం బంట్లపలి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్లకు జామాయిల్ నాట్లు కసం వెళుతోందని, నందవరం కూడలి వద్దకు రాగా సిమెంట్ లారీ ఢీకొటిందని దాంతో ఆటో తిరగబడిందని పోలీసులు తెలిపారు. 12 మంది కూలీలకు గాయాలు కాగా వారిని చికిత్సకై 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వారిని మెరుగైన చికిత్సకై నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఆత్మకూరు సిఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావులు పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శ్రీనివాసరావ్ తెలిపారు.

# డబుల్ ఇంజన్ సర్కారుపై పెట్టుబడిదారుల్లో పెరిగిన విశ్వాసం

## సిఐఐ సదస్సు విజయంతంపై మంత్రి సత్యకుమార్



సచివాలయం, నవంబరు 16 ప్రభాతవార్త: విశాఖలో సిఐఐ 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రధాని మోడీ దిశా, నిర్దేశం, సహకారం, అండదండలు, సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షత, కార్యాచరణవల్ల ఎపిలో పెట్టుబడులు వెలువెత్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ పత్రికా ప్రకటన జారీచేశారు "గత వైకాపా పాలనలో గతి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేస్తున్న కృషివల్ల ఎపికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి లభిస్తోంది. విశాఖలో మూడురోజులపాటు పెట్టుబడులపై జరిగిన వరుస సమావేశాల ద్వారా అంచనాలకు మించి, 12 రంగాల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం పిఎం, సిఎంల దార్శనికత, ఐక్యత, సమర్థతకు నిదర్శనం. సిఎం చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకరంగా ఉంది. ఒప్పందాలు జరిగిన వెంటనే పారిశ్రామిక సంస్థలకు అనుకూల ఉత్తర్వులు ఇవ్వడం ఓ చరిత్ర. ఇలాంటి ఉత్తమ విధానాలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఏడాది వ్యవధిలోనే పిఎం మోడీ రాష్ట్రంలో 3సార్లు పర్యటించి, రూ.2.80 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. వరుస పర్యటనల ద్వారా రాష్ట్రంపై తనకు ఉన్న ప్రత్యేక శ్రద్ధ గురించి పిఎం మోడీచాటిచెబుతున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి కృషితో వ్యవహరిస్తున్నందున ఫలితాలు బ్రహ్మాండంగా కనిపిస్తున్నాయి. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల దేశంలోనే తొలిసారిగా విశాఖ సాగరతీరంలో కృత్రిమ మేధ హబ్ నిర్మించబోతుంది.

అదే సాగరతీరంలో పారిశ్రామిక సంస్థలు తాజాగా ప్రకటించిన పెట్టుబడులతో విశాఖ మహానగర ఖ్యాతి మరింత విస్తరించబోతుంది. 2040 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు జరిగే కృషిలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా వ్యవహరించబోతుంది. మరోపక్క సంక్షేమ పథకాల అమల్లోనూ కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది. సూపర్ సిక్స్ హామీలు ఖసూపర్ హిటు అయ్యాయి" అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



ముఖ్యఅతిథి రాఘవన్ వరదరాజన్‌కి మెమొంటో అందిస్తున్న ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రపీత్ సింగ్ కోహ్లి

# శాస్త్రీయ పరిశోధనలు సాగాలి

శ్రీకాళహస్తి, నవంబరు 15 ప్రభాతవార్త: సామాజికాభివృద్ధికి శాస్త్రీయ పరిశోధనలు విస్తృతంగా సాగాలి, భారత ప్రభుత్వ లక్ష్యం వికసిత భారత్ 2047 కల సాకారం కలగాలని మూడు రోజులు ఇక్కడి ఐసర్‌లో జరిగిన ఇండియన్ అకాడమి ఆప్ సైన్సెస్ 91వ వార్షికోత్సవ సభల్లో మేధావులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. ఆదివారం ముగింపు సమావేశంలో తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎన్ఏఆర్ఎల డైరెక్టర్ ప్రొఫెసర్ అమిత్ మిత్రా, ఎస్‌వి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టాటా నరసింహారావు సందేశాల నిచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న సంస్థల్లో 91వ వార్షికోత్సవ నిర్వహణ అవకాశం తిరుపతి ఐసర్‌కు ఇవ్వటం మూడు రోజులపాటు విజయవంతంగా నిర్వహించటం గర్వించదగ్గ విషయ మని రిజిస్ట్రార్ కింగ్‌కోహ్లి వివరించారు. రాష్ట్రాన్ని శాస్త్రీయ, విద్యానైపుణ్యాల దిశగా నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. రాబోవురోజుల్లో వాతావరణానికి అనుగుణంగా వాయుకాలుష్యంతో తల్లడిల్లుతున్న సమాజంలో ఆరోగ్యరక్షణకు 'వాక్సిన్' అభివృద్ధికి సంబంధించి నొక్కి వక్కాణించారు. శాస్త్రీయ ఆవిష్కరణలను నడిపించటంలో, సహకార, జ్ఞానఆధారిత భారతదేశం దార్శనికతకు దోహదపడుతుందని ఇందుకు ఐసర్‌కు అవకాశం రావాలనిఎదురుచూస్తుందని రిజిస్ట్రార్ వివరించారు.

# హిందూపురం శివారులో వైసీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

## నిరసనగా రోడ్డుపైనే బైఠాయింపు, అరెస్ట్... అనంతపురం తరలింపు

అనంతపురం, నవంబరు 16 ప్రభాతవార్త బ్యూరో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురంలో ఆ పార్టీని గెలిపిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బాలకృష్ణ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని.. ఎన్నికలకు ముందు కుటుంబ సభ్యులతో రావడం, ఆ తర్వాత సినిమాలకు పరిమితం కావడం పరిపాటిగా మారిందన్నారు. హిందూపురం నియోజకవర్గానికి బాలకృష్ణ గెస్ట్ ఆర్టిస్ట్ అని వ్యాఖ్యానించారు. శనివారం హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి హిందూపురానికి బయలుదేరిన అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహం వద్దే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మండిపడ్డ అనంత.. చివరకు హిందూపురం వెళ్లారు. అక్కడ పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీ వద్దకు చేరుకోగానే అనంతతో పాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఆ క్రమంలో పోలీసులకు, అనంతకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ కార్యాలయంపై టీడీపీ మూకలు దాడి చేస్తే పరిశీలించేందుకు రాకూడదంటే ఎలా? అని సూటిగా ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికి వెళ్లడం లేదని, పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తమను అడ్డుకోవడం తగదంటూ రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు పోలీసులు వారిని వాహనాల్లో అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున కోర్టు రోడ్డుకు చేరుకున్నారు. పోలీస్ వాహనం రాగానే రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అనంతను స్వగృహానికి చేర్చి బందోబస్తు చేపట్టారు.

### కూటమి పాలనలో రావణకాష్టం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాలు, అల్లరి మూకలు దాడి చేసి సిబ్బంది, కార్యకర్తలను గాయపర్చారన్నారు. దాడిలో గాయపడ్డ వారితో పాటు పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఎక్కడికక్కడ కీలక నాయకులను గృహ నిర్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికో, రెచ్చగొట్టడానికో వెళ్లలేదని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు అరాచకం చేస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని, ఎవరికీ భయపడేది లేదని తెలిపారు.

### దాడిని ఖండించిన వెన్నపూస



దేవుడి విగ్రహాలని, మా పార్టీకి దేవుడు లాంటి వైఎస్ఆర్ విగ్రహాన్ని పగలకొట్టడానికా.. బాలకృష్ణ మిమల్ని ప్రజలు ఎన్నుకుంది..? అని వైఎస్ఆర్‌సిపి పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. శనివారం హిందూపురంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపైన ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో అనుచరులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటే ఇదేనా.. పార్టీల కార్యాలయాలపై దాడులు, ప్రశ్నించినందుకు వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం అని ఆయన ప్రశ్నించారు. కనీసం పరామర్శ కూడా నేరమేనా..? పరామర్శకి వెళ్తున్న వైస్సార్సీపి ముఖ్య నాయకులైన సతీష్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీ చరణ్, పెద్దారెడ్డి, మగ్బుల్, పూల శ్రీనివాస్ రెడ్డి తదితర ముఖ్య నాయకులని పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నేరుగా పార్టీలపై దాడులు చేస్తున్నా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపే ఆలోచనలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని మండిపడ్డారు.

# సత్యసాయి శతజయంతి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేద్దాం

## • సాయి యాప్ సద్వినియోగం చేసుకోండి • ప్రముఖుల కోసం నాలుగు హెలీపాడ్లు • జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఆ ట్రస్ట్ వర్గాలు, అధికార యంత్రాంగం సమన్వయంతో ప్రణాళికబద్ధంగా విజయవంతం చేద్దామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుండి 23 వరకు పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా జరిగే కార్యక్రమాలను ప్రజలు భక్తాదులు తమ వంతు సహకారాలు అందించి వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కోరారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 19న దేశ ప్రధాని నరేంద్ర మోడీ రానున్నారని, అలాగే భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సూత్రప్రాయంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాబా జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించి మంత్రుల బృందం, జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలను పాటిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాను కూడా క్షేత్రస్థాయిలో లోటుపాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఆ రోజున సుమారు లక్ష మంది ప్రజలు భక్తాదులు హాజరు అవుతున్నట్లు అంచనా ఉందని, దీనికై ప్రయాణికుల సౌకర్యం కోసం 200 పైగా బస్సులు ఏర్పాటు చేశామని, అలాగే రైల్వే స్టేషన్ నుంచి బాబా మందిరం వరకు వచ్చే భక్తాదులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్ల నేతృత్వంలో 300 దాకా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి సకాలంలో పారిశుధ్య పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సాయి ఆరామంలో వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అలాగే టోల్ ఫ్రీ నంబర్ 18002335598 ద్వారా ఏవైనా ఇబ్బందులు తగిన సమాచారం తెలుసుకొనే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో ప్రస్తుతం 2 హెలిప్యాడ్లను ఏర్పాటు చేశామని మరో రెండు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని వివరించారు. బాబా శత జయంతోత్సవాల సందర్భంగా సమాచారం అందించేందు కోసం క్యూ ఆర్ కోడ్‌తో కూడిన "సాయి 100 యాప్" ఏర్పాటు చేశామని ప్రజలు, భక్తులు ఈ "యాప్"ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ యాప్ ద్వారా రోజు వారీగా ప్రశాంతి నిలయం లో జరిగే కార్యక్రమాలు, ఇతర ఈవెంట్లు, పుట్టపర్తి ఆకర్షణలు, భక్తులకు భోజన కౌంటర్ల ఏర్పాటు, వసతి వివరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవల సమాచార కేంద్రాలు, ఫిర్యాదులు, కమాండ్ కంట్రోల్ సెంటర్, తాగునీటి పాయింట్లు, పుట్టపర్తి చుట్టూ ఉన్న ప్రదేశాలు, తదితర అంశాల గురించి పూర్తి స్థాయి సమాచారాన్ని తెలుసుకునేందుకోసం ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. సోమవారం నుండి నవంబర్23 వరకు స్థానిక శిల్పకళారామంలో ఐదు రోజులపాటు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వివిధ కళా సంస్థల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రస్తుతం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత సరస్ బజార్ ఏర్పాటు చేశామని, ఇందులో స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామీణ కళాకారుల ద్వారా తయారుచేసిన హస్తకళలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనలు, హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు అమ్మకాల నిమిత్తం స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.




# సత్యసాయి శత జయంతి వేడుకలకు వస్తున్న ప్రముఖులు వీరే




పుట్టపర్తి రూరల్ నవంబరు 16 ప్రభాతవార్త: సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు వివిధ రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 19న దేశ ప్రధాని నరేంద్ర మోడీ, 20న కేంద్ర మంత్రి నితిన్ గట్కరి, 21న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొంటున్నారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, యనమల రేవంత్ రెడ్డి, సిద్ధి రామయ్యలు హాజరుకానున్నారు. గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని 130 దేశాల నుండి పలువురు విదేశీ ప్రముఖులు రానున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పుట్టపర్తికి రానున్న ప్రముఖులను దృష్టిలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలను చేపట్టారు.

ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబర్ 18న సత్యనారాయణ వ్రతం, సత్యసాయి బాబా నూతన వెండి రథోత్సవం నిర్వహించనున్నారు. 19న హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించనున్నారు. 20 21న సత్యసాయి సేవా సంస్థల జాతీయ సదస్సు నిర్వహించబడుతుంది. 22న శ్రీ సత్యసాయి హయ్యర్ సెకండరీ యూనివర్సిటీ 45వ స్నాతకోత్సవం జరగనుంది. 23న సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్నారు ఈ కార్యక్రమంలో స్వర్ణ రథోత్సవంతో వేడుకలు ప్రారంభించనున్నారు. ప్రశాంతి నిలయంలో జోలోత్సవం నిర్వహిస్తారు. సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 18 నుండి 23 వరకు దాదాపు 15 లక్షల మంది సత్యసాయి భక్తులు సత్యసాయిని దర్శించుకొనున్నారు. రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రభుత్వం మరియు సెంట్రల్ ట్రస్ట్ అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తికమాసం రద్దీ

## కాలసర్పదోష పూజలకు గిరాకి

శ్రీకాళహస్తి, నవంబరు 15 ప్రభాతవార్త: కార్తీక మాసం, వారాంతపు రద్దీ, ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయం భక్త జనులతో కిటకిటలాడింది. విఐపిల సేవలో చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఒ ఎన్ కృష్ణారెడ్డి, ఎఇఒలో మోహన్, విద్యాసాగర్‌రెడ్డి వారి సిబ్బంది జవాబుదారితనంతో ప్రోటోకాల్‌ను నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి భక్తులు సునామిలా కదలి వచ్చారు. దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు. ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం శనీశ్వరాలయంలోనూ, రాహు కాల సమయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటుచేసుకుంది.

# స్పీకర్ వ్యవహారంపై నేడు సుప్రీం విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్16:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జాప్యం చేస్తున్నారంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు రాబోతోంది. గతంలో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన మూడు నెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి తమకు మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ పిటిషన్‌తో పాటు స్పీకర్ కార్యాలయం వేసిన అదనపు పిటిషన్‌పై కూడా సోమవారం విచారణ జరగనుంది.

### వామన్‌రావు దంపతుల హత్య కేసు:

# పుట్ట మధుకు సిబిఐ నోటీసులు

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు, నాగమణిల హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎంఎల్ఎ పుట్ట మధుకు సిబిఐ నోటీసు లు జారీ చేసింది. సోమవారం నాడు రామగుండంలో జరిగే విచారణకు హాజరు కావాలని అందులో వుంది. పెద్దపల్లి జిల్లా కామగిరి మండలం కల్వచర్ల వద్ద 2021 ఫిబ్రవరి 17వ తేదీన వీరిని హత్య చేయడం తెలిసిందే. దీనిపై మొదట రామగుండం కమిషనరేట్ పోలీసులు విచారణ చేబట్టగా వామన్ రావు తండ్రి కిషన్ రావు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిబిఐ విచారణకు డిమాండ్ చేయడం విదితమే. దీనిపై కిషన్ రావు సుప్రీం కోర్టు నుంచి ఉత్తర్వులు పొందిన తరువాత వామన్ రావు దం పతుల హత్య కేసు విచారణ సిబిఐకి బదిలీ అయ్యింది. ఈ కేసులో పుట్ట మధుపైనా అభియోగాలు వుండడంతో ఆయనను విచారించాలని నిర్ణయించిన సిబిఐ అధికారులు ఈ మేరకు నోటీసులు జారీ చేశారు.

# అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాలకు భూకేటాయింపు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నాలుగెకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు విశాఖలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో 'హరేకృష్ణ మూవ్‌మెంట్' ప్రతినిధులు వంశీధరదాస, విలాస విగ్రహదాస, రఘునందన్‌దాస సంయుక్తంగా అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారతీయ సంప్రదాయ విలువలతో పాటు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను సమన్వయం చేస్తూ విద్య అందించడమే లక్ష్యంగా ఈ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.



# ఆ ఆరోపణలు అవాస్తవం

### ఎలమంచిలి ఎమ్మెల్యే విజయ్ కుమార్

విశాఖపట్నం, నవంబరు 16 ప్రభాతవార్త: ఈ మధ్యకాలంలో తనపై అనేక ఆరోపణలు వస్తున్నాయని వాస్తవం కాదని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఎదుగుదలను చూసి ఒక వర్గం తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని, తన వల్ల పార్టీ అధినేతకు కానీ పార్టీ కానీ ఎటువంటి మరక అంటకూడదని నిజం ప్రజలకు తెలిసేందుకే తాను మీడియా ముందుకు వచ్చాను అని తెలిపారు. తాను రాజకీయాలకు రాకముందు నుండి ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నానని అందువల్లే తనకు 50 వేల మెజార్టీతో ప్రజలు గెలిపించుకున్నారని తెలిపారు. తాను ఎప్పుడు ప్రజలకు రుణపడి ఉంటానని ఎటువంటి పరిస్థితుల్లో తనపై నమ్మకం పెట్టుకున్న వారికి అన్యాయం చేయనని తెలిపారు. కొంతమంది కావాలని కొన్ని పత్రికలను అడ్డం పెట్టుకొని తనపై అవాస్తవాలు ప్రచురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపైనే తాను న్యాయం గానే పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తాను ఎటువంటి భూవివాదాల్లో తల దూర్చలేదు. దూర్చనని చెప్పారు.

# గొల్లపల్లి లక్ష్మి స్మారక పురస్కారాల ప్రదానం

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: సామాజిక సాహిత్యవేత్త గొల్లపల్లి లక్ష్మి స్మారక పురస్కార సభ విజయవాడలోని బుక్ సొసైటీ హాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో తంగిరాల సోనీ, పేరూరు మురళి కుమార్, డాక్టర్ నూకతోటి రవికుమార్, గొల్లపల్లి అంబేద్కర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గుప్తా, అంబేడ్కర్ జాషువా, ఫూలే అధ్యక్షులు బత్తుల విల్సన్, రాష్ట్ర నలుమూలల నుంచి అనేకమంది సాహిత్యకారులు హాజయ్యారు. ఈ కార్యక్రమం సామాజిక న్యాయ పోరాట సమితి, బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో జరిగింది.

# బిర్సా ముండా ఆశయాలతో యువత ముందుకు నడవాలి

- ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ
- పాడేరులో బిర్సా ముండా విగ్రహావిష్కరణ

పాడేరు, నవంబరు 16 ప్రభాతవార్త: జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా 150వ బిర్సా ముండా జయంతి సందర్భంగా వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిశా సిఎం మోహన్‌చరణ్ మాఝీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ముందుగా సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన జిసిసి, వందన్ వికాస్ స్టాల్స్‌ను సందర్శించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా జయంతి సందర్భంగా పాడేరు మండలం లగిశపల్లి సమీపంలోని చింతలవీధి కూడలిలో ఏర్పాటు చేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఆవిష్కరించారు. తొలుత ఒడిశా సీఎంకు రాష్ట్ర మంత్రులు సత్య కుమార్, సంధ్యారాణి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎస్ మాధవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ఒడిశా సిఎం సంప్రదాయ నృత్యం చేశారు. బిర్సా ముండా విగ్రహావిష్కరణ అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మోహన్ చరణ్ మాఝీ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ తెలుగులో మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ బిర్సా ముండా.. మన భూమి మన ప్రదేశం అనే నినాదంతో పోరాటం చేశారని కొనియాడారు. బిర్సా ముండా స్వాతంత్రయ సమరయోధులు మాత్రమేకాదు ఆధ్యాత్మిక వేత్త. ఆయన 25 ఏళ్ళు మాత్రమే జీవించారు.. కానీ పోరాట పటిమ గొప్పది. బిర్సా ముండాకి ప్రధాని మోడీ జాతీయ గౌరవం ఇచ్చారు. ఈ రోజు ఆదివాసీ గౌరవ దినోత్సవం జరుపుకుంటున్నాము. ఆదివాసీ బిడ్డ దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతిగా ఉన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులను సిఎం చేసినందుకు



ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో గిరిజన తెగలు ఉన్నాయి. కొండదొర తెగవారు అటవీ జీవితం సమాజాన్నికి ఎన్నో ఉత్పతులు ఇస్తున్నారు. సవర తెగ వారు గిరిజన భాషను పరిరక్షిస్తున్నారు. కొండ సవరాలు సమాజానికి మేలు చేస్తున్నారు. ఒడిశాలో 28 లక్షల పిజిటిలకు విద్య, వైద్య సేవలు ఇస్తున్నాము. 90 వేల ఇళ్లకు మంచి నీరు అందిస్తున్నాము. ఎపి కూడా సవర, కొండ సవర గభ, తెగలకు ప్రభుత్వాలు మేలు చేస్తున్నాయి. ఏకలవ్య స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఏడు కోట్ల ఆదివాసీలకు ఆరోగ్య మేలు అందుతోంది. 1650 యుగిరిజనులకు రుణాలు ఇచ్చారు. 415 బంధన్ వికాస స్కూల్ ఎపిలో తర్ఫీదు ఇస్తున్నారు. లంబ సింగి ప్రాంతంలో మ్యూజియం ఏర్పాటు అవుతోంది. లోకల్ నుంచి గ్లోబల్ 195 స్టోర్‌లో గిరిజన ఉత్పతిలు ప్రమోట్ చేసాం. ఆదివాసీ తెగలు స్వయం సమృద్ధి శక్తులు. గిరిజనులు మన దేశ గుండెకాయ లాంటి వారు.. బిర్సా ముండా హీరో మాత్రమే కాదు.. భవిష్యత్‌కు దిక్సూచి, అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ ఆత్మ గౌరవ సూచిక. మన్యం వీరుడుగా ప్రజల్లో నిలిచాడు. యువతకి ప్రేరణగా నిలిచారు. యువతను వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం అధ్యక్షుడు మటన్ సన్యాసినాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ మఠం శాంతకుమారి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోలాబుజ్జి రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే, బిజెపి అధ్యక్షులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.



# శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తాటతీస్తాం

**తిరుపతి జిల్లాలో ఆరుగురిపై పిడియాక్టు: జిల్లా ఎస్పీ**

తిరుపతి, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: పలు రకాల నేరస్వభావం కలిగిన నేరచరిత్రులు శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తాటతీస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు హెచ్చరించారు. ప్రజలశాంతికి విఘాతం కలిగిస్తున్న ఆరుగురిపై పిడియాక్టు క్రింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం ఉదయం తిరుపతి పోలీసు అతిధిగృహంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారితో కలసి పిడి యాక్టు కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. జిల్లాలో ప్రజా శాంతిభద్రతలకు, ఆస్తులకు ముప్పుగా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. డ్రగ్స్ వాడకం, అక్రమరవాణా, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, అక్రమ రవాణాదారులు దోపిడీదారులు వంటివాటిల్లో భాగస్వామమైన వారిని గుర్తించి వారిని చట్టం ముందుకు తీసుకు వస్తామన్నారు. పదేపదే నేరాలలో పాల్గొన్న ఆరుమంది తిరుపతి జిల్లా గూడూరుమండలం చవటపాలెంకు చెందిన షేక్‌కాలేషా (33), గూడూరు టౌన్ అరుంధతియపాలెంకు చెందిన కనుపూరు శ్రీహరి(38), తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన సయ్యద్ అజీమ్ (30), చిత్తూరు జిల్లా పులిచర్లమండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన వట్టికుంట అరుణ్ కుమార్ (32), నెల్లూరు జిల్లా పెన్నానది వంతెన దగ్గరుండే మీధూరి సునీల్(29), సూళ్ళూరుపేట టౌన్‌కు చెందిన ప్రసన్నకుమార్ (32)లపై పిడి కేసులు నమోదు చేశామన్నారు. వీరందరిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో పలురకాల కేసులు ఉన్నాయన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే ఏదైనా కార్యకలాపాలు గమనించినపుడు 112కు ఫోన్‌చేసి తెలియజేయాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు.

# ఎన్నికల సంస్కరణలు అవశ్యం

### మీట్ ది ప్రెస్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



విజయవాడ, నవంబరు 16 ప్రభాత వార్త: రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్ధకమైన నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు ఆవశ్యమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందన్నారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశపరిచాయన్నారు. దీనిపై వారు నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో డి.రాజా మాట్లాడారు. దేశం నేడు సంక్లిష్ట పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నదని, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని రాజా మండిపడ్డారు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రాసిన ఈ దేశానికి ఇటువంటి రాజ్య స్థాపన ఎంతో వైపరీత్యంగా పరిగణిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాజ్యాంగంలో పేర్కొన్న సౌభ్రాతృత్వం, సమానత్వం, ఐక్యత ప్రాథమిక సూత్రాలను ఆర్ఎస్ఎస్ ఎన్నడూ అంగీకరించలేదని ఆయన గుర్తు చేశారు. దేశ అత్యున్నత చట్టసభైన పార్లమెంటు సక్రమంగా పనిచేయకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. దేశంలో మతోన్మాద పార్టీలు, కార్పొరేట్ శక్తుల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడ్డాయని, విశాఖ ఉక్కు కర్మాగారంతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అప్పచెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు అనంతరం, ఇక పశ్చిమ బెంగాల్ వంతు అంటూ ప్రధాని మోడీ ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. బెంగాల్ ఒక సునిసితమైన రాష్ట్రం అన్నారు. 2026లో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్లో ఎన్నికలు జరగనుండగా, ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేసేందుకు ఇప్పటి నుండే కుటిల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ నగర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.



# కార్మికులను సిఎం బెదిరించడం తగదు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: కార్మికులపై పిడి యాక్టు ఉపయోగిస్తామంటూ విశాఖ ఉక్కు కార్మికులను బెదిరించే ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వాఖ్యలను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కార్మికులను ముఖ్యమంత్రి బెదిరించడం తగదు అని పేర్కొంది. అవాస్తవాలు, అర్థ సత్యాలతో ప్రజలను తప్పుదారి పట్టించడం ముఖ్యమంత్రికి తగదు అని చెప్పారు. కార్మికుల వేతనాలను ఉత్పత్తితో ముడిపెడుతూ ఉక్కు యాజమాన్యం తాజాగా సర్క్యులర్ జారీ చేయడం మరింత అనిశ్చితికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, గనులు లేకపోవడం, ఇతర పాలనాపరమైన కారణాల వల్ల నష్టాలు వస్తుంటే అందుకు నెపం కార్మికులపై నెట్టడం దారుణమన్నారు. దేశ దేశాలు తిరిగి పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల రాయితీలిస్తామని ఎర్రతివాచీ పరిచిన ముఖ్యమంత్రి రేయింబవళ్ళు శ్రమ చేసే కార్మికులను పి.డి.యాక్టు పెట్టి జైళ్లలో వేస్తామనడం ఈ ప్రభుత్వం ఎవరి పక్షమో స్పష్టం చేస్తోందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ రక్షణ కోసం కార్మికులు పోరాడుతుంటే వారికి మద్దతు ఇవ్వకపోగా నిందించడం అన్యాయమని ధ్వజమెత్తారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో పనిచేయాలి



విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డ. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ కె.సత్యవతి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్, జెడి అమృత్, కెబిఎన్ఎస్ లత, డిసిపి చంద్రబోస్, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులు, కూటమి కార్పొరేటర్లు మరుపిళ్ళ రాజేష్, మహాదేవు అప్పాజీరావు, బుల్లా విజయ్ కుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ, అర్షద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మైలవరపు మాధురి లావణ్యలతో కలిసి సమీక్ష నిర్వహించారు. పశ్చిమలో ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అభివృద్ధి పనులు, చేపట్టనున్న, ప్రారంభించవలసిన పనులను గురించి కార్పొరేటర్లను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి అయిన, అసంపూర్తిగా ఉన్న, చేపట్టవలసిన ఇళ్లను గురించి వివరాలను అందజేయాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి సమన్వయంతో పని చేయాలన్నారు. ఇద్దరూ కలిసి పనిచేయడం వలన సమస్యలు పరిష్కారం అవుతాయని, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవుతాయన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడం తన లక్ష్యమన్నారు. కార్పొరేటర్లు, అధికారులు తక్షణమే చేపట్టవలసిన అవసరాలు, సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సమస్యలపై చర్యలను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు దుర్గారావు, అత్తలూరి పెద బాబు, రిటైర్డ్ ఎస్ఈ అర్నిపల్లి ఉదయ్‌కుమార్, రిటైర్డ్ ఈఈ నారాయణమూర్తి, సిఎల్‌టిసి సమత, డిఇ పురుషోత్తం, సిడిఓ శ్రీకాంత్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



# మల్లంపేటలో నల్లచెరువుపొర్లు కట్టు విధ్వంసం

### ఎర్రమట్టితో బూడిద పాల్జేస్తారని రైతులు ఆగ్రహం

రౌతులపూడి, నవంబరు 16 ప్రభాతవార్త: రౌతులపూడి మండలంలోని మల్లంపేటలో నల్లచెరువు నీరుపారుదలకి నిర్మించిన పొర్లు కట్టును లాటరైట్ రవాణాకు చెందిన ప్రతినిధులు రెండు భారీ యంత్రాలతో గ్రామస్తులకు తెలియపరచకుండా ఆదివారం విధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, ఆయకట్టు రైతులు తరలి వెళ్లి ఆయా ప్రతినిధులను నిలదీశారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించారు. తూరలు వేసి రోడ్లు లెవెల్ చేస్తామని వారనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంత క్వారీ యజమాని చేస్తానంటే మా పంటలు ముంపుకు గురై, నష్టం కలుగుతుందని చెప్పడంతో అప్పట్లో ఆపేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో లేటరైట్ క్వారీలు లేనప్పటికి ఎక్కడో ఉన్న భమిడికలొద్దు నుండి తరలించే లేటరైట్ కోసం తూరలువేసి మీరు రోడ్డు నిర్మించుకుంటారా? మీ వ్యాపారాల కోసం మా పొలాలని ముంచేస్తారా అని రైతులు ప్రశ్నించారు. ఎర్రమట్టితో మా గ్రామాన్ని బూడిద పాలు చేస్తారా? గ్రామ అభివృద్ధికి అధికారులు సహకరించకపోయినా, మీ వ్యాపారాలకు అధికారులు వత్తాసు పలకడంతో ఇష్టారాజ్యం అయిపోతుందని వారు వాపోయారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పందించాలని వారు కోరారు.

### ప్రతిభావంతులైన విద్యార్థులకు

# రూ.25 లక్షల ఉపకార వేతనాలు

### కమ్మ కల్యాణ మండపం

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు వచ్చే సంవత్సరం నుంచి కమ్మ కళ్యాణ మండపం ద్వార దాతల సహకారంతో రూ.25 లక్షలు వరకు స్కాలర్ షిప్‌ల రూపంలో అందజేయడం జరుగుతుందని కమ్మ కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షుడు మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు తెలిపారు. ఆదివారం నందిగామలోని కమ్మ కళ్యాణ మండపంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు రూ.12 లక్షల స్కాలర్ షిప్‌లను అందజేశారు. అదే విధంగా తల్లిదండ్రులను కోల్పోయి సరైన అదరణ లేని ఆరుగురు విద్యార్థులను గుర్తించగా వారిలో ముగ్గరిని తాను దత్తత తీసుకుంటున్నట్లు వేదిక పై నుంచి వసంత కృష్ణ ప్రసాదు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు నెట్టెం రఘురాం, అప్కాబ్ మాజీ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య, తన్నీరు నాగేశ్వరరావు, బొద్దులూరి రామారావు, కమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

### బాధితురాలి తల్లి ఫిర్యాదు

### పోక్సో కేసు నమోదు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేసి, అనంతరం ముఖం చాటేసాడో యువకుడు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల కేంద్రం లోని ఓ కాలనీలో నివాసముంటున్న ఒక యువకుడు అదే కాలనీకి చెందిన 15 ఏళ్ళ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. క్రమంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ దగ్గరయ్యాడు, బాలిక గర్భం దాల్చడంతో కన్పించకుండా పోయాడు. బాలిక శరీరంలో మార్పులు గమనించిన ఆమె తల్లి విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై పోక్సో చట్ట పరిధిలో కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు కంచికచర్ల ఎస్ఐ విశ్వనాథం తెలిపారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా పూజలు



ఇంద్రకీలాద్రి, నవంబర్ 16 ప్రభాతవార్త: దుర్గమ్మ వారి ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచహారతులు, మహా నివేదనలు గావించారు. సహస్ర దీప కాంతులతో శ్రీ స్వామి అమ్మ వారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన వనమ రవికుమార్ వారి కుటుంబసభ్యులు ఆదివారం నిత్యాన్నదానానికి రు.1,00,116ల విరాళమందించారు. అలాగే శ్రీకాకుళంకు చెందిన ఎం ప్రభాకర్ దంపతులు, రు.1,00,116ల విరాళాన్ని వారి పిల్లలు చిరంజీవి, జోషిమా జయశ్రీ, శ్రీక జయశ్రీల పేరిట అందించారు. హైదరాబాద్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్, చంద్రావతి, వారి కుటుంబసభ్యులతో కలిసి రు.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండి తులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ వారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు దర్శించుకున్నారు.

### దుర్గమ్మవారి ఆలయంలో సూర్యఉపాసన

ఆదివారం సందర్భంగా దుర్గమ్మవారి ఆలయంలో సూర్య ఉపాసన సేవను నిర్వహించారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ టోల్‌గేట్, మరియు టికెట్ కౌంటరును పరిశీలించారు. ఇఓతో పాటు ఎఇఓ గంగాధర్ పాల్గొన్నారు.

17-11pg10exM 12 ONG_17-11pg10exM.qxd 16/Nov/25 9:55 PM Page 1





## వరల్డ్ బాక్సింగ్ కప్.. సెమీస్‌కు మినాక్షి, ప్రీతి, అంకుష్, నరేందర్

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో క్వార్టర్ ఫైనల్ పోటీలలో నలుగురు భారత్ బాక్సర్లు విజయం సాధించారు. గ్రేటర్ నోయిడాలో ఆది వారం జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నలుగురు అథ్లెట్లు మీనాక్షి హుడా, ప్రీతి, అంకుష్ ఫంగల్, నరేందర్ బర్వాల్‌లు ఘనంగా ఆరంభించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల 48 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో కజకిస్తాన్‌కు చెందిన అక్బోటా బోలాట్‌పై ఏకగ్రీవ విజయంతో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మినాక్షి రోజును ప్రారంభించింది. ఆమె తర్వాత, ప్రీతి పవార్ (54 కిలోలు) కూడా పారిస్ ఒలింపిక్స్ తర్వాత తన మొదటి ప్రధాన పోటీలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నిగినా ఉక్తమోవాను ఓడించడం ద్వారా అద్భుతమైన అరంగేట్రం చేసింది. ఈ రెండు విజయాలు మహిళల బాక్సింగ్‌లోని పది వెయిట్ విభాగాలలోనూ భారత్‌కు పతకాలు ఖాయం అయ్యాయి. ఇక భారత పురుష బాక్సర్లు అంకుష్ (80 కిలోలు), నరేందర్ (90+కిలోలు) ఇద్దరూ తమ మ్యాచ్‌లను ఏకగ్రీవంగా గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు.

# టార్గెట్ 2026

## స్టార్ ప్లేయర్లకు చెక్

### సన్‌రైజర్స్ హైదరాబాద్ మాస్టర్ స్కెచ్



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ సిద్ధమైంది. 2016 ఛాంపియన్‌గా నిలిచిన సన్‌రైజర్స్ 2024 రన్నరప్‌గా నిలిచింది. డేంజరస్ బ్యాటింగ్‌తో దడదడలాడించిన హైదరాబాద్ జట్టు ప్రతీ మ్యాచ్‌నూ కొత్త శిఖరాలకు చేర్చింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని జట్టు గత సీజన్‌లో దారుణమైన ప్రదర్శనతో ఫ్యాన్స్‌ను తీవ్రంగా నిరాశపరిచింది. సన్‌రైజర్స్ ఆడిన 14 ఆటల్లో కేవలం ఆరు మాత్రమే గెలిచి పట్టికలో ఆరవ స్థానంలో నిలిచింది. మొదటి 10 ఆటల్లో కేవలం మూడు విజయాలతో పూర్తిగా తేలిపోయింది. అయితే, ఆ తర్వాత నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలతో తిరిగి వచ్చినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో ఆ సీజన్‌లో కోల్పోయిన వైభవాన్ని 2026లో తిరిగి పొందాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది ప్లేయర్లను ఆ ఫ్రాంచైజీ రిలీజ్ చేసి ఐపీఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ టీమ్‌ను ప్రకటించింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ స్టార్ ప్లేయర్లను మరోసారి రిటైన్ చేసుకుంది. సన్‌రైజర్స్ బ్యాటింగ్‌కు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మరోసారి కీలకం కానున్నారు. ఈ సీజన్‌లో ట్రావిస్ హెడ్ 13 మ్యాచ్‌ల్లో 162.61 స్ట్రైక్ రేట్‌తో 374 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ 14 మ్యాచ్‌ల్లో 33.77 సగటు, 193.39 స్ట్రైక్ రేట్‌తో 439 రన్స్ చేశాడు. మహ్మద్ షమీని రిలీజ్ చేసి సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో రూ.10 కోట్లు మిగిలించుకుంది. షమి ఆడిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 6 వికెట్లు మాత్రమే తీశాడు. ఎకానమీ కూడా 11.23 బాగా ఎక్కువగానే ఉంది. అయితే అంతే ధర చెల్లించి షమీని గుజరాత్ టైటాన్ ట్రేడ్ చేసుకుంది. స్టార్ స్పిన్నర్లు ఆడమ్ జంపా, రాహుల్ చాహర్‌లను హైదరాబాద్ విడుదల చేసింది. వీరితోపాటు వియాన్ ముల్డర్, అభినవ్ మనోహర్, అథర్వ టైడే, సచిన్ బేబీ, సిమర్‌జీత్ సింగ్‌లను కూడా రిలీజ్ చేసింది. దీంతో సన్‌రైజర్స్ పర్స్‌లో మొత్తం రూ.25.5 కోట్లు మిగిలాయి. డిసెంబర్‌లో జరగనున్న మినీ వేలంలో ఎవరిని దక్కించుకుంటుందో చూడాలి. మొత్తానికి మినీ వేలానికి ముందు కావ్య మారన్ మాస్టర్ స్కెచ్‌తో రిటెన్షన్ జాబితాను రూపొందించినట్లు తెలుస్తోంది. రిటైన్, వేలానికి వదిలేసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్, అనికేత్ వర్మ, ఆర్.స్మరన్, హర్ష్ దూబే, కమిందు మెండిస్, బ్రైడన్ కార్సే, జయదేవ్ ఉనద్కత్, జిషాన్ అన్సారీ, జిషాన్ మలింగస్ ఉన్నారు.



## ధనుష్‌కు రైఫిల్ టైటిల్

### మహిత్, కోమల్‌కు రజత, కాంస్యం

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్-2025 పురుషుల, మహిళల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్‌లో భారత్ రెండు పతకాలు సాధించింది. ప్రపంచ రికార్డుతో ధనుష్ శ్రీకాంత్ ఎయిర్ రైఫిల్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. మహిళల విభాగంలో ఒక రజతం, ఒక కాస్యం లభించాయి. జపాన్‌లోని టోక్యోలో ఆదివారం జరిగిన డెఫ్లింపిక్స్‌లో షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రపంచ రికార్డుతో ఎయిర్ రైఫిల్ బంగారు పతకాన్ని గెలుచుకోవడం ద్వారా భారతదేశానికి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. ఫైనల్‌లో 252.2 స్కోరుతో మొహమ్మద్ వానియా (250.1)ను ఓడించాడు. ధనుష్, వానియా కూడా అర్హత రౌండ్‌లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచారు. చివరకు ఫైనల్లో ధనుష్ విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఇక మహిళల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్ షూటర్లు మహిత్ సంధు, కోమల్ వాఘ్మారే రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. దీంతో మహిత్, కోమల్ భారత్ మొట్టమొదటి మహిళా ఎయిర్ రైఫిల్ పతక విజేతలుగా నిలిచారు. కాగా కాంస్య పతక పోరులో సాక్షిబన్సోడే ఓడిపోయింది. ఇక ఇతర క్రీడలైన బ్యాడ్మింటన్, జూడోలో కొన్ని పతక ఈవెంట్‌లతో ప్రారంభమైంది. జూడోలో సాక్షి బన్సోడే కిర్గిజ్స్థాన్‌కు చెందిన ఐగెరిమ్ డానియారోవాపై గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. అయితే తదుపరి టర్కియేకు చెందిన బుసే టిరాస్ చేతిలో ఓటమిచవిచూసింది. మహిళల 57 కిలోల విభాగంలో దక్షిణ కొరియాకు చెందిన యుంజి సియోతో జరిగిన కాంస్య పోటీలో ఆమె మరో కఠినమైన ఓటమిని చవిచూసింది.





## గెలిచే మ్యాచ్‌లో ఓడిన భారత్

### సౌతాఫ్రికా 30 రన్స్ తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో సౌతాఫ్రికా 30 రన్స్ తేడాతో టీమిండియాను చిత్తు చేసింది. 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకు ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్(31) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన వారు దారుణంగా విఫలమయ్యారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(0), కేఎల్ రాహుల్(1), ధ్రువ్ జురెల్(13), రిషభ్ పంత్(2), రవీంద్ర జడేజా(18), కుల్దీప్ యాదవ్ (1నాటౌట్), మహమ్మద్ సిరాజ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. చివర్లో అక్షర్ పటేల్ 26తో సరిపెట్టాడు. సౌతాఫ్రికా సిమన్ హర్మర్, మార్కో జాన్సన్, కేశవ్ మహరాజ్ రెండేసి, ఎయిడెన్ మార్క్‌రమ్ ఒక వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన సఫరీల తొలి ఇన్నింగ్స్‌లో 159 రన్స్‌కు ఆలౌటైంది. ఎయిడెన్ మార్క్‌రమ్ 31, వియాన్‌మల్డర్ 24 తో టాప్ స్కోరర్లుగానిలిచారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 5 వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించగా, సిరాజ్, కుల్దీప్ రెండేసి, అక్షర్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 189 పరుగులకుఆలౌటైంది. రాహుల్(39), సుందర్(29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రిషభ్(27), జడేజా(27) కీలక ఇన్నింగ్స్ ఆడారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్(3/35), సిమన్ హర్మర్(4/30) భారత్ పతనాన్ని శాసించగా, కేశవ్ మహరాజ్, కోర్బిన్ బోష్ చెరో వికెట్ పడగొట్టారు. 30రన్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 153 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ టెంబా బవుమా(55 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా, కార్బిన్ బోష్(25) అండగా నిలిచాడు. భారత బౌలర్లు జడేజా, కుల్దీప్, సిరాజ్ రెండేసి, బుమ్రా, అక్షర్ చెరో వికెట్ దక్కింది. దాంతో భారత్ ముందు 124 పరుగుల లక్ష్యం నమోదైంది. బవుమా, కార్బిన్ బోష్ 8వ వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఈ భాగస్వామ్యం మ్యాచ్‌ను సౌతాఫ్రికావైపు మలుపు తిప్పింది.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో నిరాశపరచిన భారత షూటర్లు



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ షూటర్లు నిరాశపరిచారు. ఈజిప్టు లోని కైరోలోని ఒలింపిక్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు పతకాలు సాధించలేకపోయారు. ఒలింపియన్ గుర్‌ప్రీత్ సింగ్ తొమ్మిదవ స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన యావో క్వియాన్‌క్సన్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణం, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లో రజతంతో పాటు తన మూడవ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సాధించింది. పురుషుల విభాగంలో స్విట్జర్లాండ్‌కు చెందిన అడ్రియన్ షాబ్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. పతకాల పట్టికలో చైనా, దక్షి ణ కొరియా తర్వాత భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్య పతకా లతో మూడవ స్థానంలో కొనసాగింది. చైనా 12 స్వర్ణాలు, 7 రజతాలు, 2 కాంస్యలు, కొరియా 7 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యం సాధించింది. ఇక పురుషుల ఈవెంట్‌లో గుర్పీత్ సింగ్ మొత్తం 571-14 స్కోరుతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. పోటీలో పాల్గొన్న ఇతర షూటర్లు ఉదయవీర్ సిద్ధు, రాజ్‌కన్వర్ సింగ్ సంధు వరుసగా 561-9, 559-6 స్కోరుతో 23, 24వ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో, పరిషా గుప్తా 556-11 స్కోరుతో భారత షూటర్లలో అత్యధికంగా 10వ స్థానంలో నిలిచింది. శిఖా చౌదరి 555-11 స్కోరుతో 12వ స్థానంలో నిలవగా, అగం గ్రేవాల్ 547-9 స్కోరుతో 19వ స్థానంలో నిలిచింది.

## ఎంక్యాష్ సేవలు నిలిపివేస్తున్న ఎస్‌బిఐ




**న్యూఢిల్లీ, నవంబరు 16:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు ఎంక్యాష్ సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈనెల 30వ తేదీ తర్వాత అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్ ఎస్‌బిఐ, యోనోలైట్ ద్వారా ఎంక్యాష్ సేవలువాడుకోలేరు. లబ్దిదారుని రిజిస్టరుచేయకుండా సొమ్ములు పంపిం చడం లేదా ఎంక్యాష్ లింక్‌ద్వారా ఆడబ్బును క్లెయిమ్‌చేసుకోడం వంటివి ఇకపై వీలుకాదు. ఇప్పటివరకూ నెట్‌బ్యాంకింగ్ కస్టమర్లు ఎవరికైనా సొమ్ము పంపించాలనుకుంటే ముందు బెనిఫిషియరీగా రిజిస్టరుచేసుకోవాల్సిన అవసరం ఉండేదికాదు. డబ్బు అందుకునే వ్యక్తి మొబైల్ నంబరు, మెయిల్ ఐడిని ఉపయోగించి సొమ్ములు పంపించేవారు. రిసీవర్ ఒక ఎస్ఎంఎస్‌లేదా మెయిల్‌రూపంలో ఎనిమిది అంకెల పాస్‌కోడ్ ఉండే సురక్షితమైన లింక్‌వచ్చేది. ఆ లింక్‌ద్వారా ఎస్‌బిఐ ఎంక్యాష్‌మొబైల్ యాప్‌ద్వారా ఏబ్యాంకు అకౌంట్‌లోఅయినా సొమ్మును క్లెయిమ్‌చేసుకునే అవకాశంఉండేది. ఇపుడు ఈ సేవలను నిలిపివేస్తోంది. ఎస్‌బిఐ ఇందుకోసం యుపిఐ,ఐఎంపిఎస్, నెఫ్ట్,ఆర్టీజీఎస్ వంటి మార్గాల్లో సొమ్ములు పంపించుకోవాలని డిమాండ్‌చేసింది. భీమ్‌ఎస్‌బిఐ పే యుపిఐ యాప్‌ను కూడా ఉపయోగించుకోవచ్చునిసూచించింది. బీమ్ ఎస్‌బిఐపే యాప్‌లోక లాగిన్ అయి పే అనే ఆప్షన్ ఎంచుకుని విపియె లేదా అకౌంట్‌నంబర్, ఐఎఫ్ఎస్‌సికోడ్ లేదా క్యూఆర్‌కోడ్‌వంటి ఒకపద్ధతి ఎంపికచేసుకోవాలి. డబ్బుపంపించే ఖాతాను ఎంచుకుని యుపిఐ పిన్ నమోదుచేస్తే లావాదేవీ పూర్తవుతుంది. ఎంక్యాష్ ఆగిపోయినా కస్టమర్లు ఎలాంటిఇబ్బందుల్లేకుండా డిజిటల్ చెల్లింపులుచేయొచ్చు.



## జమ్ముకాశ్మీర్‌లో 2.95 లక్షల బినామీ ఖాతాలు

### అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.465.79 కోట్లు

**శ్రీనగర్, నవంబరు 16:** ఉగ్రపీడిత జమ్ము కాశ్మీర్‌లో బ్యాంకు ఖాతాలుకూడాఅనేకం బినామీ ఖాతాలున్నాయి. ఈ ఖాతాలు సుదీర్ఘకాలంగా అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా పేరుకున్నాయి. వీటిలో ఉన్న మొత్తం సొమ్ము 465.79 కోట్లు ఎవ్వరూ తమవిగా క్లెయిమ్‌చేసుకోలేదని ఆర్‌బిఐ వెల్లడించింది. నిజమైన యజమానులను గుర్తించి వీలైనంత సత్వరమే ఈ మొత్తం తిరిగి ఇచ్చే ప్రక్రియను పూర్తిచేయాలని ఆర్‌బిఐ బ్యాంకులకు విజ్ఞప్తిచేసింది. జమ్ముజిల్లాలోమాత్రమే 2,94, 676 బినామీ ఖాతాలు ఉంటే వీటిలో మొత్తం 197.27 కోట్లవరకూసొమ్ము జమ అయి ఉందని ఆర్‌బిఐ ప్రాంతీయ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

ఈ పథకం కింద బినామీ ఖాతాలను యాక్టివ్‌చేసినందుకు లేదా మొత్తం తిరిగి ఇచ్చినందుకు బ్యాంకులకు నిల్వల్లో 7.5 శాతంలేదా గరిష్టంగా రూ.25వేల వరకూ ప్రోత్సాహకాలు ఇస్తామని ఆజాద్ తెలిపారు. ఈస్కీం వచ్చే ఏడాది సెప్టెంబరు 30వరకూ అమలులో ఉంటుందని జమ్ముకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలస్థాయి బ్యాంకర్ల కమిటీ అవగా హన, పరిష్కార శిబిరాలను నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు వారి క్లెయిమ్‌చేయని బ్యాంకు ఖాతాలు గురించి సమాచారం కూడా అందిస్తు న్నట్లు ఆజాద్ తెలిపారు.

## రుణాలకు క్రెడిట్‌స్కోరు ఒక్కటే ప్రామాణికం కాదు!




**ముంబయి, నవంబరు 16:** రిటైల్ రుణాలు, ఆన్‌లైన్ రుణాలు తీసుకునే కస్టమర్లు సహజంగా క్రెడిట్ స్కోరు 750 లేదా అంతకంటే ఎక్కువ ఉన్నప్పటికీ రుణం లేదా క్రెడిట్ కార్డ్ దరఖాస్తులు తిరస్కరిస్తారు.ఎందుకంటే బ్యాంకులు స్కోరును మాత్రమే చూడవు, మొత్తం ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ స్థిరత్వం, బాధ్యతల స్థాయిని కూడా పరిశీలిస్తాయి. క్రెడిట్ స్కోర్ అనేది గత చరిత్ర, గత రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని సూచిస్తుంది. అయితే క్రెడిట్ స్కోర్ ఆధారంగా మాత్రమే మొదటిసారి రుణగ్రహీతలను తిరస్కరించడం సముచితం కాదని ప్రభుత్వం,ఆర్‌బిఐ ఇప్పుడు స్పష్టం చేశాయి. కస్టమర్ మొత్తం ఆర్థిక సామర్థ్యాలు, సాధారణ ఆదాయం, ప్రస్తుత ఆర్థిక బాధ్యతలను అంచనా వేసిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని బ్యాంకులకు సూచించింది. రుణ మంజూరులో ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం. తరచుగా ఉద్యోగాలు మారుస్తుంటే లేదా ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉంటే, బ్యాంకులు ప్రమాదకర కస్టమర్‌గా పరిగణించవచ్చు. ఒకే రంగంలో స్థిరంగా పనిచేయడం, నమ్మకమైన కంపెనీతో సంబంధం కలిగి ఉండటం అనుకూలంగా పనిచేస్తుంది. మీ ప్రస్తుత అప్పు బ్యాంకులకు కూడా ముఖ్యమైనది. మీ ఆదాయంలో 40నుంచి 50 శాతం కంటే ఎక్కువ ఇఎంఐ చెల్లింపుల కోసం ఖర్చు చేస్తే, బ్యాంకులు కొత్త రుణం ఇవ్వడానికి వెనుకాడతాయి. మరో ప్రధాన కారణం ఏమిటంటే ప్రజలు ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ లోన్లు లేదా క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటారు. దీని ఫలితంగా మీ క్రెడిట్ నివేదికలో బహుళ కఠినమైన విచారణలు కనిపిస్తాయి. బ్యాంకులు దీనిని ఆర్థిక ఒత్తిడికి సంకేతంగా భావిస్తాయి, ఇది దరఖాస్తు తిరస్కరించబడే అవకాశాలను పెంచుతుంది. అదనంగా మీరు దరఖాస్తు చేసుకుంటున్న బ్యాంకుతో మీ గత రికార్డు కూడా ముఖ్యమైనది. కొత్త నిబంధనల ప్రకారం మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస క్రెడిట్ స్కోర్ నిబంధన తొలగించబడింది. దీని అర్థం బ్యాంకులు ఇకపై కేవలం స్కోరు ఆధారంగా మాత్రమే రుణాలను తిరస్కరించలేవు. వారు కస్టమర్ ఆర్థిక బలం, రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం, ఉద్యోగ భద్రత వంటి ఇతర అంశాలను అంచనా వేస్తారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps